అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 14-9-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 207 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50




నిరంకుశత్వం ప్రబలుతుంది

ప్రజాస్వామ్యానికి ప్రమాదం

- ప్రభుత్వంలో జవాబుదారీతనం లోపిస్తుంది
- తగ్గే వ్యయం కూడా తక్కువే
- 'ఒకే దేశం...ఒకే ఎన్నిక'పై నిపుణుల మనోగతం

ప్రజాస్వామిక వ్యవస్థలో ఏదైనా మార్పు చేసేటప్పుడు దానిని కూలంకషంగా పరిశీలించాల్సి ఉంటుంది. ఇతర ప్రజాస్వామిక సంస్థల పైన, మొత్తంగా ప్రజాస్వామ్యం పైన దాని ప్రభావం ఏమైనా ఉంటుందా అనేది పరిశీలించాల్సిన అవసరం ఉంది. సానుకూల ప్రభావం ఉంటుందని నిర్ధారణకు వచ్చినప్పుడే ముందడుగు వేయాలి. ప్రస్తుతం 'ఒకే దేశం...ఒకే ఎన్నిక' వాదనపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. దీని హేతుబద్ధతపై అధ్యయనం జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జమిలి ఎన్నికలపై నిపుణులు ఏమంటున్నారంటే...



న్యూఢిల్లీ : లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు వేర్వేరుగా ఎన్నికలు జరిపితే వ్యయం తడిసిమోపెడవుతుందని కేంద్ర పెద్దలు ప్రవచిస్తున్నారు. సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం 2019 లోక్‌సభ ఎన్నికల వ్యయం రూ.55 వేల కోట్లు. ప్రపంచంలోనే ఇంత ఖరీదైన ఎన్నికలు జరగలేదని ఆ సంస్థ చెబుతోంది. దేశంలో ఎన్నికల వ్యయాన్ని తగ్గించాలన్న విషయంలో వేరే అభిప్రాయాలకు తావే లేదు. వ్యయాన్ని తగ్గించి, ఆ వనరులను ఆర్థిక వ్యవస్థలోని మరిన్ని ఉత్పాదక రంగాలకు మళ్లిస్తే మేలే జరుగుతుంది. కానీ జమిలి వల్ల నిజంగానే వ్యయం తగ్గుతుందా? లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు వేర్వేరుగా ఎన్నికలు జరిపితే విధుల్లో పాల్గొనే కేంద్ర దళాలు, అధికారులు, సిబ్బంది వాటి కోసం ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుంది. అదే ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ఆ సమస్య ఉండదు. జమిలి ఎన్నికల వల్ల సుస్థిరత సాధ్యపడుతుందన్న వాదన కూడా కేంద్రం చేస్తున్నది. తరచుగా ఎన్నికలు జరుగుతుంటే రాజకీయ పార్టీలు, నాయకులు ప్రచారానికే పరిమితమవుతారని,. ఇది పరిపాలనపై ప్రభావం చూపుతుందని, ఇన్ని సానుకూలతలు ఉన్నందునే

...11లో

విడివిడిగా జరిగితే...

జమిలి ఎన్నికల కారణంగా జవాబుదారీతనం లోపించే ప్రమాదం ఉంది. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ విడివిడిగా ఎన్నికలు జరిపినప్పుడే రాజకీయ పార్టీలు నిరంతరం ప్రజలకు జవాబుదారీగా వ్యవహరిస్తాయి. ఎక్కడైనా ఉప ఎన్నికలు జరిగితే పాలకులు తమ లోపాలను సవరించుకొని, ఓటర్ల మెప్పు పొందడానికి ప్రయత్నిస్తారు. అలాంటివేమీ లేకపోతే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరించే ప్రమాదం ఉంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుంటే భారత్ వంటి దేశాలలో విడివిడిగా ఎన్నికలు జరిపితేనే ప్రభుత్వాలు, వాటి ఆజమాయిషీలో పనిచేసే సంస్థలు మరింత జాగరూకతతో, జవాబుదారీతనంతో వ్యవహరిస్తాయని అవగతమవుతుంది. జమిలి ఎన్నికలలో కేంద్రంలోనూ, రాష్ట్రాల లోనూ ఒకే పార్టీ అధికారంలోకి వస్తే ప్రభుత్వాలలో జవాబుదారీతనం తగ్గడంతో పాటు పాలకులలో నిరంకుశ ధోరణులు ప్రబలుతాయి. తద్వారా ప్రజాస్వామ్యానికే ముప్పు ఏర్పడుతుంది.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్

భోపాల్‌లో భారీ ర్యాలీ

సీట్ల పంపకానికి సంబంధించిన ప్రక్రియకు శ్రీకారం

- ఇండియా కూటమి సమన్వయ కమిటీ మొదటి భేటీ నిర్ణయం

న్యూఢిల్లీ : పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, బీజేపీ ప్రభుత్వ అవినీతిపై అక్టోబర్ మొదటి వారంలో మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో తొలి బహిరంగ సభ, ర్యాలీ జరిపేందుకు ప్రతిపక్షాల ఇండియా కూటమి సమన్వయ కమిటీ నిర్ణయించింది. బుధవారం నాడిక్కడ ఎన్సీపీ అధినేత శరద్ పవార్ నివాసంలో ఇండియా కూటమి సమన్వయ కమిటీ మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటీకి ఎంపికైన 12 పార్టీల నుంచి శరద్ పవార్ (ఎన్సీపీ), డి.రాజా (సీపీఐ), హేమంత్ సోరెన్ (జేఎంఎం), కెసి వేణుగోపాల్ (కాంగ్రెస్), టిఆర్ బాలు (డీఎంకే), తేజస్వి యాదవ్ (ఆర్జేడీ), సంజయ్ రౌత్ (శివసేన), సంజయ్ ఝా (జేడీయూ), జావెద్ అలీ (ఎస్పీ), రాఘవ్ చద్దా (ఆప్), ఒమర్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), మెహబూబా ముఫ్తి (పీడీపీ) పాల్గొన్నారు. బీజేపీ ప్రతీకార రాజకీయాల కారణంగా, ఈడీ సమన్ల వల్ల టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ, జేడీయూ నేత లలన్ సింగ్ హాజరుకాలేదు.


సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో

...11లో

17న అఖిలపక్షం

న్యూఢిల్లీ : ఈ నెల 18 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఒకరోజు ముందుగా 17 సాయంత్రం 4.30 గంటలకు అన్ని పార్టీలకు చెందిన సభా నాయకులతో కేంద్రం సమావేశాన్ని ఏర్పాటుచేసింది. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ఈ విషయాన్ని ఓ ట్వీట్‌లో ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానాన్ని ఈ-మెయిల్ ద్వారా అన్ని పార్టీల సభా నేతలకు పంపించినట్టు చెప్పారు.

ఈ నెల 18 నుంచి 22 వరకూ ఐదు రోజుల పాటు ఈ ప్రత్యేక సమావేశాలు జరుగుతున్న విషయం తెలిసిందే. గణేష్ చతుర్థి నాడు కొత్త పార్లమెంట్ భవనంలో ప్రత్యేక సమావేశాలు జరుగుతాయి. కాగా, ప్రత్యేక సమావేశాల ఎజెండాను గుట్టుగా ఉంచడంపై ప్రతిపక్ష నేతల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమావేశాల తేదీలు దగ్గరపడుతున్నా, ఎజెండా



పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ

ఏమిటనేది ఇద్దరు వ్యక్తులకు మాత్రమే తెలుసునని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ట్వీట్ చేశారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసినప్పుడు ఉభయ సభల ప్రతిపక్ష నాయకులతో ప్రభుత్వం సంప్రదింపు జరపాల్సి ఉంటుందని సీపీఐ నేత డి.రాజా అన్నారు. కానీ

...11లో

తెలంగాణపై కాంగ్రెస్

హైకమాండ్ ఫోకస్

గెలిచి తీరాలంటూ ప్రణాళికలు

- ప్రతి సమావేశంలోనూ దిశానిర్దేశం
- క్షేత్రస్థాయి పర్యవేక్షణలోనూ కీలకం
- ఎప్పటికప్పుడు ఏఐసీసీకి నివేదికలు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంపై కాంగ్రెస్ అధిష్టానం కేంద్రీకరించింది. కర్నాటక తర్వాత రాష్ట్రంలోనూ అధికారంలోకి రావాలనే పట్టుదలతో పనిచేస్తోంది. గతంలోలాగా అంతా రాష్ట్ర నాయకత్వంపై వదిలేయకుండా అన్నీ తానై వ్యవహరిస్తున్నది. మొత్తంగా రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల ప్రక్రియ పూర్తిగా అధిష్టానం కనుసన్నల్లోనే కొనసాగుతున్నది. తెలంగాణ రాష్ట్రానికి గత రెండు నెలల్లో ఢిల్లీ నుంచి 30 మంది దూతలు వచ్చారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్ చౌదరి, మన్సూర్‌అలీ ఖాన్, వి. విశ్వనాథ్...ఇక్కడే మకాం వేశారు. గాంధీభవన్ నుంచి ఠాక్రే పర్యవేక్షణ చేస్తుండగా, మిగతా ముగ్గురు మాత్రం జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఆయా జిల్లాల్లో నిర్మాణం, పార్టీ బలోపేతం, అంతర్గత విభేదాలు తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. పార్టీ దృష్టికి వస్తున్న సమస్యలను హైకమాండ్‌కు నివేదిస్తున్నారు. రాష్ట్రంలోని 17పార్లమెంట్ నియోజకవర్గాలకు ఒక ఇంచార్జితోపాటు వారందరికీ కన్వీనర్‌గా దీపదాస్ మున్షీని, కో కన్వీనర్‌గా మీనాక్షి


...11లో

నాలుక కోస్తా కండ్లు పీకేస్తా..

ఆగ్రహంతో ఊగిపోయిన కేంద్ర మంత్రి షెకావత్

- సనాతన ధర్మాన్ని వ్యతిరేకిస్తే తరిమేస్తామని హెచ్చరిక

జైపూర్ : సనాతన ధర్మాన్ని వ్యతిరేకించే వారిపై కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అవాకులు చవాకులు పేలారు. అలాంటి వారి నాలుక కోస్తానని, కళ్లు పీకేస్తానని బెదిరించారు. రాజస్థాన్‌లోని బర్మర్‌లో మంగళవారం నిర్వహించిన ఓ ర్యాలీలో కేంద్ర మంత్రి పెట్రేగిపోయారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన ప్రకటనపై ఆయన ఆగ్రహంతో ఊగిపోయారు. షెకావత్ ప్రసంగం సామాజిక మాధ్యమాలలో వైరల్ అయింది. సనాతన ధర్మానికి ఎదురవుతున్న



సవాళ్లను కలిసికట్టుగా ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు. 'సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడే వారి నాలుక కోసేయాలి. ఆ ధర్మానికి వ్యతిరేకంగా ఎవరైనా కళ్లు విప్పితే వాటిని

...11లో

పెంచిన వేతనాలకు బడ్జెట్ ఇవ్వకపోతే

పాఠశాలల్లో వంట బంద్

ప్రగతిభవన్‌నూ ముట్టడిస్తాం

- ధర్నాచౌక్‌లో మధ్యాహ్న భోజన కార్మికుల భారీ ధర్నా
- రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది రాక
- మీ జీతాలు పెంచుకుంటారు..మా సంగతేంటి ?: సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఆగ్రహం
- ఎర్రజెండాలు స్వార్థ రాజకీయాలు చేయవు:జె.వెంకటేశ్ స్పష్టీకరణ

వేతనాలివ్వకపోతే గంటెలు మడతేయాలి:ఎస్ వి రమ పిలుపు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వేతనాలకు బడ్జెట్ కేటాయించి వెంటనే నిధులివ్వకపోతే ప్రభుత్వ పాఠశాలల్లో వంటను బంద్ చేస్తామని మధ్యాహ్న భోజన కార్మికులు హెచ్చరించారు. అవసరమైతే ప్రగతిభవన్‌నూ ముట్టడిస్తామని ప్రకటించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో నిర్వహించిన ఆందోళన ద్వారా అల్టిమేటమ్ ఇచ్చారు. ఏండ్ల తరబడి తమ కష్టాలు, బాధలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్(సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా హాజరయ్యారు. దాదాపు అన్ని

...2లో

రేపే టెట్

సర్వంసిద్ధం చేసిన విద్యాశాఖ

- **4,78,055** మంది అభ్యర్థులు
- **2,052** పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- పరీక్ష జరిగే స్కూళ్లు, కాలేజీలకు నేడు, రేపు సెలవు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్ష జరగనుంది. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు సర్వంసిద్ధం చేశారు. ఈ మేరకు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, టెట్ కన్వీనర్ ఎం రాధారెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్‌కు 4,78,055 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. వారికోసం రాష్ట్రవ్యాప్తంగా 2,052 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఇందులో పేపర్-1కు 2,69,557 మంది దరఖాస్తు చేస్తే వారికోసం 1,139 పరీక్షా కేంద్రాలు, పేపర్-2కు 2,08,498 మంది దరఖాస్తు చేయగా, వారి కోసం 913 పరీక్షా కేంద్రాలున్నాయని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం

...11లో



అది ఎర్రజెండా వారసత్వం

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో బీజేపీ, బీఆర్ఎస్‌లకు సంబంధమేంటి?

- జమిలి ఎన్నికలు ప్రమాదకరం
- సనాతన ధర్మం అంటే కుల వ్యవస్థే : సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల కోసమే బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ 'సెప్టెంబర్ 17' పేరుతో సభలు పెడుతున్నాయని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు అన్నారు. సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం అధ్యక్షతన ఏఎస్‌రావు నగర్‌లోని అనుపురం కమ్యూనిటీ హాల్‌లో బుధవారం వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. బూర్జువా పార్టీలకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంపై గౌరవం లేదన్నారు. తెలంగాణలో ఇప్పటికీ భూస్వాములు, దొరలు ఉన్నారన్నారు. అప్పట్లో కమ్యూనిస్టులు ప్రజా పోరాటాలతో నిజాం, కాంగ్రెస్ ప్రభుత్వాలను లొంగదీసినట్టు చెప్పారు. రైతుల పక్షాన కమ్యూనిస్టులు నిలబడ్డారు కాబట్టే నేడు తెలంగాణలో రైతులకు భూములు మిగిలాయని చెప్పారు. అందుకే ప్రజలు కమ్యూనిస్టులకు అభిమానులుగా ఉన్నారన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌కు సెప్టెంబర్17తో సంబంధం ఉన్నట్టు ఆ పార్టీల నేతలు కొత్త బిచ్చగాళ్లలాగా మాట్లాడుతున్నారని విమర్శించారు. సంస్థానాలకు వ్యతిరేకంగా సాగిన పోరాటాలకు ఆర్ఎస్ఎస్ వ్యతిరేకం అన్నారు. అందుకే కమ్యూనిస్టులపై ఆర్ఎస్ఎస్ దుష్ప్రచారం చేస్తోందన్నారు. ప్యూడలిజానికి హిందూ, ముస్లిం అనే తేడా లేదన్నారు. బీజేపీ ప్రజాస్వామ్యానికి

...11లో

18 తరువాతే

కస్టడీ పిటిషన్‌పై విచారణ

ఏసీబీ కోర్టుకు హైకోర్టు ఆదేశం

- చంద్రబాబు క్వాష్ పిటిషన్ విచారణ 19కి వాయిదా



అమరావతి : ఏపీ సిల్క్ డెవలప్‌మెంట్ సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) నిధుల దుర్వినియోగం కేసులో సీఐడీ నమోదు చేసిన కస్టడీ పిటిషన్‌పై విచారణను ఈ నెల 18వ తేదీ వరకు చేపట్టరాదని ఏసీబీ కోర్టును హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు బుధవారం మధ్యంతర

ఉత్తర్వులు జారీ చేసింది. ఈలోగా ప్రతివాదులైన మంగళగిరి సీఐడీ ఎస్‌హెచ్‌ఒ, ఫిర్యాదుదారుడైన ఏపీఎస్ఎస్‌డీసీ ఛైర్మన్ కె అజయ్‌రెడ్డి తదితరులు తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. జస్టిస్ కె శ్రీనివాస్‌రెడ్డి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టేయాలని, ఏసీబీ కోర్టు విధించిన రిమాండ్‌ను రద్దు చేయాలని కోరుతూ టీడీపీ అధినేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి

...11లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 59,450	▼	380
క్యారెట్లు	- 54,500	▼	340
కిలో వెండి	- 77,000	▼	1000



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 141
రిటైల్ (లైవ్)	రూ. 163
స్కిన్‌తో	రూ. 236
స్కిన్‌లెస్	రూ. 269

సీడబ్ల్యూసీ సమావేశాల షెడ్యూల్




నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాల షెడ్యూల్‌ను ఏఐసీసీ విడుదల చేసింది. సీడబ్ల్యూసీ సమావేశాలను పురస్కరించుకుని ఈనెల 16,17, 18 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించబోయే సమావేశాలు, సభలు, కార్యక్రమాల వివరాలను ఈమేరకు బుధవారం వెల్లడించింది. 16న మధ్యాహ్నం భోజనానంతరం రెండు గంటలకు సీడబ్ల్యూసీ సమావేశం ప్రారంభం కానుంది. 17న సీడబ్ల్యూసీ విస్తృత సమావేశం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానుంది. ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ సభ్యులు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నాయకులు, ఏఐసీసీ ఆఫీస్‌బేరర్లు హాజరుకానున్నారు. సాయంత్రం ఐదు గంటలకు విజయభేరి సభలో పాల్గొంటారు. అంతకు ముందు మెగా ప్రదర్శన ఉంటుంది. ఆ సభలో ఐదు హామీలను ఇస్తారు. 18న ఉదయం కార్యకర్తల సమావేశం... ఆ తర్వాత డోర్ టు డోర్ ఐదు హామీల కరపత్రాల పంపిణీ. దీంతోపాటు బీఆర్ఎస్ వైఫల్యాలపై చార్జిషీట్ విడుదల చేస్తారు. మధ్యాహ్నం కార్యకర్తలతో కలిసి సమూహిక భోజనాలు, సాయంత్రం గాంధీ, అంబేద్కర్, కొమురంభీమ్ విగ్రహాల వద్ద భారత్ జోడో మార్చ్ నిర్వహిస్తారు. సీడబ్ల్యూసీ సమావేశాల నిర్వహణకు పలు కమిటీలను నియమించింది. ఆహ్వాన కమిటీ ఛైర్మెన్‌గా రేవంత్‌రెడ్డి, సోషల్ మీడియా కమిటీ ఛైర్మెన్ శ్రీధర్‌బాబు, రవాణా కమిటీ ఛైర్మెన్‌గా బి మహేష్‌కుమార్‌గౌడ్, పబ్లిసిటీ మరియు బ్రాండింగ్ కమిటీ ఛైర్మెన్‌గా పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జీహెచ్ఎంసీ పబ్లిసిటీ కమిటీ ఛైర్మెన్‌గా మహ్మద్ అజరుద్దీన్, ప్రొటోకాల్ కమిటీ ఛైర్మెన్‌గా హర్కర వేణుగోపాల్‌తోపాటు ముఖ్య నాయకులను సభ్యులుగా నియమించింది.

కరీంనగర్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి హామీ ఇవ్వండి
మ్యానిఫెస్టో కమిటీ ఛైర్మెన్‌కు కొనగాల మహేష్ వినతి

వచ్చే ఎన్నికల హామీల్లో కరీంనగర్‌కు ఎయిర్‌పోర్టు ఇస్తామని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి హామీ ఇవ్వాలని టీపీసీసీ అధికార ప్రతినిధి కొనగాల మహేష్ మ్యానిఫెస్టో కమిటీ ఛైర్మెన్ శ్రీధర్‌బాబును కోరారు. ఈమేరకు బుధవారం గాంధీభవన్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. అదే విధంగా ప్రభుత్వ ఇంజినీరింగ్, ఐటీఐ కళాశాలను ఏర్పాటుకు మ్యానిఫెస్టోలో పొందుపరచాలని కోరారు. మున్నూరుకాపు కార్పొరేషన్, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు బడ్జెట్ పెంపుదల తదితర హామీలను పొందుపరచాలని విజ్ఞప్తి చేశారు.

యూపీ నుంచి ఖర్గే పోటీ?



న్యూఢిల్లీ : దేశంలో అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో మళ్లీ ఉనికి చాటుకునేందుకు, పార్టీని తిరిగి బలోపేతం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సరికొత్త ఆలోచన చేస్తోంది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఆ రాష్ట్రం నుంచి పోటీ చేయించాలని భావిస్తోంది. తద్వారా రాష్ట్రంలోని దళిత ఓటర్లను తనవైపు తిప్పుకోవచ్చని అంచనా వేస్తోంది. రాష్ట్రంలోని ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలైన ఇటావా, బారాబంకి నియోజవర్గాల్లో ఏదో ఒక చోట నుంచి ఖర్గేను పోటీ చేయించేలా కాంగ్రెస్ ప్రణాళిక రూపొందిస్తోంది. దీంతోపాటు కర్ణాటకలోని ఖర్గే సొంత నియోజకవర్గం నుంచి కూడా ఆయనను బరిలోకి దించనుంది. ఉత్తర ప్రదేశ్‌లోనూ ఖర్గేను నిలపడం ద్వారా ఇటు కాంగ్రెస్‌తో పాటు అటు ఇండియా ఫోరంలో భాగస్వామిగా ఉన్న సమాజ్‌వాది పార్టీ (ఎస్పీ)కి కూడా దళితుల మద్దతు పెరుగుతుందని అంచనా వేస్తోంది. మరోవైపు రాహుల్‌గాంధీ.. కేరళలోని ప్రస్తుత సిటింగ్ స్థానం వయనాడ్‌తోపాటు ఉత్తరప్రదేశ్‌లోని అమేథి నుంచి మళ్లీ పోటీ చేసే అవకాశాలు ఉన్నట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు.

ఇంజినీరింగ్ శాఖల్లో 'ఇంజినీర్స్ డే'

- రక్తదాన శిబిరం నిర్వహణకు సన్నాహాలు

నవతెలంగాణ-హైదరాబాద్

ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య పుట్టిన రోజు నేపథ్యంలో ఈనెల 15న హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయంలో ఇంజినీర్స్ డే నిర్వహించనున్నారు. ఈమేరకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, మిషన్ భగీరథ ఉద్యోగ సంఘాలు ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా రక్తదానం శిబిరం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో రెండు శాఖల ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు ఎజీ సంజీవరావు, ఎం కృపాకర్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని పీఆర్ సీఈ జీ సీతారాములు తెలిపారు అలాగే పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానీయాను ఆహ్వానించనున్నట్టు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.





అలుపెరగని అన్నదాత పోరాటం

గ్రేటర్ నోయిడాలో 120 రోజులుగా ఏఐకేఎస్ ఆందోళన

- బారికేడ్లు పగులగొట్టి, గేట్లకు తాళాలు వేసిన రైతులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ బుల్డోజర్ రాజ్‌కు ఏఐకేఎస్ నాయకత్వంలో రైతులు అలుపెరని పోరాటం చేస్తున్నారు. భూసేకరణకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 120 రోజులుగా పోరాటం కొనసాగుతోంది. గ్రేటర్ నోయిడా డెవలప్‌మెంట్ అథారిటీని వేలాది మంది రైతులు బారికేడ్లను బద్దలు కొట్టి రెండు ప్రధాన గేట్లకు తాళాలు వేసి ముట్టడించారు. అయితే రైతులను అడ్డుకోవడానికి పోలీసులు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఈ ఆందోళనలో మహిళలు, యువత పోరాటానికి కేంద్ర బిందువుగా నిలిచారు.

న్యాయపరమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ.. అధికార యంత్రాంగంపై రైతులు ఒత్తిడి చేశారు. పలు డిమాండ్లను అధికార యంత్రాంగం మౌఖికంగా అంగీకరించింది. అయితే గురువారం చర్చల లిఖితపూర్వక మినిట్స్ పొందే వరకు పోరాటం కొనసాగించాలని ఏఐకేఎస్ నిర్ణయించింది. ఈ ఆందోళనలో ఏఐకేఎస్ అధ్యక్షులు అశోక్ ధావలే, ఉపాధ్యక్షుడు ఇంద్రజిత్ సింగ్, కోశాధికారి పి .కృష్ణప్రసాద్, ఉత్తరప్రదేశ్ అధ్యక్షుడు భరత్ సింగ్, ఉత్తర ప్రదేశ్ సహాయ కార్యదర్శి దిగంబర్ సింగ్, కేంద్ర కమిటీ నేతలు సభ్యులు పుష్పేంద్ర త్యాగి, మనోజ్ కుమార్, రూపేష్ వర్మ, నిధీష్ విల్లట్, ఐద్వా జాయింట్ సెక్రెటరీ ఆశా శర్మ తదితరులు పాల్గొన్నారు.

22న దేశవ్యాప్త ఆందోళనలు

రెండో దశ ఉద్యమం కార్యాచరణకు ఎస్‌కేఎం, ఏఐఏడబ్ల్యూయూ పిలుపు

- వరద ముంపునకు గురైన ప్రాంతాలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్
- లఖింపూర్ ఘటనకు బాధ్యుడైన మంత్రిని బర్తరఫ్ చేయాలని అక్టోబర్ 3న ధర్నాలు
- నవంబర్ 26, 27, 28 రాష్ట్ర రాజధానుల్లో మహా పడావ్



గువహతి : కార్మిక, కర్షక ఉద్యమాలే కార్పొరేట్ మతోన్మాద బీజేపీని ఓడిస్తాయని, ఎస్‌కేఎం రెండో దశ ఉద్యమానికి రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు సిద్ధం కావాలని ఎస్‌కేఎం, ఏఐఏడబ్ల్యూయూ పిలుపునిచ్చాయి. అసోం రాజధాని గువహతిలో జరిగిన సదస్సులో ఎస్‌కేయం జాతీయ నేత, మాజీ పార్లమెంట్ సభ్యులు హన్నన్ మొల్లా, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడారు. వరద ప్రాంతాలను జాతీయ విపత్తుగా ప్రకటించి.. రైతాంగాన్ని, వ్యవసాయ కార్మికులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న ఆందోళనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఎస్‌కేయం రెండో దశ దేశవ్యాప్త ఉద్యమ కార్యచరణను ప్రకటించారు. లఖింపూర్ ఘటనకు బాధ్యుడైన కేంద్ర మంత్రిని బర్తరఫ్ చేయాలని అక్టోబర్ 3న, బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నవంబర్ 26, 27, 28 తేదీల్లో వేలాది మందితో అన్ని రాష్ట్రాల రాజధానుల్లో మహాపడావ్ నిర్వహించడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎస్‌కేయం నిర్వహించిన సదస్సుకు నిర్వాసిత యువ రైతులను నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. 1000 మంది సీటింగ్ కెపాసిటీ కలిగిన ఆడిటోరియం కిక్కిరిసిపోయింది. బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తున్న అభ్యుదయ సంఘాల ప్రతినిధులు అందరూ ఈ సదస్సులో పాల్గొని ప్రసంగించారు.

జీడీపీలో 50 లక్షల కోట్ల పైన వ్యవసాయ రంగం నుంచే ఆదాయం సమ కూరుతుందనీ, దీనిపై కార్పొరేట్ శక్తుల ఆదిపత్యం చెలాయించేందుకే వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేటీకరణ చేసే విధానాలను బీజేపీ ముందుకు తెస్తున్నదని విమర్శించారు. రైతులు ఉపయోగించే వ్యవసాయ కరెంటు మోటార్లకు మీటర్ల బిగించి రైతుల నుంచి బిల్లులు వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి పెంచుతుందని చెప్పారు. గ్రామీణ ఉపాధి హామీ పని కల్పన నుంచి తప్పించుకోవడం కోసమే బడ్జెట్‌లో నిధులను నాలుగు శాతం నుంచి 1.37శాతానికి తగ్గించారని తెలిపారు.

సున్నితమైన అసోం లాంటి ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ అనుసరిస్తున్న విధానాలు దేశ భద్రతకు ప్రమాదంగా మారుతున్నాయి. మణిపూర్‌లో మంటలు ఆరిపోకుండా ఆజ్యం పోస్తున్నారని విమర్శించారు. అసోంలో డీలిమిటేషన్, ఎన్‌సీసీ లాంటి మతోన్మాద ఏజెండాలను అమలు చేయడం ద్వారా ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి అసోం ముఖ్యమంత్రి హేమంత్ బిస్వాస్ అడ్డూ అదుపూ లేకుండా రాజ్యాంగ విరుద్ధంగా రెచ్చగొట్టేటట్లు మాట్లాడుతున్నారనీ, బీజేపీ దుష్టపన్నాగాలను ప్రజలు గమనిస్తున్నారని వాటిని తిప్పి కొట్టడానికి సిద్ధమవుతున్నారని చెప్పారు. బీజేపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళల పైన ప్రభుత్వాల మద్దతుతోనే దాడులు, హత్యలు, లైంగికదాడులు జరుగుతున్నాయని చెప్పారు.

75 లక్షల ఉచిత గ్యాస్ కనెక్షన్లు

- రూ.7,210 కోట్లతో ఈ-కోర్ట్స్ ప్రాజెక్టు : కేంద్రమంత్రివర్గం ఆమోదం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వచ్చే మూడేండ్లలో కొత్తగా 75 లక్షల ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేందుకు కేంద్రమంత్రివర్గం ఆమోదించింది. రూ.7,210 కోట్లతో ఈ-కోర్ట్స్ ప్రాజెక్టు మూడో దశ వంటి పలు నిర్ణయాలను కేంద్ర మంత్రి వర్గం ఆమోదించింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలను కేంద్ర మంత్రి అనురాగ్ ఠాగూర్ మీడియాకు వెల్లడించారు.

మెస్సర్స్ సువెన్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్‌లో రూ.9,589 కోట్ల వరకు విదేశీ పెట్టుబడులకు సంబంధించి అందిన ప్రతిపాదనకు ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. రూ.7,210 కోట్లతో ఈ-కోర్ట్స్ మిషన్ మోడ్ ప్రాజెక్టు మూడో దశకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. న్యాయ వ్యవస్థలో మరింత పారదర్శకత, కాగిత రహిత కార్యకలాపాల కోసం రూపొందించిన ఈ- కోర్టులను వచ్చే నాలుగేండ్లలో అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ ఫైలింగ్, ఈ పేమెంట్ వ్యవస్థకు ఉపయుక్తంగా ఉండే కోర్టు కాంప్లెక్సుల్లో 4,400 ఈ-సర్వీసు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రూ.1,650 కోట్లతో మరో 75 లక్షల గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేయాలని కేంద్రమంత్రివర్గం నిర్ణయించిందని తెలిపారు. ఉజ్వల యోజనకు అదనంగా మూడేండ్ల పాటు వీటిని పంపిణీ చేస్తామని తెలిపిందన్నారు.

జీ20 శిఖరాగ్ర సదస్సును విజయవంతం చేసినందుకుగాను యావత్ దేశ ప్రజల తరపున ప్రధాని మోడీకి అభినందనలు తెలుపుతూ చేసిన ఓ తీర్మానానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జీ20లో ఆఫ్రికన్ యూనియన్ చేరిక, గ్లోబల్ బయోఫ్యుయల్ అలయెన్స్ ఏర్పాటు వంటి ప్రధాని మోడీ ప్రతిపాదించిన అంశాలపై ఏకాభిప్రాయం తీసుకురావడం దేశం మొత్తానికి ఎంతో గర్వకారణమని క్యాబినెట్ ప్రశంసించింది. ఇలా జీ20 సమావేశాలను విజయవంతంగా నిర్వహించినందుకు ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలుపుతూ చేసిన ఓ తీర్మానాన్ని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ ప్రతిపాదించగా.. దాన్ని కేంద్ర మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది.

నిరాశకు లోనుకావద్దు...అధైర్యపడొద్దు

- వంద రోజుల్లో పార్టీ అధికారంలోకి వస్తుంది
- మీ తలరాతను మారుస్తుంది : కౌలు రైతులకు రేవంత్ బహిరంగ లేఖ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వంద రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తోందనీ, మీ తలరాతను మారుస్తోందని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి కౌలు రైతులకు భరోసా ఇచ్చారు. ఎవరూ నిరాశకు లోనుకావద్దనీ, అధైర్యపడొద్దని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బుధవారం కౌలు రైతులకు రేవంత్ బహిరంగ లేఖ రాశారు. గతేడాది మేలో రాహుల్ గాంధీ సమక్షంలో వరంగల్‌లో రైతు డిక్లరేషన్ ప్రకటించిందని తెలిపారు. రైతు డిక్లరేషన్ ప్రకారం ఇందిరమ్మ రైతు భరోసా పథకం తెచ్చి భూమి కలిగిన రైతులకు, కౌలు రైతులకు కూడా ప్రతి ఎకరాకు, ఏడాదికి రూ.15 వేల పెట్టుబడి సాయం చేస్తామని హామీ ఇచ్చామని తెలిపారు. ఉపాధి హామీలో నమోదు చేసుకున్న భూమి లేని రైతు కూలీలకు ప్రతి ఏడాది రూ.12 వేలు ఇస్తామని భరోసా ఇచ్చారు. రైతులు పండించిన అన్ని పంటలకు మెరుగైన గిట్టుబాటు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుందనీ, మెరుగైన పంటల బీమా పథకాన్ని తెచ్చి... ప్రకృతి విపత్తుల వల్లనో, మరో కారణంగానో పంట నష్టం జరిగితే శరవేగంగా నష్టం అంచనా వేయించి...పరిహారం అందేలా చూస్తామని పేర్కొన్నారు.

రైతులను గాలికొదిలేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకా ఏవో చేస్తాయని ఆశలు పెట్టుకోవడం దండగ అని పేర్కొన్నారు. కౌలురైతు కూడా రైతేనని తెలిపారు. వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి, రుణాలతోసహా అన్ని పథకాలను వర్తింపజేస్తూ గతంలో కౌలు రైతుల గుర్తింపు చట్టం చేసింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. రైతులకు పావలావడ్డీకే రుణాలు, పంటల బీమా, రైతు బీమా, ఇందిర జలప్రభ, రాయితీ విత్తనం, ఇన్‌ఫుట్ సబ్సిడీలు, పండిన పంటకు మద్దతు ధర, పంటల కొనుగోలుకు ఐకేపీ కేంద్రాల ఏర్పాటు వంటి సమగ్ర రైతు అనుకూల నిర్ణయాలతో వ్యవసాయాన్ని పండగ చేసింది కాంగ్రెస్ పార్టీ తెలిపారు.

పెంచిన వేతనాలకు బడ్జెట్ ఇవ్వకపోతే
పాఠశాలల్లో వంట బంద్

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాల నుంచి వేలాది సంఖ్యలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌కు చేరుకున్నారు. ధర్నా కోసం మంగళవారం రాత్రే హైదరాబాద్‌కు వచ్చారు. బస్సులు, లారీలు, ఇతర వాహనాల్లో తరలివచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన ధర్నా, సాయంత్రం నాలుగు గంటల వరకు సాగించిది. ధర్నా ప్రాంగణంతోపాటు చుటుపక్కల మొత్తం మధ్యాహ్న భోజనం కార్మికులతో ఇందిరాపార్క్ నిండిపోయింది. ఎక్కడా చూసినా వారే కనిపించారు. పిల్లలను ఎత్తుకుని ఆందోళనలో పాల్గొన్నారు. సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ప్రకటించిన వేతనాల పెంపును అమలుచేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల నినాదాలతో ధర్నాచౌక్ దద్దరిల్లింది. వచ్చిన కార్మికులకు టెంట్ చాలకపోవడంతో మూడు, నాలుగు చోట్ల కూర్చుని ధర్నాలో పాల్గొన్నారు. పెంచిన వేతనాలకు బడ్జెట్ ఇవ్వాలి, మెనూ ఛార్జీలను చెల్లించాలి అంటూ నినాదాలు చేశారు. సీఎం హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి ఇచ్చిన మాట కూడా నిలబెట్టుకోలేదని ధర్నా సందర్భంగా కార్మికులు వ్యాఖ్యానించడం గమనార్హం. నినాదాలతోపాటు ప్లకార్డులు ప్రదర్శించారు. జెండాలను పట్టుకుని ఒక పూట సాంతం ఆందోళనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సంఘం ఉపాధ్యక్షురాలు సుల్తానా అధ్యత వహించగా, సీఐటీయూ ఉపాధ్యక్షులు ఈశ్వర్‌రావు, యూనియన్ ఆఫీసు బేరర్లు ఇందూరి సులోచన, రాజేశ్వరి, మాయ, సరస్వతి, స్వప్న, సత్యనారాయణ, సీఐటీయూ నాయకులు గోవర్ధన్, రంజీత్, కృష్ణామాచారి, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం హామీ అమలుచేయాలి: పాలడుగు భాస్కర్

మధ్యాహ్న భోజన కార్మికులకు అసెంబ్లీ సాక్షిగా సీఎం ఇచ్చిన హామీలు అమలుచేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. ధర్నాను ప్రారంభించి మాట్లాడిన ఆయన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ జీతాలు పెంచుకుంటే సరిపోదనీ, పిల్లల కడుపులు నింపుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల బతుకుల్లోకి తొంగిచూడాలని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు కాగితాల్లో కాకుండా ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. సమస్యలపై ప్రభుత్వాలు హామీలు ఇస్తూ కాలం గడుపుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు అప్రమత్తంగా ఉంటూ అడుగడుగునా పోరాటం చేయాల్సిందేనని చెప్పారు. కనీస పౌష్టికాహారం లేక కార్మికుల ఆరోగ్యం దెబ్బతింటుందని గుర్తు చేశారు. ఏరియర్లతో కలుపుకుని వేతనాలు చెల్లించాలని సర్కారుకు విజ్ఞప్తి చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ధర్నాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుతం 24 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు కోడ్‌లు తెచ్చిందని విమర్శించారు. సీఎం కేసీఆర్ స్కీం వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పోలీసు, మిలిటరీ, లాఠీఛార్జీకి బెదిరేదిలేదని చెప్పారు.

15 రోజుల్లో పరిష్కరించాలని :జె.వెంకటేశ్

మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలను 15 రోజుల్లో యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ డిమాండ్ చేశారు. వారి న్యాయసమ్మతమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఎర్ర జెండాలు స్వార్థ రాజకీయాలు చేయవనీ, ప్రజాసమస్యలపై పోరాటాలు మాత్రమే చేస్తామని అన్నారు. మంత్రి హరీశ్‌రావు ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఆయన అవాకులు చేవాకులు పేలుతున్నారని విమర్శించారు. కేసీఆర్ నీకు రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేసిన మొనగాడు సంఘం సీఐటీయూ మాత్రమేనని వ్యాఖ్యానించారు.

బంగారు తెలంగాణలో ఆడపడుచుల కంటనీరు:ఎస్‌వి రమ

సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణలో ఆడపడుచుల కంటనీరు ప్రవహిస్తున్నదని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.వి రమ డిమాండ్ చేశారు.ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజనం కార్మికుల వేతనాలు పెంచడం లేదన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించక అప్పుల పాలవుతున్నారని గుర్తు చేశారు. అధికారంపై ఉన్న మక్కువ ప్రజలు, కార్మికులపై ఎందుకు లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీని ఎత్తేసింది, ఇప్పుడేమో కట్టెలపొయ్యిపై వంట చేయకుండా అడ్డుకుంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తు పెట్టుబడి పెట్టినా లాభం లేదన్నారు. సొంతరాష్ట్రంలో అడుక్కునే పరిస్థితి దాపురించిందని చెప్పారు. జీతాలు ఇవ్వకపోతే గంటెలు మడతేయాలని పిలుపునిచ్చారు.

ఐయామ్ విత్ సీబీఎన్

- విప్రో సర్కిల్‌లో ఐటీ ఉద్యోగుల నిరసన
- టీడీపీ శ్రేణుల ఆందోళన, అరెస్ట్



నవతెలంగాణ-హైదరాబాద్

తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా బుధవారం హైదరాబాద్‌లోని విప్రో సర్కిల్‌లో ఐటీ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. భారీగా గుమిగూడారు. జై సీబీఎన్ అంటూ నినాదాలు చేశారు. ఐయామ్ విత్ సీబీఎన్ కార్యక్రమాన్ని చేపట్టారు. పోలీసుల అనుమతి లేకపోవడంతో ఐటీ ఉద్యోగులను చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. ఉద్యోగులు సైతం వెనక్కి తగ్గకపోవడంతో విప్రోకూడలిలో ఉద్రిక్తత నెలకొంది. చంద్రబాబుకు అవినీతి మరకలు అంటించేందుకు ప్రయత్నిస్తున్నారు..అందుకే జైల్లో పెట్టారు. అక్రమ కేసులు ఎత్తేయాలి..కక్ష సాధించేందుకే బాబుపై కేసులు..ఆయన వల్లే మాకు ఉపాధి అవకాశాలు లభించాయి..మా జీవితాల్లో వెలుగులు నింపిన చంద్రబాబుకు అండగా ఉంటాం..సైకో పోవాలి..సైకిల్ రావాలి..కక్ష సాధింపు రాజకీయాలు అభివృద్ధికి విఘాతం..వచ్చే ఎన్నికల్లో మా తడాఖా చూపిస్తామని' అంటూ ఆందోళనలో పాల్గొన్న ఐటీ ఉద్యోగులు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఐటీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణను పోలీసులు అరెస్ట్ చేశారు. అలాగే నిరసనలో ఐటీ ఉద్యోగులకు సంఘీభావం చెప్పిన టీడీపీ నేతలను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, బంటు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. వీరందరిని గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

జేఎల్ ఇంగ్లీష్ పరీక్షకు వ్యాలిడిటీ లేదు

- ప్రకటించిన సిలబస్ ఒకటి.. వచ్చిన ప్రశ్నలు మరొకటి
- ప్రశ్నాపత్రాన్ని పున:పరీక్షించాలి
- సీనియర్ ఆంగ్ల ప్రొఫెసర్‌తో కమిటీ వేయాలి :ఓయూ జేఏసీ అధ్యక్షుడు డా.ఎల్చల దత్తాత్రేయ డిమాండ్

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జేఎల్ పరీక్షల్లో తొలి పరీక్షగా మంగళవారం జరిగిన జేఎల్ ఆంగ్ల ప్రశ్నాపత్రానికి వ్యాలిడిటీ లేదని నిరుద్యోగ ఓయూ జేఏసీ అధ్యక్షుడు డా.ఎల్చల దత్తాత్రేయ అన్నారు. బుధవారం ఓయూలో నిరుద్యోగ జేఎల్ ఆంగ్ల అభ్యర్థులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన సిలబస్ ప్రకారం జేఎల్ ఆంగ్ల ప్రశ్నాపత్రాన్ని తయారు చేయలేదని, సిలబస్‌లో లేని అంశాలే 70 శాతం



వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం టీఎస్‌పీఎస్సీ అధికారులు ఈ ప్రశ్నాపత్రాన్ని సమీక్షించి, అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాన్ని పున:సమీక్షించి సిలబస్‌లో లేని ప్రశ్నలను తొలగించాలని, సీనియర్ ప్రొఫెసర్‌తో కమిటీ వేసి జేఎల్ ఆంగ్ల ప్రశ్నాపత్ర వ్యాలిడిటీని తేల్చాలన్నారు. కటాఫ్ మార్కులను తగ్గించాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2007లో వచ్చిన జేఎల్ నోటిఫికేషన్ చివరిదని, 16 సంవత్సరాల తరువాత వచ్చిన ఈ నోటిఫికేషన్‌లో ప్రకటించిన సిలబస్ ప్రకారం ప్రశ్నాపత్రం ఇవ్వకపోవడం నిరుద్యోగులకు నిరాశను మిగిల్చిందన్నారు. ఇప్పటికైనా టీఎస్‌పీఎస్సీ అధికారులు మేల్కొని ఈ ప్రశ్నాపత్రంపై సమీక్ష నిర్వహించి సిలబస్‌లో లేని ప్రశ్నలకు తొలగించి, వ్యాలిడిటీని సీనియర్ ఆంగ్ల ప్రొఫెసర్‌తో నిర్ధారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఎల్ ఆంగ్ల అభ్యర్థులు ప్రణీత్, అంజి యాదవ్, రాజేష్, నరేందర్, షబ్బీర్, నరేష్, చిరంజీవి, నాగరాజు, వంశీ తదితరులు పాల్గొన్నారు.



ఇండ్లస్థలాల పోరు తీవ్రం

ఎర్రజెండా చేతబూని ఏకమైన పేదలు

- గుడిసె దక్కేవరకు పోరాటం : తెలంగాణ ప్రజాసంఘాల పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్ వీరయ్య
- ములుగు 'వాజేడు'లో కొనసాగుతున్న ఆందోళన

నవ తెలంగాణ విలేకరి-వాజేడు

ములుగు జిల్లా వాజేడు మండలం పూసురు గ్రామంలో గుడిసెవాసుల పోరాటం తీవ్రమవుతున్నది. గుడిసెవాసుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఈ పోరాటం నడుస్తున్నది. ఎర్రజెండా చేతబూని వందలాది పేదలు ఆ ప్రాంతంలో ఏకమయ్యారు. నినాదాలు, పాటలతో ఆ ప్రాంతాన్ని హోరెత్తించారు. తెలంగాణ ప్రజాసంఘాల పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్. వీరయ్య పోరాట కేంద్రాన్ని బుధవారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ 'పేదలకు ఇవ్వాల్సిన ఇంటి స్థలాలకు స్థలం లేదు.. కార్పొరేట్లకు మాత్రం బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచితంగా భూములు కేటాయిస్తున్నది' అని విమర్శించారు. 'రాష్ట్ర వ్యాపితంగా 65 కేంద్రాల్లో భూపోరాటం జరుగుతున్నది... మీకు అండగా వేలాది మంది గుడిసె వాసుల మద్దతు ఉంది. మీరు ఒంటరి వాళ్ళు కాదు' అని పేదలకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వ స్థలం పేదోడికి ఇవ్వలేకుంటే ఆ భూమి ఎందుకని ప్రశ్నించారు. పోరాడితే పోయేదేమి లేదని, పోరాటం చేసేవారికి ఎర్రజెండా అండగా ఉంటుందని అన్నారు పేదల బాగోగులు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, కానీ కల్లబొల్లి మాటలతో కాలం వెల్లదీయడం సరికాదన్నారు. వాజేడు మండలంలో వేయి మంది పేదలు గుడిసలు వేసుకున్నారంటే..ఇంటి స్థలాలు సమస్య ఎంత ఉందో అర్థమవుతుందని అని అన్నారు. గుడిసెలు తొలగించాలని ఆలోచన చేస్తే ఊరుకోబోమని, రాష్ట్ర వ్యాపిత ఉద్యమంగా మలుస్తామని అధికారులను హెచ్చరించారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, మల్లు స్వరాజ్యం, పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, బీరెడ్డి సాంబశివా, మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు, జిల్లా కమిటి సభ్యులు గ్యానం వాసు, కృష్ణబాబు దేవయ్య, సౌమ్య దామోదర్, కృష్ణబాబు, సంతోష్, కుమారి ముత్తయ్య బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు గుడిసెలు దక్కేవరకూ పోరాడుతాం...

ప్రజాసంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య

నవతెలంగాణ-వాజేడు

పేదలకు గుడిసెలు దక్కేవరకూ పోరాడాలని ప్రజాసంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య గుడిసెవాసులకు పిలుపునిచ్చారు. ములుగు జిల్లా వాజేడు మండలం పూసురు రెవెన్యూ గ్రామంలో మూడు రోజులుగా గుడిసెవాసులు చేపట్టిన పోరాటాన్ని బుధవారం వీరయ్య సందర్శించి మాట్లాడారు. పేదల ఇంటి స్థలాలకు స్థలం లేదంటున్న ప్రభుత్వం.. కార్పొరేట్ శక్తులకు ఉచితంగా ఇవ్వడానికి మాత్రం స్థలం ఉందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 65 కేంద్రాల్లో భూపోరాటం జరుగుతుందన్నారు. వేలాది మంది గుడిసెవాసులు ఎర్రజెండా అండతో పోరాడాలని, వారి అండగా ఉంటామని స్పష్టంచేశారు. పేదల బాగోగులు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నా.. గుడిసెలకు ఇంటి జాగా అడిగితే రెవెన్యూ అధికారులు పోలీసులతో ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడటం సరి కాదన్నారు. వాజేడు మండలంలో వెయ్యి మంది పేదలు గుడిసెలు వేసుకున్నారంటే.. ఇంటి స్థలాల సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుందన్నారు. గుడిసెలు తొలగించాలని యత్నిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, మల్లు స్వరాజ్యం.. పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, బీరెడ్డి సాంబశివ, మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు గ్యానం వాసు, కృష్ణబాబు, దేవయ్య, సౌమ్య, దామోదర్, కృష్ణబాబు, సంతోష్, కుమారి ముత్తయ్య బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను ఉధృతం చేస్తాం

అసంతృప్తికరంగా మంత్రి హామీలు

- పోరాడే సంఘాలను పిలవకపోవడం అప్రజాస్వామికం: తెలంగాణ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల జేఏసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మళ్లీ పాత పద్ధతిలోనే అంగన్వాడీ ఉద్యోగులను మోసం చేసేలా మంత్రి హామీలున్నాయనీ, అంగన్వాడీల కీలక సమస్యలను పరిష్కరించని నేపథ్యంలో సమ్మెను ఉధృతం చేస్తామని తెలంగాణ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు పి.జయలక్ష్మి(సీఐటీయూ), ఎన్.కరుణకుమారి(ఏఐటీయూసీ) ప్రకటించారు. సెప్టెంబర్ 11 నుంచి సమ్మె చేస్తున్న, సమస్యలపై పోరాడుతున్న సంఘాలను మంత్రి చర్చలకు పిలవకపోవడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. అసలు పోరాటంలోనే లేని సంఘాలతో చర్చలు జరపడం ఏంటని ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. అతి ముఖ్యమైన డిమాండ్లు అయిన పర్మినెంట్, కనీస వేతనం, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంపు అంశాలను కనీసం ప్రస్తావించకపోవడం దారుణమని పేర్కొన్నారు. బతికున్నప్పుడు సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్లను పక్కనపెట్టి కేవలం చనిపోయిన తర్వాత దహన సంస్కారాలు నిర్వహించడానికి టీచర్లకు రూ.20 వేలు, ఆయాలకూ రూ.10 వేలు ప్రభుత్వం నిర్ణయం చేయడం దుర్మార్గమని తెలిపారు. చావులోనూ టీచర్లకు, ఆయాలకు అమౌంట్‌లో వ్యత్యాసం చూపించటం సరైంది కాదని పేర్కొన్నారు. రూ.2 లక్షల ఇన్సూరెన్స్ అని చెప్పారుగానీ జీవో మాత్రం రాలేదని తెలిపారు. మినీ వర్కర్ల సర్క్యులర్‌లో మినీలను మెయిన్ టీచర్స్‌గా నియామకం, హెల్పర్ల నియామకంపైన స్పష్టత లేదని పేర్కొన్నారు. షరతులు అనే అంశం మినీ టీచర్లకు ప్రమాదకరంగా మారబోతుందని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ విషయంలో కొత్తగా చెప్పిందేమీ లేదని పేర్కొన్నారు.



16న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంగ్రామ సభ

- వాల్‌పోస్టరావిష్కరణలో ఫెడరేషన్ నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను పెంచడంతో పాటు పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంగ్రామ సభను నిర్వహిస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె.వెంకటేశ్ ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లో సంగ్రామ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జె.వెంకటేశ్‌తో పాటు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు జె. కృష్ణారెడ్డి, జె. కుమారస్వామి, మహేందర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ..లక్షా నలభై వేల మందికిపైగా ఉన్న ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, డైలీవేజ్ తదితర సిబ్బందిని దశల వారీగా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అప్పటిలోగా సమాన పనికి - సమాన వేతనం అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్ ఏజెన్సీలను రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని కోరారు. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేస్తానన్న ముఖ్యమంత్రి వాగ్దానాన్ని పక్కనపెట్టి ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను శాశ్వతం చేసే దిశగా ముందుకెళు తున్నారని విమర్శించారు. విజ్ఞాపనలు, ఆత్మీయ సమ్మేళనాలతో ఈ ప్రభుత్వం దిగి రాదని తేలిపోయిందన్నారు. 16న జరిగే సంగ్రామ సభలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభకు సంబంధించి 33 జిల్లాల్లో 44 రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. శాఖలు, హోదాలు, ఇతర అనుబంధాలకతీతంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సంఘటితంగా ప్రభుత్వంపై పోరాడి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ వైఖరి చెప్పాలి : ఎమ్మెల్సీ కవిత

- జగిత్యాల జిల్లా చల్‌గల్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-జగిత్యాల

మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ తన వైఖరి చెప్పాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని చల్‌గల్ మ్యాంగో మార్కెట్‌లో బుధవారం బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు కవిత, ఎల్.రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కీలకమైన అంశాలపై కాంగ్రెస్ పార్టీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. 'కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాల కోసం రెండ్రోజుల్లో మొత్తం గాంధీ పరివారం తెలంగాణకు వస్తుంది. తెలంగాణ డిక్లరేషన్ల పేరిట ఇస్తున్న హామీలను కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారా.. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పనులను సోనియాగాంధీ, రాహుల్ గాంధీ కలలోనైనా ఊహించగలరా" అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను గత ఎన్నికల్లో కంటే ఎక్కువ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

'జమిలి' పేరుతో ప్రజల్లో గందరగోళానికి యత్నం

- మతిస్థిమితం లేని వ్యక్తి కోమటిరెడ్డి వెంకటరెడ్డి : శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నవతెలంగాణ- నల్లగొండ కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తోంది.. షెడ్యూల్ ప్రకారం ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు నిర్వహించాలి కానీ జమిలి ఎన్నికలు, మినీ జమిలి ఎన్నికలంటూ.. అన్ని రాజకీయ పార్టీలను.. ప్రజలను గందరగోళంలోకి నెట్టేందుకు యత్నిస్తోంది' అని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్ కోసం తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికార పార్టీని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో ప్రయారిటీ లేదని పరేషాన్‌లో ఉన్న నేతలు కేసీఆర్, కేటీఆర్‌పై అనవసర ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మతిస్థిమితం, స్థిరత్వం లేని వ్యక్తి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అని, ఆయన ఎప్పుడు ఏం మాట్లాడుతారో ఆయనకే తెలియదని విమర్శించారు. కేటీఆర్ కృషి వల్ల అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీనే గెలవబోతుందని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్‌లో తెలంగాణ వ్యతిరేకులు ఉన్నారంటున్న కోమటిరెడ్డి.. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వైఎస్ షర్మిలను ఎందుకు కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమానికి బద్ధ వ్యతిరేకులు, రాష్ట్రం ఏర్పాటును వ్యతిరేకించిన వారు, ఎందరో ఆత్మబలిదానాలకు కారకులైన వారు నేటికీ కాంగ్రెస్ పార్టీలో కొనసాగు తున్నారని చెప్పారు. ఈనెల 17న జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహి స్తామన్నారు.

బోడకొండ ఖిల్లాపై కౌలు రైతుల సజీవ ఖననం

రైతులతో గొయ్యి తీయించి.. అదే గోతిలో పూడ్చిన రజాకార్లు

- రైతుల సజీవ ఖననంతో ఎగిసిన ఉద్యమం
- రజాకారు క్యాంపులపై కమ్యూనిస్టుల మెరుపు దాడి
- సుందరయ్య సూచన మేరకు రాచకొండ గుట్ట కేంద్రంగా పనిచేసిన కమ్యూనిస్టు దళాలు
- లక్షల ఎకరాల్లో భూ పంపిణీ



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

పన్నుల పేరుతో నిజాం సర్కారు రైతులను చిత్ర హింసలకు గురిచేసి అమాయక రైతులను పొట్టన పెట్టుకుంది. రంగారెడ్డి జిల్లాలో రైతాంగ సాయిధ పోరాటం ఉధృతంగా సాగుతున్న సమయంలో నిజాం సర్కారుకు ఎందుకు భూ శిస్తు చెల్లించాలని.. ఎదురుతిరిగిన రైతులు సోమయ్య, మల్లయ్యను రజాకార్‌లు బంధించి బోడకొండ ఖిల్లాపై సజీవ ఖననం చేశారు. రైతుల చేతులతో గొయ్యి తీయించి.. అదే గోతిలో వారిని సజీవంగా పాతిపెట్టారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది.

రైతాంగ సాయుధ పోరాటాన్ని అణిచివేసేందుకు కాశీం రిజ్వీ నేతృత్వంలో శివన్న గూడ కేంద్రంగా పనిచేస్తున్న రజాకార్‌ల క్యాంపు కౌలు రైతులను చిత్ర హింసలకు గురిచేసింది. మంచాల మండలానికి చెందిన సోమయ్య, మల్లయ్య రజాకార్‌లకు వ్యతిరేకంగా భూమి శిస్తు చెల్లించొద్దని రైతులను కూడగట్టే ప్రయత్నం చేశారు. దాంతో గ్రామంలో మాటుగాసిన రజాకార్‌లు సోమయ్య, మల్లయ్యను బంధించి.. శివన్నగూడ గ్రామ పంచాయతీ వద్ద వారి వీపున బండరాళ్ల మోపి, రెండు రోజులు అలాగే హింసించారు. ఎలాగోలా అక్కడి నుంచి తప్పించుకున్న రైతులను వారం రోజుల తర్వాత మళ్లీ పట్టుకుని బోడకొండ ఖిల్లాకు తీసుకెళ్లి.. రైతుల చేతులతోనే గొయ్యి తీయించి, వారు తీసిన గోతిలోనే రైతులను సజీవంగా బొందపెట్టారు. ఈ ఘటనతో రాచకొండ గుట్ట కేంద్రంగా పనిచేస్తున్న కాచం కృష్ణమూర్తి, భీంరెడ్డి రాంరెడ్డి దళం రజాకార్‌ల క్యాంపుపై మెరుపు దాడి చేసి రజాకారుల వద్ద బందీగా ఉన్న మరికొంత మంది కౌలు రైతులను రక్షించారు. శివన్న గూడెం రజాకార్‌ల క్యాంప్‌పై దాడి చేసిన కమ్యూనిస్టు దళాలు పేదలకు భూ పంపిణీ చేశాయి. ఈ ఘటనతో జిల్లాలో ఉద్యమం ఉధృతంగా సాగింది. ఈ ఉద్యమంలో ప్రజలు వెల్లువలా కదిలి రావడంతో నాటి నైజాం ప్రభుత్వం గడగడలాడింది. దాంతో ఉద్యమాన్ని అణిచి వేయాలని ప్రభుత్వం రజాకారులను ఊర్ల మీదకు పంపింది. ఈ ముష్కరులు ఊర్ల మీద పడి దాడులకు ఉపక్రమించారు.

సుందరయ్య సూచనల మేరకు కృష్ణమూర్తి రాచకొండ గుట్టల్లో రక్షణ తీసుకుంటూ ఈ ప్రాంతంలో ఉద్యమాన్ని కొనసాగించారు. రాచకొండ ప్రాంతంలో దళాలను సిద్ధం చేశారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, మాడ్గుల, దారుర్ ప్రాంతాల్లో ఉద్యమాన్ని విస్తరించారు. యువత ఉద్యమంలో చురుగ్గా పాల్గొని ఆయా ప్రాంతాల్లో భూస్వాములకు ముచ్చెమటలు పట్టించారు. బర్ల శివయ్య, పోచమోని జంగయ్య, అడివయ్య, కుకడాల జంగారెడ్డి, పోచయ్య, అరుట్ల గ్రామానికి చెందిన దానయ్య సాయుధ పోరాటంలో కీల భూమిక పోషిస్తూ ఈ ప్రాంత ప్రజల్లో చైతన్యాన్ని నింపారు.

12 ఏండ్ల కల.. నిమిషం ఆలస్యంతో ఆవిరి

- జేఎల్ పరీక్షా సెంటర్‌లోకి 8 మందికి నిరాకరణ

నవతెలంగాణ- కోదాడ

తమ కలలు నెరవేర్చుకోవాలన్న పన్నెండేండ్ల నిరీక్షణకు ఒక్క నిమిషం ఆలస్యంతో దూరమయ్యారు. బుధవారం జరిగిన టీఎస్‌పీఎస్సీ జేఎల్ పరీక్షకు నిమిషం ఆలస్యంగా వచ్చారని అభ్యర్థులను పరీక్షాసెంటర్‌లోకి రానివ్వలేదు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని సనా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన టీఎస్పీఎస్సీ జేఎల్ పరీక్షకు ఆలస్యంగా వచ్చిన ఎనిమిది మంది అభ్యర్థులను అధికారులు అనుమతించలేదు. దాంతో అభ్యర్థులు ఎనిమిది మంది కాలేజీ గేటు ముందు ఆందోళనకు దిగారు. 12 సంవత్సరాల నిరీక్షణ ఒక్క నిమిషంలోనే అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షకు సమయానికే వచ్చామని, ఆ సమయంలో గేటు గుండా బీటెక్ విద్యార్థులను పంపించడం వల్ల తమకు లోపలికి వెళ్లేసరికి ఒక నిమిషం ఆలస్యం అయిందని చెప్పారు. కాలేజీ యాజమాన్యం మహిళలనే గౌరవం లేకుండా దురుసుగా ప్రవర్తించిందని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యాన్ని బతిమలాడినా కనుకరించకపో వడంతో అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులను, అధికారులను నిలదీశారు. సమయం అయిపోయిన తర్వాత వస్తే తమ బంధువులను కూడా పంపించలేదని కాలేజీ యాజమాన్యం చెప్పింది. దాంతో చేసేది ఏమీ లేక అభ్యర్థులు వెనుతిరిగి వెళ్లిపోయారు.

దున్నేసిన పంటను చూసి ఏం రిపోర్టు ఇస్తారు?

- వర్షాలతో దెబ్బతిన్న పంటల పరిశీలనకు వచ్చిన.. వ్యవసాయ శాస్త్రవేత్తలకు ఉప్లూర్ రైతుల సూటి ప్రశ్న
- అధికారులపై రైతుల ఆగ్రహం



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

దున్నేసిన పంటను చూసి ఇప్పుడు ఏం రిపోర్టు ఇస్తారని వ్యవసాయ శాస్త్రవేత్తలను ఉప్లూర్ రైతులు సూటిగా ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలోని ఉప్లూర్‌లో గ్రామంలో నకిలీ విత్తనాలతో, వర్షాలతో దెబ్బతిన్న సోయాపంటను పరిశీలించేందుకు శాస్త్రవేత్తల బృందం, వ్యవసాయ శాఖ అధికారులు సందర్శించారు. కాగా, అప్పటికే గ్రామంలో అనేక మంది రైతులు సోయా పంట పూత, కాత రాకపోవడంతో దున్నేశారు. దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్టు అధికారులు ఇప్పుడొచ్చి పంటలను పరిశీలించడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో అందరూ రైతులు ఖరీఫ్ మెట్ట పంటగా సోయాబీన్ పంటను సాగు చేశారు. సోయాబీన్ పంటలో కొన్ని రకాలు పూత, కాత మొత్తం రాలేదు. కొన్ని రకాలు మంచి పంట వచ్చింది. ఈ పంట రాని విత్తనాలు రైతులను ప్రతేడాది నిండా ముంచుతున్నాయని కొద్ది రోజులుగా రైతులు ఆందోళన చేస్తున్నారు. అందులో భాగంగా వ్యవసాయ పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త బాలాజీ నాయక్, రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త అంజయ్య, శాస్త్రవేత్తలు విజయ్ కుమార్, దినేష్‌ను భీంగల్ ఏడీఏ మల్లయ్య బుధవారం గ్రామానికి తీసుకొచ్చారు. అయితే ఇప్పటికే పూర్తిగా నష్టపోయిన రైతులు సోయా పంటను దున్నేశారు. దున్నేసిన పంటను శాస్త్రవేత్తలు, అధికారులు వచ్చి పరిశీలించడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దున్నేసిన పంటను ఇప్పుడు వచ్చి ఏమని రిపోర్టు ఇస్తారని ప్రశ్నించారు. రైతులను నిండా ముంచుతున్న నకిలీ విత్తన కంపెనీలపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని శాస్త్రవేత్తలను, అధికారులను నిలదీశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని, నకిలీ విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.



హిందూ ముస్లింల కొట్లాట పెట్టి.. గెలవాలనుకుంటున్న బీజేపీ

- తెలంగాణలో కాషాయపార్టీకి ఓటమి భయం : మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

తెలంగాణలో ప్రజలను నమ్ముకున్న నాయకుడే ఎన్నికల్లో నిలబడతాడని, జమిలిని నమ్ముకున్న నాయకుడు కాదని, నల్లాలు ఇచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలా? నల్ల చట్టాలు తెచ్చిన బీజేపీ కావాలా? అని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణలో బీజేపీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే హిందూ ముస్లింల మధ్య కొట్లాట పెట్టి బీజేపీ గెలవాలనుకుంటోందని తెలిపారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని కిషన్‌నగర్‌లో బీఆర్ఎస్ ఎన్నికల సన్నాహక కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హుస్నాబాద్‌లో గత పాలకులు కడుపులు నింపుకునే పనిలో ఉన్నందున అభివృద్ధి జరగలేదన్నారు. పేదల కడుపు నింపే నాయకుడు సతీష్ అని, అందుకే అభివృద్ధి జరిగిందన్నారు. ఎమ్మెల్యే అంటే సతీష్‌కుమార్ లాగా ఉండాలని, నిజాయితీగల శాసనసభ్యుడని కొనియాడారు. రాష్ట్రంలో మూడోసారి ముఖ్యమంత్రి ఎవరని ఎవరి నడిగినా కేసీఆర్ అనే సమాధానం వస్తుందన్నారు. హుస్నాబాద్‌లో కూడా మూడోసారి సతీష్‌కుమార్‌ను గెలిపించుకుందామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ ఈ నెల 16న ప్రారంభం చేయనున్నారని, దీన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు ఆగమాగం అవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు లక్ష్మీకాంతరావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, స్థానిక శాసనసభ్యులు ఒడితెల సతీష్ కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

- మూడ్రోజుల పాటు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతున్నది. రాబోయే 24 గంటల్లో ఇది కాస్తా మరింత బలపడి దక్షిణ ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా మరింత చురుగ్గా కదిలే అవకాశముంది. రాబోయే మూడు రోజుల పాటు ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడే సూచనలున్నాయి. అదే సమయంలో రాష్ట్రంలో చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. పలు జిల్లాలో భారీ వర్షాలు పడే సూచనలు కనిపిస్తుండటంతో అధికారులు అలర్ట్ చేశారు.



'కొలువుల' డ్రామా!

సంపాదకీయం

'అంతన్నాడింతన్నాడే గంగరాజు... ముంతమామిడి పండన్నాడే గంగరాజు...' రాష్ట్ర బీజేపోళ్ల హుషారు చూస్తే ఈ పాటే గుర్తుకు వస్తోంది. ఏ ఎండకు ఆ గొడుగు పట్టటం... జనాల్ని ఏమార్చటం వారికి తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదనుకుంటా! అందుకే తెలంగాణ కాషాయ దళపతి కిషన్‌రెడ్డి... బుధవారం హైదరాబాద్‌లో ఒక బృహత్తర కార్యక్రమాన్ని భుజాన వేసుకున్నారు. నగరంలోని ఇందిరాపార్కు వద్ద ఆయన 24 గంటల దీక్షను చేపట్టారు. అదీ నిరుద్యోగ సమస్యపై. 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అన్నట్టు ఇలా నిరుద్యోగంపై బీజేపీ ఆందోళన చేపట్టడమంటే దెయ్యాలు వేదాలు వల్లించటమే. తాము అధికారంలోకొస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని నమ్మబలికి, గద్దెనెక్కింది కమలం పార్టీ. ఆ చొప్పున ఇప్పటికి గత పదేండ్ల నుంచి దేశవ్యాప్తంగా 20 కోట్ల ఉద్యోగాలను ఇవ్వాలి. కానీ అచ్చేదిన్ అంటూ ఇప్పటిదాకా కొంగ జపం చేసి.. ఇప్పుడు అమృత్‌కాల్ అంటూ ఊదరగొడుతున్న ప్రధాని మోడీ, 20 కోట్ల కొలువులను సృష్టించటం మాట అటుంచి... ఉన్న ఉద్యోగాలకు ఎసరు పెట్టారు.

దేశంలో నిరుద్యోగానికి సంబంధించిన గణాంకాలను పరిశీలిస్తే విస్తుగొలిపే వాస్తవాలు బయట కొస్తున్నాయి. ఆర్థికాభివృద్ధిలో బ్రిటన్‌ను దాటేశామంటూ కేంద్ర ప్రభుత్వ పెద్దలు మీసాలు మెలేస్తున్నారు. కానీ ఉద్యోగాల కల్పనలో మాత్రం మన పరిస్థితి నానాటికీ తీసికట్టు అనే విధంగా ఉంది. 2016 నుంచి 2022 వరకూ ఉపాధి లేక మహిళలు, యువత ఎక్కువగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో గత ఏడేండ్ల నుంచి దేశంలో నిరుద్యోగ రేటు 42.6 శాతంగా నమోదైంది. ఇక పని చేసే రంగంలో మహిళల శాతం పదేండ్ల క్రితం 26 శాతంగా ఉంటే... ఇప్పుడది 19 శాతానికి పడిపోవటం ఆందోళనకరం. కరోనాతో విలవిల్లాడిన భారత్‌కు ఈ నిరుద్యోగం మరింత శాపంగా మారింది. ఈ క్రమంలో ఈ యేడాది చివరి నాటికి కేంద్ర ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలన్నింటినీ భర్తీ చేస్తాం.. నిరుద్యోగాన్ని పూర్తిగా నిర్మూలిస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన కాషాయ పరివారం... ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు ఒక్కటీ లేవు. పైగా అత్యంత కీలకమైన రక్షణ రంగంలోని కొలువులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసేందుకు అగ్నిపథ్‌ను తీసుకొచ్చి... యువతలో అగ్నికి ఆజ్యం పోశారు. జాబుల గురించి అడిగితే... ఊబర్, ఓలా, స్విగ్గీ, జొమోటాలు ఉన్నాయిగా..? ఆ పనులు చేసుకుని డబ్బులు సంపాదించండి, అవసరమైతే బజ్జీలేసుకుని బతకండంటూ ఉచిత సలహాలివ్వటం 'బత్తాయి'లకు అలవాటైంది. ఇలాంటి అంశాలపై మన 'మిత్రోన్' నోరు మెదపరు. ఏ ఒక్క రోజూ స్పందించరు. అయినా మన పిచ్చిగానీ, ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేసి, లాభాల్లో ఉన్న ఆయా కంపెనీలను తెగనమ్మి, అంబానీ, ఆదానీలకు అప్పనంగా లాభాలు చేకూర్చటమే పనిగా పెట్టుకున్న ప్రధానికి మన నిరుద్యోగుల ఆకలి కేకలు వినబడతాయనుకోవటం ఒట్టి భ్రమ.

ఇలాంటి వాస్తవాలను మరుగుపరుస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్యపై దీక్ష చేస్తానంటే అది విడ్డూరం కాకపోతే మరేమిటి..? ఇదే సమయంలో ఘనత వహించిన బీఆర్ఎస్ సర్కార్ కూడా తక్కువేం తినలేదు. 2018 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో నిరుద్యోగ భృతి పథకాన్ని ప్రవేశపెడతామని ఆ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. ఆ అంశాన్ని ఎన్నికల ప్రణాళికలో కూడా చేర్చారు. కానీ ఇప్పటి వరకూ దాని ఊసే లేదు. తెలంగాణ వచ్చిన కొత్తలో ఒక్క రోజులోనే సమగ్ర కుటుంబ సర్వే అంటూ నానా హడావుడి, హంగామా చేసిన సర్కారు... ఆ సర్వేలో వచ్చిన వివరాలను మాత్రం ఇప్పటి వరకూ ప్రకటించకపోవటం గమనార్హం. ఆ విషయాన్ని పక్కకు పెడితే ఒక్కరోజులో అంతటి పెద్ద సర్వేను చేపట్టిన ప్రభుత్వానికి... ఈ రాష్ట్రంలో ఎంత మంది నిరుద్యోగులున్నారు..? వారిని ఎన్ని కేటగిరీలుగా విభజించాలనేది పెద్ద సమస్యా..? కానే కాదు గదా? కానీ 2018 నుంచి ఇప్పటి వరకూ బీఆర్ఎస్ సర్కారు నిరుద్యోగులను లె..క్కి..స్తూ..నే ఉంది. మరోసారి అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్నా ఆ లెక్క ఇంకా తేలనే లేదు. ఇప్పుడు మళ్లీ నిరుద్యోగులను బుట్టలో వేసుకునేందుకు కేసీఆర్ సారు కొంగొత్త పథకాన్ని తెరమీదకు తెస్తున్నారని వినికిడి. ఇలా ఢిల్లీలో మోడీ, హైదరాబాద్‌లో కేసీఆర్... నిరుద్యోగులతో ఆటలాడుకోవటాన్ని మానుకోవాలి. లేదంటే వారికి నిరుద్యోగులే రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారు.

నిజానికి 1948లో నెహ్రూ సైన్యాలకు కేవలం రోజుల వ్యవధిలోనే నిజాం లొంగిపోయాడు కదా? కానీ ఆపైన 1951 దాకా మూడేండ్ల పాటు అవి తెలంగాణలో చేసిన యుద్ధం ఎవరి మీద? కమ్యూనిస్టుల మీద, తెలంగాణ ప్రజల మీదనే కదా! ఇక్కడ గమనించవలసిన అసలు విషయం ఏమిటంటే... తెలంగాణ సాయుధ పోరాటం ముందు నిజాం తలవంచక తప్పదనీ, ఆ ప్రజా యుద్ధం ధాటికి నిరంకుశ ఫ్యూడల్ పాలన కూలిపోవడం తథ్యమనీ తేలిపోయాకే భారత యూనియన్ సైన్యాలు రంగప్రవేశం చేసాయి. ఎందుకంటే ఇక్కడ ప్రజలు గెలిస్తే తెలంగాణ కమ్యూనిస్టుల చేతిలోకి వెళుతుందనీ, అది రేపు తమ ఢిల్లీ కోటను కూడా ముట్టడిస్తుందనే భయం వారిది. నిజం చెప్పాలంటే ఇది యూనియన్ సైన్యాలు తెలంగాణ ప్రజల నుండి నిజాం రాజుకు కల్పించిన విమోచన. కమ్యూనిస్టు ఉద్యమ ప్రకంపనలు హస్తినదాకా చేరకుండా నెహ్రూ ప్రభుత్వం తనకు తాను కల్పించుకున్న విమోచన.

ఎంత వక్రీకరణ...! మనుషుల్ని నిరపేక్షంగా ప్రేమించిన వాళ్ల గురించి ఎన్ని అసత్యాలు. ఎన్ని అర్ధసత్యాలు. నిజాం రాజు, దొరలు, జాగీర్దార్లనే కాదు, కులమతాలను సైతం ధిక్కరించిన చరిత్ర అది. "కమ్మరి కొలిమి కుమ్మరి చక్రం జాలరి పగ్గం సాలెల మగ్గం... శరీర కష్టం స్ఫురింపజేసే గొడ్డలి రంపం కొడవలి నాగలి... సహస్ర వృత్తుల సమస్త చిహ్నం...." అని మహాకవి శ్రీశ్రీ చెప్పినట్టు... శ్రామిక జీవన సౌందర్యాన్నే కాదు... శ్రామికవర్గ ఐక్యతను కూడా చాటి చెప్పిన మహోన్నత ఇతిహాసమది. భూసంస్కరణలను జాతీయ ఎజెండాగా మార్చడమేకాదు, వాటి ఆచరణకు మార్గదర్శిగా నిలిచిన ప్రజాయుద్ధమది. దీన్ని ముస్లింలకు హిందువులకు మధ్య వైషమ్యంగా ప్రచారం చేయబూనడం, దీనిని ముస్లిం రాజు నుండి హిందూ ప్రజలకు లభించిన విమోచనగా చిత్రించడం కేవలం ఓ కట్టుకథ.

నిప్పును గుప్పిట మూయగలరా..?


రాంపల్లి రమేష్

ఆ పేరు విన్నంతనే ఆకాశం అరుణపతాకమై రెపరెపలాడుతుంది. భూమి పిడికిలై మొలకెత్తుతుంది. గాలి అమరుల త్యాగాల రాగమై మోగుతుంది. చరిత్ర ఎరుపెక్కుతుంది. అవును... మాట్లాడుతున్నది తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం గురించే... జనాన్ని జెండాలుగా ఎగరేసి గడీలను గడగడలాడించిన కమ్యూనిస్టుల వీరగాథ గురించే... నాలుగువేల ప్రాణాలను ధారపోసి, పదిలక్షల ఎకరాలను ప్రజలకు పంచి, మూడువేల గ్రామాలను విముక్తిచేసి గ్రామ స్వరాజ్యాల్ని స్థాపించిన ఆ నెత్తుటిగాథకు నేటికి డెబ్బైఏడు వసంతాలు. ఆ మహోజ్వల వారసత్వాన్ని కొనసాగిస్తూ కమ్యూనిస్టులు వార్షికోత్సవాలు జరుపుతుండగా, మిగతా రాజకీయ పక్షాలూ తమ తమ కార్యక్రమాలతో సిద్ధమవుతున్నాయి. జాతికి గర్వకారణమైన ఆ పోరాటఖ్యాతిని ఎవరు స్మరించినా తప్పులేదు. కానీ, దానికి వక్రభాష్యాలు చెపుతూ, విశాల ప్రజామోదమున్న ఈ చారిత్రక సందర్భాన్ని తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోజూడటమే ఆక్షేపణీయం. సెప్టెంబర్ 17 వచ్చిందంటే వీరు చేసే హడావిడి అంతా ఇంతా కాదు. ఇంతకీ ఏమిటీ సెప్టెంబర్ 17 ప్రత్యేకత? అది యూనియన్ సైన్యాల ముందు నిజాం తలవంచినరోజు. అంతే తప్ప ఆనాటి పోరాటానికి అది ప్రారంభమూ కాదు, ముగింపూ కాదు. కానీ చరిత్రకు సైతం వక్రీకరణలు చేస్తున్న ప్రబుద్ధుల కాలం కదా...! ఇది "విమోచనదినం" అనే పేరుతో ఓ "పరివారం" నిత్యం విభజన విద్వేష రాజకీయాలకు పూనుకుంటున్నది. ప్రతియేటా విషం చిమ్ముతూనే ఉన్నది. వీరే కాదు, ఈ రోజున వేడుకల పేరుతో హడావుడి చేస్తున్నవారందరివీ వితండవాదాలు, విపరీతధోరణులే. వీరెవరూ ఈ పోరాటంలో ఒక్క నెత్తురు బొట్టు చిందించినవారూ, చుక్క చెమట రాల్చినవారూ కాకపోవడం వైచిత్రి!!

ముఖ్యంగా విమోచన పేరుతో కట్టుకథలల్లు తున్నవారి తీరుకు చరిత్ర సైతం ఫక్కున నవ్వుతుంది. కుల మతాలకతీతంగా యావత్ తెలంగాణ ప్రజలు లిఖించిన ఆ త్యాగాల చరిత్రకు వీరు మతం రంగు పులుముతున్నారు. ఇది హిందూ ప్రజలకూ ముస్లిం రాజుకూ మధ్య యుద్ధంగా చిత్రిస్తూ వక్రభాష్యాలు చెపుతున్నారు. "ముస్లింల పాలన కింద ఉన్న హిందూ ప్రజలకు 1948 సెప్టెంబర్ 17న భారత ప్రభుత్వం విమోచన కలిగించింది" అన్న అశాస్త్రీయ వాదనను ముందుకు తెస్తున్నారు.

కానీ వాస్తవమేమిటీ? అసలు హైదరాబాద్ సంస్థానం ముస్లిం పాలన కింద ఉండేదన్నదే అర్ధసత్యం. పాలకుడు ముస్లిం కావొచ్చు... పాలకుల మతం ఇస్లాం కావొచ్చు... రాజు పరమ నిరంకుశుడనడంలోనూ సందేహం లేదు. కానీ ఆ రాజు ఆధారపడి పాలన సాగించింది హిందూ భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్ల మీదేనన్నది కూడా అంతే నిజం. ప్రజలు ప్రత్యక్షంగా దోపిడీకి, విపరీతమైన పీడనకు గురయింది వీరి చేతుల్లోనే. వీరికి అండ నిజాం రాజు. చివరికి అత్యంత క్రూరులూ మతోన్మాదులైన రజాకార్ మూకలన్నిటికీ ఈ హిందూ దొరల గడీలలోనే విడిది. అక్కడే తిని, తాగి ప్రజలమీద, పోరాడే వీరుల మీద ఈ కసాయి మూకలు కిరాతక దాడులు చేసేవి అన్న సంగతి మరువగలమా? రజాకార్ల సైన్యాధ్యక్షుడు కాసీం రజ్వీ ముస్లిం అయితే, ఉపాధ్యక్షుడైన విసునూర్ దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి ఎవరు? హిందువు కాదా? అతని దాష్టీకానికి బలైన బందగీ ఎవరు? ముస్లిం కాదా? లక్షల ఎకరాలకు అధిపతిగా జనాల మూల్గులు పీల్చిన జన్నారెడ్డి ప్రతాపరెడ్డి ఎవరు? పసిబిడ్డల తల్లుల్ని మోదుగు డొప్పల్లో పాలు పిండించి పరీక్షించిన పసునూరి రామ్మోహన్‌రావు ఎవరు? నీర్మాల నియంత లింగాల నర్సింహారెడ్డి ఎవరు? కోడూరి కర్కోటకుడు గడ్డం నర్సింహారెడ్డి ఎవరు? వీరి అమానుషాలను ఎండగట్టిన షోయబుల్లాఖాన్ ఎవరు? వీరి దురాగతాలను ప్రతిఘటించిన మఖ్దూం మొహియుద్దీన్ ఎవరు? ఇలా చెప్పుకుంటూ పోతే చరిత్ర నిండా అనేక ఉదాహరణలు... వీటిలో "పీడకులు - పీడితులు" అన్న విభజనకు తప్ప "హిందువులు - ముస్లింలు" అనే విభజనకు అస్కార ముందా? అడుగడుగునా హిందూ ముస్లిం ఐక్యత, సామరస్యం వెల్లివిరిసిన మహా సంగ్రామమది.

కానీ.... ఎంత వక్రీకరణ...! మనుషుల్ని నిరపేక్షంగా ప్రేమించిన వాళ్ల గురించి ఎన్ని అసత్యాలు. ఎన్ని అర్థసత్యాలు. నిజాం రాజు, దొరలు, జాగిర్దార్లనే కాదు, కులమతాలను సైతం ధిక్కరించిన చరిత్ర అది. "కమ్మరి కొలిమి కుమ్మరి చక్రం జాలరి పగ్గం సాలెల మగ్గం... శరీర కష్టం స్ఫురింపజేసే గొడ్డలి రంపం కొడవలి నాగలి... సహస్ర వృత్తుల సమస్త చిహ్నం...." అని మహాకవి శ్రీశ్రీ చెప్పినట్టు... శ్రమైక జీవన సౌందర్యాన్నే కాదు... శ్రామికవర్గ ఐక్యతను కూడా చాటి చెప్పిన మహోన్నత ఇతిహాసమది. భూసంస్కరణలను జాతీయ ఎజెండాగా మార్చడమేకాదు, వాటి ఆచరణకు మార్గదర్శిగా నిలిచిన ప్రజాయుద్ధమది. దీన్ని ముస్లింలకు హిందువులకు మధ్య వైషమ్యంగా ప్రచారం చేయబూనడం, దీనిని ముస్లిం రాజు నుండి హిందూ ప్రజలకు లభించిన విమోచనగా చిత్రించడం కేవలం ఓ కట్టుకథ. దేశమంతటా 80-20 పోలరైజేషన్‌ను అమలు చేసే విద్వేష రాజకీయం జడలు విచ్చుకున్నకాలం కదా... ఇప్పుడీ ఈ మతవాద రాజకీయ కౌటిల్యం మరింత తీవ్రమైంది.

వీరంటున్నట్టు 1948 సెప్టెంబర్ 17న జరిగింది విమోచనే అయితే, 1950 జనవరి 26 దాకా హైదరాబాద్ రాజ్యపాలన నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ పేరు మీదనే ఎందుకు సాగినట్టు? ఆ తరువాత 1956 దాకా ఆయన రాజప్రముఖ్ (గవర్నర్)గా ఎలా కొనసాగినట్టు? జరిగింది ప్రజల విమోచనే అయితే, దుర్మార్గమైన ఫ్యూడల్ నిరంకుశ పాలన సాగించి, ప్రజల రక్తమాంసాలు పిండి, పన్నులు వసూలుచేసి, ఆనా టికి ప్రపంచం లోనే అత్యంత ధనికులలో ఒకనిగా చలామణీ అయిన నిజాం ఆస్తు లను ఎందుకు స్వాధీ నం చేసుకో లేదు? పైగా రాజ భరణం పేరుతో ఎదురు పరిహా రాలు ఎందుకు చెల్లించినట్టు? ఈ ప్రశ్నలకు "పరివారం" జవాబు చెప్పగలదా? మరి దీనిని విమోచన అనగలమా? అదే నిజమైతే ఆ తరువాత కూడా ప్రజలు సాయుధ పోరాటం ఎందుకు కొనసాగించినట్టూ? ఎందుకంటే ఆ రోజుతో ఏదో మార్పు వచ్చినట్టు ప్రజలు భావించలేదు గనుక. అదే సమయంలో 1948 సెప్టెంబర్ 17న విమోచన పూర్తయితే 1951 దాకా పటేల్ పటాలాలు తెలంగాణను ఎందుకు వీడలేదు? ఎందుకంటే అవి వచ్చింది నిజాం రాజు కోసం కాదు గనుక. వాటి "ఆపరేషన్ పోలో" అసలు లక్ష్యం కమ్యూనిస్టులే గనుక. తెలంగాణ ప్రజలపై, కమ్యూనిస్టులపై నిజాం పోలీసులు, రజాకారు మూకలకంటే నెహ్రూ సైన్యాల హత్యలూ అకృత్యాలే ఎక్కువ కదా! దీనిని బట్టి అర్థమవుతున్నదేమిటి? కాషాయ పరివారం చెపుతున్నట్టు ఇది విమోచనే అయితే ఎవరి నుండి ఎవరికి విమోచన? ఈ చారిత్రక వాస్తవాలన్నీ విస్మరించి, వక్రీకరించి "విమోచన గానాలాపన" చేయడంలో ఈ పరివారానికి కొన్ని నిర్దిష్టమైన ప్రయోజనాలున్నాయన్న సంగతి తెలియనిది కాదు. మత విద్వేషాలను రగిలించి రాజకీయ ప్రయోజనాలను పొందేందుకు వీరు ఎంతటి వక్రీకరణలకైనా దిగజారు తారనడానికి ఇంతకు మించిన ఉదాహరణేముంటుంది?

ఇక 'విలీన గానాలాపన' చేసేవారిది మరో ప్రహసనం. తన సైనిక చర్య ద్వారా నిజాంను లొంగదీసుకుని, హైదరాబాద్ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేసింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నది వీరి వాదన. ఈ వాదన ద్వారా ఈ "ఘనత"ను తమ ఖాతాలో వేసుకోవాలన్నది వీరి తాపత్రయం. అదే నిజమైతే నాటి నిజాం రాజుతో సంధి చేసుకుని, హైదరాబాద్ రాజ్యాన్ని స్వతంత్ర దేశంగా గుర్తిస్తూ "యథాతథ ఒప్పందం"పై ఎందుకు సంతకం చేసినట్టో వీరు సమాధానం చెప్పాలి. అంతకుముందే సంస్థానాలలో పోరాటం మన లక్ష్యం కాదని, బ్రిటిష్ ఇండియా పరిధిలోనే ప్రజలను స్వాతంత్ర్య పోరాటానికి సమీకరించాలని తీసుకున్న విధానం వెనుక ఉద్దేశ్యం ఏమిటో కూడా వీరు చెప్పాలి. అంతే కాదు, కమ్యూనిస్టులు విలీనాన్ని స్వాగతించినప్పటికీ, ఆ తరువాత కూడా వారిపై క్రూరమైన అణచివేతకు ఎందుకు పాల్పడ్డారో కూడా చెప్పాలి. నిజానికి 1948లో నెహ్రూ సైన్యాలకు కేవలం రోజుల వ్యవధిలోనే నిజాం లొంగిపోయాడు కదా? కానీ ఆపైన 1951 దాకా మూడేండ్ల పాటు అవి తెలంగాణలో చేసిన యుద్ధం ఎవరి మీద? కమ్యూనిస్టుల మీద, తెలంగాణ ప్రజల మీదనే కదా! ఇక్కడ గమనించవలసిన అసలు విషయం ఏమిటంటే... తెలంగాణ సాయుధ పోరాటం ముందు నిజాం తలవంచక తప్పదనీ, ఆ ప్రజా యుద్ధం ధాటికి నిరంకుశ ఫ్యూడల్ పాలన కూలిపోవడం తథ్యమనీ తేలిపోయాకే భారత యూనియన్ సైన్యాలు రంగప్రవేశం చేసాయి. ఎందుకంటే ఇక్కడ ప్రజలు గెలిస్తే తెలంగాణ కమ్యూనిస్టుల చేతిలోకి వెళుతుందనీ, అది రేపు తమ ఢిల్లీ కోటను కూడా ముట్టడిస్తుందనే భయం వారిది. నిజం చెప్పాలంటే ఇది యూనియన్ సైన్యాలు తెలంగాణ ప్రజల నుండి నిజాం రాజుకు కల్పించిన విమోచన. కమ్యూనిస్టు ఉద్యమ ప్రకంపనలు హస్తినదాకా చేరకుండా నెహ్రూ ప్రభుత్వం తనకు తాను కల్పించుకున్న విమోచన.



ఇదిలా ఉండగా ఇప్పుడు మరో పక్షం తయారైంది. రాష్ట్రంలో అధికారంలో ఉండి కూడా జగత్‌ప్రసిద్ధిగాంచిన ఈ మహాసంగ్రామానికి అధికారిక వేడుకలు జరుపాలన్న చిత్తశుద్ధిలేని వీరు... ఇప్పుడు ఎన్నికల ముంగిట "జాతీయ సమైక్యతా దినోత్సవం" పేరిట ఓ కొత్త నాటకానికి తెరతీసారు. అందరివీ స్వార్థరాజకీయ ప్రయోజనాలే. లేని వారసత్వం కోసం ఆరాటాలే. అంతిమంగా ఆ పోరాట స్ఫూర్తిని నీరుగార్చే ప్రయత్నాలే. ఈ ప్రయత్నాల వెనుక... ఇది "కమ్యూనిస్టుల సారథ్యంలో సామాన్యులు సాయుధులై సాగించిన విముక్తి పోరాటం" అన్న చారిత్రక సత్యాన్ని విస్మరణకు గురిచేయడం కూడా ఒక లక్ష్యం. కానీ నిప్పును గుప్పిట మూయగలరా? వీటన్నిటినీ ఛేదిస్తూ ఆ మహోజ్వల పోరాట వారసత్వాన్ని ముందుకు తీసుకుపోవడంలోనే ఈ దేశ భవిష్యత్తు ఉంది.



ఆకలి, అసమానత, అణచివేతలతో ప్రజా జీవితం మున్నెన్నడూ ఎరుగనంత సంక్షోభంలోకి జారిపోతున్న తరుణమిది. పోరాడి సాధించుకున్న ప్రజల ప్రాథమిక హక్కులు సైతం దిక్కులేనివిగా మారిపోతున్న సమయమిది. మత విద్వేషాలు ఇంతకు ముందెన్నడూ లేనంతగా మనుషుల మధ్య సంబంధాలను సంక్లిష్టం, సంఘర్షణాత్మకం చేస్తున్నాయి. ఏకంగా మతం అధికార శక్తిగా కొలువుదీరిన వర్తమానంలో ఉన్నాం మనం. వ్యక్తిగతమయిన మతం ఆర్థిక, రాజకీయ, సామాజిక సందర్భాలలోకి చొచ్చుకొని రావటం వలన సంభవించిన పరిణామం ఇది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగానే ఈ ధోరణులు పెనుప్రమాదమై ముంచుకొస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల చరిత్రపై, ఉద్యమాలపై విమర్శలు, దాడులు రోజురోజుకూ ఉధృతమవుతున్నాయి. ప్రత్యేకించి భావోద్వేగాలను రెచ్చగొడుతూ మత ప్రాతిపదికపై మనుషులను విభజించే ప్రక్రియ ఊపందుకుంటున్నది. అప్రమత్తంగా ఉండాలి. ప్రతిఘటించాలి.

ఆకలి, అసమానత, అణచివేతలతో ప్రజా జీవితం మున్నెన్నడూ ఎరుగనంత సంక్షోభంలోకి జారిపోతున్న తరుణమిది. పోరాడి సాధించుకున్న ప్రజల ప్రాథమిక హక్కులు సైతం దిక్కులేనివిగా మారిపోతున్న సమయమిది. మత విద్వేషాలు ఇంతకుముందెన్నడూ లేనంతగా మనుషుల మధ్య సంబంధాలను సంక్లిష్టం, సంఘర్షణాత్మకం చేస్తున్నాయి. ఏకంగా మతం అధికార శక్తిగా కొలువుదీరిన వర్తమానంలో ఉన్నాం మనం. వ్యక్తిగతమయిన మతం ఆర్థిక, రాజకీయ, సామాజిక సందర్భాలలోకి చొచ్చుకొని రావటం వలన సంభవించిన పరిణామం ఇది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగానే ఈ ధోరణులు పెనుప్రమాదమై ముంచుకొస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల చరిత్రపై, ఉద్యమాలపై విమర్శలు, దాడులు రోజురోజుకూ ఉధృతమవుతున్నాయి. ప్రత్యేకించి భావోద్వేగాలను రెచ్చగొడుతూ మత ప్రాతిపదికపై మనుషులను విభజించే ప్రక్రియ ఊపందుకుంటున్నది. అప్రమత్తంగా ఉండాలి. ప్రతిఘ టించాలి. జీవితాల్లో అభద్రత, విద్వేషాలు నింపుతూ మనిషిని మనిషి నుండి, మనిషిని సమూహం నుండి వేరు చేస్తున్న శక్తులెవరైనా సరే... వారిని ఎదుర్కోవడం నేటి మన కర్తవ్యం. ఆ కర్తవ్యానికి దారి చూపే దీపస్తంభం వీరతెలంగాణ సాయుధ పోరాటం. ■

విలీనం సరే! సమస్యల సంగతేంది?

ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని, ఇకముందు వారంతా ప్రభుత్వోద్యోగులవుతారని ప్రభుత్వం ఈ ఏడాది జులై 31న నిర్ణయించింది. అందుకు సంబంధించిన యాక్టు అనేక రాజకీయ డ్రామాల అనంతరం ఆగస్టు ఆరున శాసనసభ, శాసనమండలిలో ఆమోదం పొంది, గవర్నర్ ఆమోదం కోసం పంపించింది. వివరణల కోసం న్యాయశాఖకు పంపామని, మొన్ననే తమ కార్యాలయానికి చేరిందని, దానిని పరిశీలిస్తామని గౌరవ గవర్నర్ ప్రకటించారు. గవర్నర్ ఆమోదం పొందిన తరువాత గెజిట్‌గా అది వెలువడుతుంది.

'ప్రస్తుతం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఈ బిల్లు కార్మికులను ప్రభుత్వంలో విలీనంకు మాత్రమే పరిమితమైనదని' రవాణా శాఖ మంత్రి అసెంబ్లీలో ప్రకటన చేశారు. స్పెషల్ చీఫ్ సెక్రెటరీ (ఫైనాన్స్) అధ్యక్షతన ఒక కమిటీని వేశారు. టీఆర్ అండ్ బి ప్రిన్సిపల్ సెక్రటరీ, కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు సభ్యులుగా ఉంటారని, కార్మికుల పేస్కేల్, క్యాడర్ పొజిషన్, పెన్షన్ సమస్య వంటి వాటిపై విధి విధానాలు రూపొందిస్తారని' రవాణా శాఖ మంత్రి తెలియజేశారు. అలాగే 'వాళ్లకు ఏదైతే స్కేలు ఉంటుందో, ఆ స్కేలును ఇప్పుడు గవర్నమెంటులో తీసుకెళ్లి ఫిక్సేషన్ చేయడం జరుగుతుంది' అని కూడా ప్రస్తావించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులో కాని, అసెంబ్లీలో మంత్రి చేసిన ఉపన్యాసంలో కానీ, గవర్నర్ ప్రభుత్వానికి చేసిన రికమండేషన్స్‌లో కాని విలీనం కంటే ముందే పరిష్కారం కావలసిన సమస్యల గురించి ఎటువంటి ప్రస్తావన లేదు. అవన్నీ పరిష్కారం కాకుండా విలీనంతో కార్మికులకు భద్రత వస్తుందని ప్రభుత్వం చెప్పిన మాట నిజమవు తుందా? వేల కోట్ల రూపాయల విలువైన ప్రయోజనాలు వారికి దక్కకుండా 43,055 కుటుంబాలకు ఆర్థిక భద్రత లేకుండానే భద్రత ఎలా వస్తుంది?

విలీనానికి ముందే పరిష్కారం కావలసిన సమస్యలు?

ఆర్‌పిఎస్ 2013 అరియర్స్ : రివైజ్డ్ పే స్కేలు - 2013 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2015 మేలో జరిగింది. 'మన రాష్ట్రం, మన ప్రభుత్వమే వచ్చింది, సరిగా పరిష్కరిస్తుందని' భావించిన కార్మికులను సమ్మెలోకి నెట్టింది. 8 రోజుల సమ్మె అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో 43శాతం ఇస్తే, తెలంగాణ రాష్ట్రంలో 44శాతం ఫిట్‌మెంట్ ప్రకటించారు. ఆ సందర్భంలో గౌరవ ముఖ్యమంత్రి మాట్లాడుతూ, 'మన ప్రభుత్వం ఇప్పుడే ఏర్పడింది. ఆర్‌టీసీ ఆర్థిక పరిస్థితి బాగోలేదు. అందుకని 2013 ఏప్రిల్ నుండి రావలసిన అరియర్స్‌లో 50శాతాన్ని మూడు వాయిదాలలో నగదుగా చెల్లిస్తామని, మిగిలిన 50శాతంకు 8.75శాతం వడ్డీ చెల్లిసూ ఐదేండ్ల తర్వాత ఇస్తామని, అందుకు బాండు కూడా రాసిస్తామని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన బాండ్లు 2015 సెప్టెంబర్‌లో ఇచ్చారు. వాటి కాలపరిమితి 2020 సెప్టెంబర్‌తో ముగిసింది. వాటి కాలవ్యవధి ముగిసి మూడేండ్లు పూర్తయినా ఇంత వరకు వాటి నగదును చెల్లించలేదు. కనీసం ఆ బాండ్స్ కాలవ్యవధిని పొడిగించలేదు. రిటైరైన వారికి, విఆర్ఎస్ తీసుకున్న వారికి కేవలం 2020 వరకే లెక్కించి చెల్లిస్తున్నారు. దాంతో కార్మికులు వేలల్లో నష్టపోతున్నారు. ఆ నష్టం జరుగకుండా ఉండేలా ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యం.

వేతన ఒప్పందాలు : 2013 వేతన ఒప్పందం ప్రకటించే సమయంలో గౌరవ ముఖ్యమంత్రి మాట్లాడుతూ '2013 వేతన ఒప్పందం ఆలస్యమైంది. కాబట్టి, అరియర్స్ చెల్లింపులో చిన్న సర్దుబాటు చేయాల్సి వస్తున్నది. రాబోయే పేస్కేలును కాలపరిమితి కంటే ఒక నెల రోజుల ముందుగానే చేసుకుని, అరియర్స్ ఇబ్బంది లేకుండా చేసుకుందామని' అన్నారు. అనేక విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వం 2017 వేతన ఒప్పందంపై సరిగా స్పందించలేదు. ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న గుర్తింపు సంఘంతో సహా ఆర్‌టీసీలోని అన్ని సంఘాలు ఐక్యమై సమ్మెకు సిద్ధపడ్డాయి. ఆ నేపథ్యంలో సమ్మెను నివారించేలా ప్రభుత్వం 16శాతం మధ్యంతర భృతిని ప్రకటించింది. వచ్చిన ఐక్యతను ఆసరా చేసుకొని పూర్తి వేతన ఒప్పందాన్ని సాధించాల్సిన గుర్తింపు సంఘం ఆ పని చేయకుండా, ప్రభుత్వంతో రాజీపడి, ఐక్యతను నీరుగార్చింది. ప్రకటించిన 16శాతం ఐ.ఆర్.ను 2018 జులై నెల నుండి అమలు చేస్తున్నారు.

మధ్యంతర భృతి కాకుండా పూర్తి వేతన ఒప్పందం జరిగినట్లయితే ఆనాటి కరువు భత్యం 31.1శాతం బేసిక్‌లో మెర్జి అయ్యేది. అలాగే ఫిట్‌మెంట్ కూడా వచ్చి కార్మికుల బేసిక్ పేలు పెరిగి ఉండేవి. అలా కానందున 6 సం॥రాల కాలం కేవలం మధ్యంతర భృతి మాత్రమే పొందుతున్నారు. (ఉదా: 2013 వేతన ఒప్పందం ప్రకారం కండక్టర్ బేసిక్ రూ.12,610లు. దానికి 31.1శాతం డి.ఎ., ఫిట్‌మెంట్ 30శాతం ఇచ్చారనుకంటే రూ.12,610 + రూ.3,922 డి.ఎ. + రూ.3783 - ఫిట్‌మెంట్ కలిపి - 20,315లు



పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేయడం కోసం చెల్లించేది కరువు భత్యం. ఇది యాజమాన్యం దయాదాక్షిణ్యంతో ఇచ్చేది కాదు. దేశ కార్మికవర్గం పోరాడి సాధించుకున్నది. ఆర్‌టీసీ కార్మికులకు 7 డి.ఎలు చెల్లించామని, ప్రభుత్వం, అధికారులు పదే, పదే ప్రకటిస్తూ, వారి దయతోనే ఇస్తున్నారని కార్మికులు భావించే స్థాయికి ప్రచారం చేస్తున్నారు. కానీ ఇచ్చిన 7 డిఎలు, సెప్టెంబర్ నెల జీతంలో కలిపే డి.ఎతో కలిపి 8 డిఎలు కూడా అవి అమలు చేయాల్సిన తేదీ నుండి కాకుండా వారు ప్రకటించిన తేదీల నుండి మాత్రమే అమలు చేస్తున్నారు.

అవుతుంది). ఫిట్‌మెంట్ సర్దుబాటులో అది ఇంకొంచెం పెరుగుతుంది. అంటే రూ.20,315ల పైన రావలసిన కరువు భత్యం, ఇంటి అద్దె, సిసిఎ తదితర అన్ని కలిపితే కేవలం రూ.12,610ల పైన 16శాతం మధ్యంతర భృతి మాత్రమే పొందుతున్నారు. ఇలా ఇంకెంత కాలం? రవాణా మంత్రి చెప్పినట్లు ఇప్పుడున్న వేతనాలను ప్రభుత్వ స్కేల్స్‌లో కూర్చోబెడతాము అనేదే నిజమైతే రూ.20,315కు బదులుగా రూ.12,610 స్థానంలోనే కూర్చుంటారు. అంటే కండక్టర్ కనీస స్థాయిలోనే రూ.7705లపైగా నష్టపోతారు. ఇలా నష్టం కలిగితే కార్మికుల కుటుంబాలకు భద్రత వచ్చినట్లేనా? 2021 ఏప్రిల్ 1 నుండి మరో పే స్కేలు రావలసి వుంది. ఇది కూడా పై పద్ధతిలోనే లెక్కిస్తే కార్మికులకు జరుగుతున్న నష్టం ఏమిటో అర్థమవుతుంది. అందుకని 2017, 2021 వేతన ఒప్పందాలు కచ్చితంగా అమలు చేసి, అరియర్స్ చెల్లింపుకు కూడా గ్యారెంటీ రావాలి. లేకపోతే ఇప్పుడు సర్వీసులో ఉన్న 43055 మందితో పాటు 2017 నుండి ఇప్పటి వరకు రిటైరైన, విఆర్ఎస్ తీసుకున్న, చనిపోయిన కార్మిక కుటుంబాలకు తీరని నష్టం జరుగుతుంది. ఆ నష్టాన్ని జరుగ కుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

డి.ఎలు, డిఎ అరియర్స్ : పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేయడం కోసం చెల్లించేది కరువు భత్యం. ఇది యాజమాన్యం దయాదాక్షిణ్యంతో ఇచ్చేది కాదు. దేశ కార్మికవర్గం పోరాడి సాధించుకున్నది. ఆర్‌టీసీ కార్మికులకు 7 డి.ఎలు చెల్లించామని, ప్రభుత్వం, అధికారులు పదే, పదే ప్రకటిస్తూ, వారి దయతోనే ఇస్తున్నారని కార్మికులు భావించే స్థాయికి ప్రచారం చేస్తున్నారు. కానీ ఇచ్చిన 7 డిఎలు, సెప్టెంబర్ నెల జీతంలో కలిపే డి.ఎతో కలిపి 8 డిఎలు కూడా అవి అమలు చేయాల్సిన తేదీ నుండి కాకుండా వారు ప్రకటించిన తేదీల నుండి మాత్రమే అమలు చేస్తున్నారు. 2023 జులై నుండి రావలసిన డిఎను ప్రకటించలేదు. దానితో కలిపి మొత్తం 9 డిఎలు చెల్లించాలి. 2019 జులై నుండి 2023 జులై డిఎ వరకు మొత్తం 170 నెలల డిఎ అరియర్స్ చెల్లించడానికై యాజమాన్యం, ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయడం లేదు. అందుకని డిఎ అరియర్స్ మొత్తం వెంటనే చెల్లించాలి.

సామాజిక భద్రత పథకాల నిధులు : ఆర్టీసి కార్మికులు తామే నిర్వహించుకొంటున్న క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ (సిసిఎస్) తీవ్రమైన ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ఇందుకు బాధ్యత వహించాల్సినది మాత్రం ఆర్టీసీ యాజమాన్యమే నన్నది సుస్పష్టం. సొసైటీ కోసం చేస్తున్న నెలవారి రికవరీలను సిసిఎస్‌కు చెల్లించకపోవడమే కాక, ఆ డబ్బులను సంస్థ అవసరాలకు కోసం వాడుకొని, వాటిని చెల్లించని ఫలితంగా సర్వీసులో ఉండగా, రిటైరైన తర్వాత వృద్ధాప్యంలో ఆసరాగా ఉండే పరపతి సహకారాన్ని కార్మికులు కోల్పోతున్నారు. సిసిఎస్ విలువ రూ.1500 కోట్లు ఉంటే అందులో 1100 కోట్లు ఆర్టీసీ యాజమాన్యం వాడుకొని 50వేల మంది కార్మిక కుటుంబాల జీవితాలతో చెలగాడటం ఆడుతున్నది. దీనిని మార్చకుండా కార్మికుల కుటుంబాలకు భద్రత ఎలా వస్తుంది? ఇదే దారిలో భవిష్యనిధి, ఎస్ఆర్‌బిఎస్, ఎస్‌బిటి ట్రస్టుల పరిస్థితి ఉంది. కార్మికుల, యాజమాన్యం వాటాలో రూ.1270 కోట్లు పిఎఫ్‌కు, స్టాఫ్ రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీం (ఎస్ఆర్‌బిఎస్) నిధులు రూ.540 కోట్లు, ఎస్‌బిటి నిధులు రూ.140 కోట్లు వాడు కున్నది. సక్రమంగా వాటిని ఆ ట్రస్టులకు చెల్లించ నందున కార్మికులు, వారి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. వాటిని వెంటనే చెల్లించాలి.

సెప్టెంబర్ 15న కోర్కెల దినం : విలీనం ప్రక్రియ కంటే ముందే అమలు చేయాల్సిన 8అంశాలపై రవాణా మంత్రికి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి కార్మిక నాయకులు వినతిపత్రం ఇచ్చారు. పరిస్థితిని సమీక్షించిన ఆర్‌టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ 15వ తేదీన నిరసన దినం జరపాలని, ప్రభుత్వంలో సరైన స్పందన రాకపోతే 'ఇందిరా పార్క్ వద్ద ధర్నా' నిర్వహించాలని కూడా నిర్ణయించింది.న్యాయమైన ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి. లేనట్లయితే కార్మికులకు విలీనం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ జరిగే ప్రమాదం ఉంది. ఆ నష్టం జరగకుండా చూడాలని ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

- పుష్పా శ్రీనివాస్

ఎక్కడుంది న్యాయం?

న్యాయమా ఎక్కడున్నావు?
కోట్లాది కోట్ల నోట్లలలోనా?
పదవుల పలుకుబడిలోనా?
అధికారుల అడ్డాలోనా?
నిజాయితీకి ఉరివేయడంలోనా?
అల్పులను అణచివేయటంలోనా ?

ధర్మ శాసనం గర్భగుడికే పరిమితమైందా?
సమాధి నుండే సమస్యలకు
పరిష్కారం చెబుతుందా?
కళ్ళతో పాటు చెవులను కప్పేసుకుందా
అబద్దాలను అందంగా చెక్కే
సాక్షాలనే నమ్ముతుందా ?

ఆధారాలన్నీ ఉన్న
అన్యాయం ముందు నెగ్గలేకపోయిందా ?
సంతలో అమ్ముడు సర్కయిందా?
కౌరవసభలో ద్రౌపదిలా అభాసుపాలయ్యిందా ?
రాజ్యాంగంలో రహస్యంగా మిగిలిపోయిందా?

ఈ పద్మవ్యూహాన్ని ఛేదించేందుకు
ఎందరు అభిమన్యులు బలి కావాలి?
న్యాయానికి అన్యాయానికి
జరుగుతున్న కురుక్షేత్రంలో
ఎందరు పాండవులు బలిదానం కావాలి?
న్యాయం బ్రతికి ఉంది అనే భ్రమలో
న్యాయదేవత గెలిపిస్తుందన్న ఆశతో
న్యాయని ఆశ్రయిస్తున్న అభాగ్యులు!

అన్యాయానికి ఉన్న శక్తి సామర్థ్యాలు
అవినీతిలో ఆజ్యం పోసుకొని
పురివిప్పి వికటహాసం చేస్తున్నాయని
కొన్ని కబంధహస్తాలలో
ఊపిరాడక సమాధి కాబడ్డాయని
తెలిసేసరికి జీవితం ముగిసిపోతుంది!

-జ్యోతి మువ్వల
9008083344

తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి

సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్

తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సీపీఐ(ఎం) నగర కమిటీ సమావేశం పి.మురళి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జరుపుతున్నామని, 14వ తేదీన కామ్రేడ్ అనబేరి ప్రభాకర్ రావు విగ్రహం నుంచి పోలంపల్లి వరకు బైక్‌యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. 15వ తేదీన సాయంత్రం సెమినార్ ఉంటుందని, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య హాజరవుతున్నారని అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తెలంగాణ పోరాట యోధులు పుచ్చలపల్లి సుందరయ్య, చిట్యాల ఐలమ్మ, భీమ్‌రెడ్డి నరసింహారెడ్డి, అనభేరి ప్రభాకర్‌రావు స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి దేశభక్తి ముసుగులో ఇండియా పేరును భారత్‌గా మార్చాలని, సనాతన ధర్మం అని కొత్త నినాదాలతో రాజకీయ పబ్బం గడుపుకోవాలని కొత్త నాటకాలు మొదలు పెడుతుందని ఆగ్రహం వక్తంచేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్న బీజేపీ విధానాలపై ప్రజలు ఎదిరించి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) నగర కార్యదర్శి గుడికందుల సత్యం, నగర కమిటీ సభ్యులు తిరుపతి నాయక్, పుల్లెల మల్లయ్య, మురళి, కాంపెల్లి అరవింద్, రవీందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుతో ఇబ్బందులు



గుంతల రోడ్డుపై ఇబ్బందులు పడుతూ వెళ్తున్న రైతులు

నవతెలంగాణ - వీణవంక : ఘన్ముక్ల-మల్లన్నపల్లి గ్రామాల మధ్య ఘన్ముక్లకు చెందిన చెరువు మత్తడి కాలువ ఉంది. దీనిపై గతంలో చిన్న బ్రిడ్జి నిర్మించారు. కాగా ఈ రెండు గ్రామాల మధ్య రైతులు, ప్రజలు, విద్యార్థులు రాకపోకలు నిర్వహిస్తుంటారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఘన్ముక్ల-మల్లన్నపల్లి రోడ్డుపై ఉన్న కాలువపై ఉన్న బ్రిడ్జి పూర్తిగా దెబ్బతింది. అయితే ఆ సమయంలో ప్రజాప్రతినిధులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మళ్లీ ఇటీవల కురిసిన వర్షాలకు ఆ బ్రిడ్జి ధ్వంసమై దానిపై పోసిన మెటీరియల్, మట్టి, కంకర కొట్టుకుపోయి యథాస్థితికి చేరడంతో బ్రిడ్జి ప్రాంతం ప్రమాదకరంగా మారింది. దీంతో ఆ రెండు గ్రామాల మధ్య ప్రజలు, రైతులు, విద్యార్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు గమనించి బ్రిడ్జికి తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత మరమ్మతులు చేపట్టాలని రెండు గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

తెలంగాణ రైతాంగ పోరాటాన్ని వక్రీకరిస్తున్న అవకాశవాదులు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని అవకాశవాదులు వక్రీకరిస్తున్నారని సీఐటీయూ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి అన్నారు. స్థానిక ముకుందలాల్ మిశ్రాభవన్‌లో రైస్‌మిల్లు ఆపరేటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా జిల్లా సదస్సు సీహెచ్.భద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం కమ్యూనిస్టుల నాయకత్వంలోని 'సంఘం' ఆధ్వర్యంలో నిరంకుశ నిజాం సర్కార్‌కు, భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన గొప్ప పోరాటం అన్నారు. విస్నూరు దేష్‌ముఖ్ రామచంద్రారెడ్డి గూండాల చేతిలో 1946 జులై 4న వీరమరణం పొందిన దొడ్డి కొమరయ్య మరణంతో సాయుధ పోరాటంగా మారిందన్నారు. నిజాం పాలకుడు ముస్లిం అయితే, భూస్వాములు హిందువులని ఈ భూస్వాములు నిజాం సర్కార్ అండతో ప్రజలను తీవ్రంగా హింసించారని అన్నారు. జన్నారెడ్డి ప్రతాపరెడ్డికి 1లక్షా 50వేల ఎకరాలు, రామచంద్రారెడ్డికి 40 వేల ఎకరాలు ఈ విధంగా 550 మంది భూస్వాముల వద్ద 60 నుంచి 70శాతం వ్యవసాయ భూమి ఉండేదని అన్నారు. 10వేల మందితో కూడిన సాయిధ వాలంటరీ దళాలు, 2వేల మందితో కూడిన గెరిల్లా దళాలు కమ్యూనిస్టుల నాయకత్వంలో భూస్వాములను హైదరాబాద్‌కు తరిమికొట్టారని తెలిపారు. 10లక్షల ఎకరాల భూములను రైతులకు పంచారని, నాలుగు వేల గ్రామాల్లో గ్రామ స్వరాజ్యాలు ఏర్పాటు చేశారని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఘనమైన చరిత్ర ఉందన్నారు. ఇల్లంతకుంట మండలం గాలిపెల్లికి చెందిన బద్దం ఎల్లారెడ్డి పోరాటంలో అనేక దళాలను తయారుచేసిన నాయకుడని అన్నారు. అనభేరి ప్రభాకర్‌రావు, భూపతిరెడ్డితో పాటు 11 మంది సాయుధ పోరాటం తొలి ఎన్‌కౌంటర్ మహమ్మదాపూర్ గుట్టల్లో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించారని అన్నారు. నిజామును లొంగదీసుకోవడం పేరుతో 1948 సెప్టెంబర్ 13న హైదరాబాద్ రాష్ట్రంలో ప్రవేశించిన పటేల్ సైన్యాలు, 17 తారీకు ఐదు రోజులకే నిజాం లొంగిపోయినప్పటికీ పటేల్ సైన్యాలు వెనదిరిగిపోలేదని అన్నారు. నిజాం పోలీసులు, రజాకార్లు, భూస్వాముల గూండాల చేతుల్లో 1500 మంది తెలంగాణ ప్రజలు చనిపోతే, పటేల్ సైన్యం చేతుల్లో 2500 మందిని కాల్చి చంపారని అన్నారు. నిజాంకు మాత్రం రాజా ప్రముఖ్‌గా (గవర్నర్) 1951 వరకు కొనసాగించి, సకల సౌకర్యాలు కల్పించారని అన్నారు. రజాకార్ నాయకుడు ఖాసీం రజ్వీని పాకిస్తాన్‌కు పారిపోయే విధంగా ఏర్పాట్లు చేశారన్నారు. నిజాం పాలనలో కార్మికుల దోపిడీ కూడా తీవ్రంగా ఉండేదని, 1941లో తెలంగాణ ఏరియాలో సుమారు 500 ఫ్యాక్టరీలు 28 వేల మంది కార్మికులు పని చేసేవారు అని, యజమానులకు భారీగా రాయితీలు, పెద్దమొత్తంలో రుణాలు ఇచ్చేవారు కానీ కార్మికులకు దారుణంగా జీతాలు నెలకు రూ.10 నుంచి 15 మాత్రమే ఉండేవి వాపోయారు. పోరాటంతో ఏ సంబంధం లేని బీజేపీ విమోచన పేరుతో, అణచివేసిన కాంగ్రెస్, అణిచివేతలో భాగమైన ఎంఐఎం పార్టీతో అంటగాగుతున్న బీఆర్ఎస్‌కు తెలంగాణ సాయుధ పోరాటం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. అది కేవలం కమ్యూనిస్టుల వారసత్వమేనన్నారు. కార్యక్రమంలో గట్టు సతీష్, సిహెచ్ చంద్రారెడ్డి, ఇజ్జగిరి రాజు, రాజిరెడ్డి, దండు నరసయ్య, ఎడ్ల మల్లారెడ్డి, చంద్రమౌళి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి

మైనింగ్, ఆర్కియాలజిస్ట్ అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు



నవతెలంగాణ - సైదాపూర్

మండలంలోని సర్వాయిపేట సర్వాయి పాపన్న గుట్టల ప్రాంతంలో గ్రానైట్ క్వారీ పరిశీలన కోసం వచ్చిన మైనింగ్, ఆర్కియాలజిస్ట్ అధికారులను బుధవారం గ్రామస్తులు, గౌడసంఘం నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ డివిజన్ గౌడ సంఘం అధ్యక్షుడు పైడిపల్లి రవీందర్ గౌడ్ మాట్లాడుతూ నక్కలబండ గుట్ట గ్రానైట్ క్వారీకి అనుమతులు ఇవ్వద్దన్నారు. అక్కడ గోల్కొండ కోటను జయించిన సర్వాయి పాపన్న ఆనవాళు ఉన్నాయని తెలిపారు. సర్వాయి పాపన్న కోటగడులు, బయన్న గుడి, అయ్యప్ప స్వామి టెంపుల్ చెరువు, తదితర అప్పటి ఆనవాళ్లు ఉన్నాయని, ప్రకృతిసౌందర్యమైన ఈ పెద్దగట్లను మైనింగ్ క్వారీకి ఇస్తే చూస్తు ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు కళా సత్తన్న, ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్, జిల్లా అధ్యక్షుడు శంకరన్న, జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల మురళి, రాజయ్య, కొమరయ్య, శ్రీనివాస్‌గౌడ్, మాజీ సభ్యులు బొమ్మగాని వెంకటేశం, పరశురాం, ఆంజనేయులు, తిరుపతి, సంపత్, జంపాయ, వెంకటయ్య శ్రీనివాస్, మల్లేశం, ఎంపీటీసీ పోశయ్య, రాజయ్య, రఘుపతి, లింగయ్య, సంపత్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ పెన్షన్ పెంపుదలతో ఎల్ఐసీలో సంబరాలు





నవతెలంగాణ - కరీంనగర్ : భారతీయ జీవిత బీమా సంస్థలో చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న ఫ్యామిలీ పెన్షన్‌ను 15 నుంచి 30 శాతానికి పెంచుతూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల ఐసీఈయూ డివిజన్ ప్రధాన కార్యదర్శి వామన్‌రావు హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జాయింట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో సమావేశమై సంబరాలు జరుపుకున్నారు. అధికారుల ఫెడరేషన్ నాయకులు చలం మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా పరిష్కారానికి నోచుకోకుండా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పెండింగ్‌లో ఉన్న సమస్యను ఐక్య ఉద్యమం ద్వారా సాధించుకున్నామని, దీన్ని ఇలాగే కొనసాగిస్తూ పెన్షన్ రివిజన్, అందరికీ పాత పెన్షన్ విధానం, వేతన సవరణ లాంటి డిమాండ్లను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్ ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. 2019లోనే ఎల్ఐసీ బోర్డు తీర్మానం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినప్పటికీ ఉద్యోగుల వ్యతిరేక విధానంతో ఇన్ని సంవత్సరాలు ఆర్థిక మంత్రిత్వ శాఖ తొక్కి పెట్టిందని, ఇతరత్రా ఆర్థిక కారణాలను బూచిగా చూపిందని విమర్శించారు. క్లాస్ వన్, క్లాస్ టు, ఐసీఈయూ, ఫెడరేషన్ సంఘాల జాయింట్ ఫ్రంట్ సమ్మెకు పిలుపునివ్వడంతో ప్రభుత్వం దిగివచ్చిందని, ఇది మన సమిష్టి విజయమని, ఈ ఐక్యతను కొనసాగించి ముమ్ముందు మన సౌకర్యాలను, మన సంస్థను కాపాడాలన్నారు. క్లాసు టు అధికారుల తరపున కమలాకర్ అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో క్లాస్ వన్ ఫెడరేషన్ నాయకులు రవీందర్, శ్రీహర్ష, ఐసీఈయూ నాయకులు రవీంద్రనాథ్, బసవేశ్వర్, శ్రీలత, లత, డీవో యూనిట్ బ్రాంచ్ వన్ నాయకులు, అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొని మిఠాయిలు స్వీకరించారు.

ఉద్యోగ అవకాశాలపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ - హుజురాబాద్



హుజురాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వచ్చే ఉద్యోగ అవకాశాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కెరీర్ గైడెన్స్ సెల్ సమన్వయకర్త మధు మాట్లాడుతూ.. త్వరలో కళాశాలలో వివిధ కంపెనీలలో ఉద్యోగాలకోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయో ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాదేవి, రిసోర్స్ పర్సన్ ఎం.ఉమేష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీనరసింహమూర్తి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పి.దినకర్, అకడమిక్ కో ఆర్డినేటర్ జి.శ్రీనివాస్, ఉపన్యాసకులు ఉదయశ్రీ, గొడిశాల పరమేష్, చారి, సమ్మయ్య, శ్యామలాదేవి, రాజ్‌కుమార్, హరిప్రసాద్, స్వప్న, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

15న చలో హైదరాబాద్ విజయవంతం చేస్తాం

విద్యుత్ ఉద్యోగల దీక్షలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్

నవతెలంగాణ - కరీంనగర్

తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యుత్ సంస్థలో విద్యుత్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కరీంనగర్ సర్కిల్ ఆఫీస్ ఎదుట టీఎస్‌యూఈఈయూ-సీఐటీయూ ఆధ్వర్యంలో 12, 13వ తేదీలలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్, తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ రాచకొండ వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు నలువాల స్వామి మాట్లాడుతూ.. సంస్థలు పని చేస్తున్న ఆర్టిజన్లకు కన్వర్షన్ ఇవ్వాలని, అన్‌మ్యాన్ కార్మికులను ఆర్టిజన్‌గా గుర్తించాలన్నారు. బిల్ కలెక్టర్స్, మీటర్ రీడర్స్, ఎస్పీఎం కార్మికులకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, 2019లో జాయిన్ అయిన జేఎల్ఎం లకు ఏఎల్ఎం గా ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. 2011లో జాయిన్ అయినా జేఎల్ఎంలకు జీతం బకాయిలు ఇవ్వాలని, సబ్ స్టేషన్‌లో నలుగురు ఆపరేటర్లు, ఒక వాచ్‌మెన్ ఉండే విధంగా చూడాలన్నారు. సబ్ స్టేషన్లు రిటైర్ అయిన వాళ్లని తీసివేసి సంస్థలో ఎన్నో సంవత్సరాలుగా పని చేస్తున్న అన్‌మ్యాన్ కార్మికులు, మీటర్ రీడింగ్ కార్మికుల్లో అర్హత ఉన్నా వారితో భర్తీ చేయాలని, ఈపీఎఫ్ టు జీపీఎఫ్, స్క్రీనింగ్ టెస్ట్ లేకుండా పాత పద్ధతిలో కన్వర్షన్ అమలు చేయాలని తెలంగాణ స్టేట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ నెల 15న హైదరాబాద్ ఇందిరా పార్క్ దగ్గర జరుగు మహాధర్నాను కార్మికులందరూ పెద్దఎత్తున హాజరై జయప్రదం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మీరా తిరుపతి, కరీంనగర్ డివిజన్ కార్యదర్శి సురభి శ్రీకాంత్, అధ్యక్షులు రాచకొండ శ్రీనివాస్, కరీంనగర్ డివిజన్ నాయకులు రామ్ చందర్ నాయక్, వెంకటేశ్వరరావు, కరీంనగర్ రూరల్ డివిజన్ కార్యదర్శి నౌసి లాల్, అధ్యక్షుడు శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

15న మెడికల్ కళాశాల ప్రారంభోత్సవం

కరీంనగర్ కలెక్టర్ డాక్టర్ బి.గోపి

ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష



నవతెలంగాణ - కరీంనగర్

ఈ నెల 15న రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించనున్న మెడికల్ కళాశాల, 17న నిర్వహించే తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవాలను సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.గోపి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మెడికల్ కళాశాల ప్రారంభోత్సవం, తెలంగాణ సమైక్యత దినోత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 15న ముఖ్యమంత్రి కేసీఆర్ వర్చువల్ విధానం ద్వారా మెడికల్ కళాశాలను ప్రారంభించనున్న సందర్భంగా 15న ఉదయం రేకుర్తి బ్రిడ్జి నుంచి మెడికల్ కళాశాల వరకు విద్యార్థులు, వైద్య విద్యార్థులు, ఆశా, ఏఎన్ఎం, స్వశక్తి సంఘ సభ్యులతో భారీ ర్యాలీ, అనంతరం జరగనున్న ప్రారంభ కార్యక్రమాన్ని జిల్లా అధికారులు సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. కళాశాలలో స్థలం ఎక్కువగా లేనందున ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చిన వారికి బిస్కెట్స్, మంచినీటిని అందించాలని, ప్రత్యేకంగా మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, ప్రోటోకాల్ ప్రకారం అందరికి ఆహ్వానాన్ని అందించడంతో పాటు సీటింగ్ ఏర్పాట్లను కూడా చేయాలని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఈ నెల 17న నిర్వహించు తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం కార్యక్రమంపై మాట్లాడుతూ.. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమంలో పిల్లలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా చూడడంతో పాటు వివిధ శాఖల వారిగా నిర్వహించే కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సీపీ సుబ్బారాయుడు మాట్లాడుతూ.. 15న కళాశాల వద్ద ఏర్పాట్లను ముందుగానే చూసుకోవాలన్నారు. మెడికల్ కళాశాల నుంచి కరీంనగర్ వరకు మార్గంలో కళాశాల ప్రారంభం దృష్ట్యా వాహనాల రాకపోకలను నిలిపివేస్తామని, అదే రోజు టెట్ పరీక్ష ఉన్నందున ఆ మార్గం గుండా పరీక్షను వ్రాయడానికి వచ్చే అభ్యర్థులు గమనించి వచ్చే వారు ముందుగానే కేంద్రానికి చేరుకునేలా బయలుదేరాలని సూచించారు. ఎక్కడ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని, 15న జగిత్యాల నుంచి వచ్చే వాహనాలను వెలిచాల క్రాస్ రోడ్డు బైపాస్ నుంచి చింతకుంట మీదుగా కరీంనగర్ వెళ్లేలా, కరీంనగర్ నుంచి వెళ్లే వాహనాలు రేకుర్తి నుంచి చింతకుంట వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ కిరణ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్ఓ పవన్ కుమార్, కరీంనగర్ ఆర్డీఓ కె.మహేశ్వర్, సీపీఓ కొమురయ్య, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి : సీఐ ఇంద్రసేనారెడ్డి

నవతెలంగాణ - గన్నేరువరం



రాబోయే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి మండలంలోని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సహకరించాలని సీఐ ఇంద్రసేనారెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఎస్ఐ చందా నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. మండలంలోని ప్రజాప్రతినిధులు సమన్వయం పాటించాలని, సోషల్ మీడియాలో అనవసరమైన పోస్టులు పెట్టకూడదన్నారు. భావోద్వేగాలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించకూడదని సూచించారు. ఎస్ఐ చందా నరసింహారావు మాట్లాడుతూ మండలంలో ప్రశాంత వాతావరణం నెలకొని ఉన్నదని, ఇదే మాదిరి ఎన్నికల వరకు పార్టీల నాయకులు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. పోలీస్ శాఖ అనుమతి తీసుకొని ర్యాలీలు, మైక్ సెట్‌లు, ప్రచార కార్యక్రమాలు చేపట్టవచ్చని తెలిపారు. శాంతి భద్రతల కు విఘాతం కలిగించినట్లయితే ఏ పార్టీ వారైనా చట్టపరంగా చర్యలు తప్పవని అన్నారు.

నూతన జీపీ భవనానికి భూమిపూజ



నవతెలంగాణ - గంగాధర : గంగాధర మండలం బూర్గుపల్లి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనానికి సర్పంచ్ సాగి రమ్య బుధవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఎన్నో ఏండ్ల క్రితం నిర్మించిన భవనంలో ప్రస్తుత జీపీ కొనసాగుతుందని, ఈ దృష్ట్యా నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నిధులు కేటాయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దూలం లక్ష్మి, మాజీ ఏఎంసీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు దూలం శంకర్‌గౌడ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హుజురాబాద్ అభివృద్ధికి అహర్నిశలు కష్టపడతా

ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



నవతెలంగాణ - హుజురాబాద్ : హుజురాబాద్ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడతానని.. తనకు పార్టీలో ఈ స్థాయి ఉందంటే అదంతా సీఎం కేసీఆర్ చలువని ఆయన అండతో నియోజకవర్గాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తానని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం హుజురాబాద్ మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో రూ.10కోట్లతో మినీ స్టేడియం, 25వ వార్డులో కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిలో మురుగుకాలువ, సైదాపూర్ రోడ్డు నుండి వాటర్ ట్యాంకులకు వెళ్లే దారిలో హెచ్‌డిపి ఈ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తనకు అండగా ఉన్నారని, ఆ అండను హుజురాబాద్ అభివృద్ధి కోసం ఉపయోగిస్తానని అన్నారు. అభివృద్ధి పట్ల ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి లేకపోవడం వల్ల అనేక పనులు ఆగిపోయాయని ఆరోపించారు. రాష్ట్రంలో సిరిసిల్ల, సిద్దిపేట, కరీంనగర్ నియోజకవర్గాలు అక్కడి మంత్రులు శ్రద్ధ తీసుకోవడం వల్ల ఎంతో అభివృద్ధి చెంది ఇతర నియోజకవర్గాలకు అవి మోడల్‌గా ఉన్నాయని అన్నారు. బీఆర్ఎస్‌లో ఈటల రాజేందర్ మంత్రిగా రెండుసార్లు పనిచేసినా ఆ నియోజకవర్గాల స్థాయిలో ఎందుకు అభివృద్ధి జరగలేదన్న విషయాన్ని ప్రజలు గమనించాలని చెప్పారు. హుజురాబాద్ ఉప ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అనేక అభివృద్ధి పనులు చేపట్టిన విషయం ప్రజలు గమనించినారని అన్నారు. సైదాపూర్ రోడ్డులో ఆరు కోట్ల రూపాయలతో గుంతల రోడ్డును బాగు చేసిన మాట వాస్తవం కాదా అని అన్నారు. సూపర్ బజార్ రోడ్డు, అన్నపూర్ణ టాకీస్ రోడ్డు ఇలా ప్రతి చోట సీసీరోడ్డు వేసిన మాట ప్రజలు మర్చిపోలేదని అన్నారు. పట్టణంలో మినీ కలెక్టరేట్ భవనాన్ని నిర్మిస్తానని చెప్పారు. మోడల్ చెరువు ప్రాంతాన్ని సిద్దిపేట పెద్ద కోమటి చెరువు మాదిరిగా పిక్నిక్ స్పాట్‌గా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కరీంనగర్‌లో ఉన్నట్టు ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌ను నిర్మిస్తామని, ఔటర్ రింగ్ రోడ్డును నిర్మిస్తామని తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం తపన పడుతున్న తనను ఒక్కసారి హుజురాబాద్ ఎమ్మెల్యేగా గెలిపిస్తే ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఒప్పించి 1000 కోట్ల రూపాయలు నిధులు తెప్పిస్తానని అన్నారు త్వరలోనే హుజురాబాద్ పాత్రికేయులకు ఇండ్ల స్థలాలను అందించి వారి రుణం తీర్చుకుంటానని అన్నారు. మినీ స్టేడియంలో హాకీ గ్రౌండ్, ఫుట్‌బాల్, ఖోఖో, స్విమ్మింగ్ పూల్, బాస్కెట్‌బాల్, షటిల్ కోర్టులతో పాటు పార్కింగ్, టాయిలెట్స్ సౌకర్యం కల్పింస్తామని, స్టేడియంలో కెఫే టేరియా కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు.

పివి జిల్లాను అడ్డుకుంది ఈటల రాజేందరే..

జిల్లాల పునర్విభజన సమయంలో హుజురాబాద్ కేంద్రంగా పీవీ జిల్లా ఏర్పాటు కోసం ఈ ప్రాంతవాసులు ఉద్యమాలు చేస్తే అడ్డుకున్నది అప్పటి మంత్రి ఈటల రాజేందర్ అని ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం హుజురాబాద్ నియోజకవర్గం అభివృద్ధి చేస్తున్నామని.. భవిష్యత్తులో జిల్లా అయ్యే అవకాశం ఉండవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, ఎంపీపీ ఇరుమాల రాణి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, జెడ్పీటీసీ బక్కారెడ్డి, కమిషనర్ సమ్మయ్య, పలువురు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నగర ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలి

కరీంనగర్ మేయర్ సునీల్‌రావు



నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్ నగరం అభివృద్ధి ఇలాగే నిరంతర ప్రక్రియగా కొనసాగాలంటే అభివృద్ధి ప్రదాతలైన మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్‌ను నగర ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు కోరారు. బుధవారం 39వ డివిజన్‌లో పర్యటించారు. విద్యానగర్ శివారు ప్రాంతంలో కార్పొరేటర్ కొండపల్లి సరితసతీష్‌తో కలిసి మొదటగా స్థానిక పద్మావతి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం విద్యానగర్ పలు కాలనీల్లో పాదయాత్ర చేస్తూ డివిజన్ ప్రజలను పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న డ్రయినేజీ సమస్యలను పరిశీలించి, త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం నగరపాలక సంస్థకు చెందిన 75లక్షల సాధారణ నిధులతో సీసీ రోడ్లు, డ్రయినేజీ పైపులైన్ పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మూడున్నర సంవత్సరాల మా పాలకవర్గంలో కరీంనగర్ అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వివిధ గ్రాంట్ల రూపంలో రూ.2వేల కోట్లు ఇచ్చిందన్నారు. అభివృద్ధి నిరంతరంగా కొనసాగాలంటే తప్పకుండ వచ్చే ఎన్నికల్లో గంగుల కమలాకర్‌ను నాలుగో సారి ఎమ్మెల్యేగా, వినోద్ కుమార్‌ను ఎంపీగా గెలిపించుకోవాలని, వారి సేవ ప్రజలకు నగరానికి చాలా అవసరం అన్నారు. ఇటీవల వారి చొరవతో వచ్చిన 133 కోట్ల రూపాయల నిధుల పనులను డివిజన్ వారిగా ప్రారంభం చేస్తున్నట్లు తెలిపారు. శివారు ప్రాంతాల్లో విలీన గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులన్ని ఈ నిధులతో పూర్తిచేస్తామని తెలిపారు. 25న సాయంత్రం ఫుడ్ బజార్‌ను ప్రారంభిస్తామని చెప్పారు.

నేతల దిష్టిబొమ్మలు దహనం



నవతెలంగాణ - హుజురాబాద్ : సమాజంలో అధికంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యత ఇవ్వకుండా బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పెత్తందారులకు ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆ పార్టీల నేతల దిష్టిబొమ్మలను బుధవారం హుజురాబాద్ పట్టణంలో డీఎస్పీ ఆధ్వర్యంలో నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుత... 7శాతం ఉన్న పెత్తందారు రాజకీయ నాయకులు రాజకీయ వ్యవస్థను తమ ఆధీనంలో పెట్టుకుని 93శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తమ తమ పార్టీల నాయకత్వ, అధికార బాధ్యతలు అప్పగించక పోవడం దారుణం అని అన్నారు. కేటీఆర్, రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ మహారాజ్, జిల్లా నాయకులు చిలువేరు రాకేష్, గురుకుంట్ల రాకేష్, సదన్, రాజు, శ్రీనివాస్, వెంకటేష్, నరేష్, రవితేజ, అశోక్, సందీప్, విష్ణు, శ్రీరామ్, ప్రశాంత్, గట్టుమల్లు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల కోసం స్థలం కేటాయింపు



ముగ్గు పోస్తున్న సర్పంచ్ నీల కుమారస్వామి

నవతెలంగాణ - వీణవంక : మండల కేంద్రంలో రోడ్డు వెడల్పులో భాగంగా ఉపాధి కోల్పోతున్న చిరువ్యాపారుల కోసం గ్రామ పంచాయతీ సమీపంలో స్థలం కేటాయిస్తున్నట్లు వీణవంక సర్పంచ్ నీల కుమారస్వామి తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీగా ఉన్న స్థలంలో ఉపాధి కోసం 48 దుకాణాల కోసం తాత్కాలికంగా స్థలం కేటాయిస్తూ బుధవారం ముగ్గు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు వెడల్పులో భాగంగా సుందరీకరణ పనులు జరుగుతున్న సందర్భంగా ఉపాధి కోల్పోకూడదని, వారి కోసం తాత్కాలికంగా స్థలం కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మొండయ్య, తాళ్లపల్లి మహేందర్, నాయకులు నీల పున్నంచందర్, రెడ్డిరాజుల రవి, సుకాసి సురేష్, నీల శ్రీనివాస్, వీర, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

18 ఏండ్లు నిండిన వారు ఓటర్‌గా నమోదు చేసుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మీన్ బాషా

నవతెలంగాణ-జగిత్యాల

18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా పేరు నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మీన్ భాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక మెడికల్ కళాశాలలో జరిగిన అయుష్మాన్ భవ ప్రారంభోత్సవంలో పాల్గొని, అలాగే స్వీప్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడారు. భారత ఎన్నికల ఆదేశాల మేరకు 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకువాలని, విస్తృతంగా ప్రచారం చేస్తున్నామ న్నారు. ఈ


మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ భాషా

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్.లత, స్వీప్ నోడల్ అధికారి లక్ష్మి నారాయణ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నరేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ అధికారుల దౌర్జన్యం?

- అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టి స్వాధీనం
- నిరవధిక సమ్మెలో అంగన్‌వాడీ సిబ్బంది
- అంగన్‌వాడీల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

నవతెలంగాణ-వెల్గటూర్

గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడంలో అంగన్‌వాడీ సిబ్బంది పాత్ర కీలకం. ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారం మొదలుకుని ప్రజలను చైతన్యం చేయడంలో వీరి బాధ్యత గొప్పది. అయితే ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం నుంచి సమ్మె బాట పట్టారు. విధులను బహిష్కరించడంతో మెజారిటీ సంఖ్యలో కేంద్రాలు మూతబడ్డాయి. కానీ ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగుల గొట్టి స్వాధీనం పర్చుకుంటున్నారు. తాము సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తుంటే ప్రభుత్వం అధికారులతో దౌర్జాన్యానికి పాల్పడుతోందని అంగన్‌వాడీ సిబ్బంది మండి పడుతున్నారు.

జిల్లాలోని జగిత్యాల, మల్యాల, మెట్‌పల్లి, ధర్మపురి ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 1065 అంగన్‌వాడీ కేంద్రాలలో 1065 టీచర్లు, 1000కి పైగా హెల్పర్‌లు పని చేస్తున్నారు. కేంద్రాల ద్వారా ఒక్కో కేంద్రం





నుంచి 10-20మంది అంటే సుమారుగా 10వేలకు పైగా చిన్నారులున్నారు. వెయ్యి జనాభా ఉన్న గ్రామంలోని కేంద్రాల్లో 10 గర్భిణులు, బాలింతలకు దాదాపుగా 20వేలపై చిలుకు వరకు లబ్ధి పొందుతున్నారు. నిర్దేశిత మెనూ ప్రకారం వీరికి భోజనంతోపాటు పూర్వ ప్రాథమిక విద్యనందిస్తున్నారు.

బెదిరింపులు..

డిమాండ్ల సాధన కోసం సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె చేస్తున్నారు. మల్యాల ప్రాజెక్టులోని ఒక సెక్టార్ పరిధిలోని అధికార పార్టీకి సంబంధించిన అనుబంధ సంఘంలోని కొంత మంది మాత్రం సమ్మెకు దూరంగా ఉన్నారు. ఐసీడీఎస్ అధికారులతో కలిసి బలవంతంగా కేంద్రాలను తెరిపిస్తున్నారని, అంతే కాకుండా కేంద్రాల తాళాలు పగల గోడుతూ గ్రామాల్లో వీవోఏలకు కొన్ని కేంద్రాలు, పంచాయతీ కార్యదర్శిలకు, మున్సిపల్ కేంద్రాల్లో ఆర్‌పీలకు అప్పగిస్తున్నారు. విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తామంటూ అధికారులు మెమోలు జారీ చేస్తూ అంగన్‌వాడీ సిబ్బందిపై బెదిరింపులకు పాల్పడుతున్నారు.

ఇవీ ప్రధాన డిమాండ్లు...

ప్రస్తుతం అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు రూ.13,650, సహాయ కులకు రూ.7,800 వేతనం ఇస్తున్నారు. వేతన సవరణ చేపట్టి రూ. 26 వేలు ఇవ్వాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఉద్యోగాలను క్రమబద్ధీకరించ డంతోపాటు పదవీ విరమణ వయసు 60 ఏండ్లకు కుదించాలి. పదవీ విరమణ సమయంలో టీచర్లకు రూ. 0 లక్షలు, సహా యకులకు రూ. 5 లక్షల నగదు ఇవ్వాలని, పింఛను, ఈఎస్ఐ వర్తింపజేసి ఆరోగ్య భద్రత, రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిం పజేయాలని, పిల్లలకు రూ.5, గర్భిణులు, బాలింతలకు రూ. 10 చొప్పున ఆరోగ్యలక్ష్మి మెనూ ఛార్జీలు పెంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

అంగన్‌వాడీల కేంద్రాల తాళాలు పగుల గొట్టే విషయంపై సంబంధిత జిల్లా అధికారికి నవతెలంగాణ ప్రతినిధి ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాడుతాం..



ఏండ్ల తరబడి అంగన్‌వాడీ కేంద్రాల్లో చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నాం. ఆరోగ్య బీమా, ఉద్యోగ భద్రత లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. వెట్టిచాకిరి చేస్తున్నాం. పనికి తగ్గ వేతనం అందడం లేదు. దీంతో నిత్యావసర ధరలు రోజు రోజు ఆకాశాన్ని తాకుతున్నాయి. కుటుంబ పోషణ భారంగా మారింది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి కొన్ని నెలలుగా దఫా దఫా లుగా మేము నిరసనలు, వినతిపత్రలు ఇస్తూ విన్నవి ంచాం. ప్రభుత్వం మాపై కరుణ చూపి డిమాండ్లు పరిష్క రించకుండా ఉండటంతో నిరవధిక సమ్మె బాట పట్టాం.

-రజిత, జిల్లా అధ్యక్షురాలు,
అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

పాడి పశువుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ లోక నిర్మల

నవతెలంగాణ-పెగడపల్లి

తెలంగాణ ప్రభుత్వం పాడి పశువుల అభివృద్ధికి కృషి చేస్తోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ లోక నిర్మల అన్నారు. పెగడపల్లి మండల పరిధిలోని మద్దులపల్లి గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 418 పశువులకు గాలికుంటు టీకాలు వేసి ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ శ్రీకాంత్, సర్పంచ్ గుర్రం అనూష మల్లారెడ్డి, ఎంపీటీసీ గుర్రం స్వాతి తిరుపతి రెడ్డి,మార్కెట్ వైస్ చైర్మన్ రాజు ఆంజనేయులు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు ఉప్పుగండ్ల నరేందర్‌రెడ్డి, నంచర్ల సింగిల్ విండో చైర్మన్ మంత్రి వేణు గోపాల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, యూత్ విభాగం మండల అధ్యక్షుడు సోల్లెటి సంతోష్ కుమార్,మార్కెట్ కార్యదర్శి ఫైజుద్దీన్, సిబ్బంది వెటర్నరీ సిబ్బంది సంతోష్, వినీత్, గోపాల మిత్రలు. జానీపాషా, శంకరయ్య, తిరుపతి రైతులు పాల్గొన్నారు.


రైతులకు ఉచిత మందులు అందిస్తున్న లోక నిర్మల

ఆయుష్మాన్ భావ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-జగిత్యాల

ప్రజల ఆరోగ్య విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందని డాక్టర్ స్వాతి లక్ష్మణ్ అన్నారు. బుధవారం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వర్చువల్ విధానం ద్వారా "అయుష్మాన్ భావ" కార్యక్రమాన్ని ప్రారంభించారు. జగిత్యాల మోతె అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ స్వాతి మాట్లాడుతూ.. కేంద్రం పరిధిలోని ప్రజలందరికి నాణ్యమైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం పక్షాన కృషి చేస్తున్నామన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్లోని సమావేశ మందిరంలో దశ్య మాధ్యమాన్ని డాక్టర్‌తో పాటు ఆసుపత్రి సిబ్బంది తదితరులు తిలకించారు. ఈ కార్యక్రమంలో మోతె అర్బన్ హెల్త్ సెంటర్ స్టాఫ్ సుజన్ కుమార్ , సిబ్బంది పాల్గొన్నారు.


పాల్గొన్న వైద్య సిబ్బంది

ఫార్మసిస్టుల రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉదయ్ ప్రసాద్

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఫార్మసిస్టుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఆరోగ్య ప్రాథమిక కేంద్రంలో ఫార్మాస్టుగా పని చేస్తున్న చిలువేరి ఉదయ ప్రసాద్ ఎన్నిక య్యారు. కాగా ఆయనను సిబ్బంది ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉదయ ప్రసాద్ మాట్లాడుతూ వైద్య. ఆరోగ్య రంగంలో ఫార్మసిస్ట్ పాత్ర ఎంతో కీలకమైందని, ఫార్మసిస్ట సమస్యలను రాష్ట్ర కమిటీ ద్వారా ప్రభుత్వానికి నివేదించి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.


ఉదయ్ ను సన్మానిస్తున్న సిబ్బంది

ఎమ్మెల్సీ కవితకు మున్నూరు కాపు నాయకుల వినతి

నవతెలంగాణ-జగిత్యాల

జిల్లా కేంద్రంలో మున్నూరు కాపులకు విద్యార్థి వసతి గృహానికి, సంఘ భవన నిర్మాణానికి స్థలం, నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ కవితకు తెలంగాణ మున్నూరు కాపు సంఘం కార్యదర్శి హరి అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బాధినేని రాజేందర్ లు వినతి పత్రం సమర్పించారు. బుధవారం మ్యాంగో మార్కెట్ ఆవరణలో బీ.ఆర్.ఎస్.జగిత్యాల నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాకి వచ్చిన ఆమెను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్నూరుకాపు నాయకులు సమిండ్ల శ్రీనివాస్, చిట్ల రమణ, కూసరి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మల్లాపూర్ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

- ఆర్డీవో మధు, తహసీల్దార్ వీర్ సింగ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్

నవతెలంగాణ-మల్లాపూర్

గ్రామాలలో లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవలు అభినందనీయమని మెట్‌పల్లి ఆర్డీవో దూలం మధు, తహసీల్దార్ వీర్ సింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ కనుక సంజీవ్ ఆధ్వర్యంలో ముద్రించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..అక్టోబర్ 1 నాటికి 18 ఏండ్లు నిండబోయే యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమైన భారతదేశంలో ఎన్నికల ద్వారా నాయకులను ఎంపిక చేసుకొనే హక్కు ఉందని, యువత తన ఓటు లెక్కలోకి రాదని కాకుండా ప్రజాస్వామ్యాన్ని ముందుకు నడిపించేందుకు తప్పనిసరిగా ఓటు వేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రీజినల్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, మల్లాపూర్ 143 ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ముత్యాల రమేష్, కార్యదర్శి మోర సతీష్, లయన్స్ క్లబ్ సభ్యులు పుప్పల మహేష్, తిప్పర్తి రామకిషన్, ఆర్ఐ సురేష్, ఎల్లాల తుక్కరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల చిత్ర పటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-ధర్మపురి

ధర్మపురి మండలంలోని దమ్మన్న పేట, రాజారం గ్రామా లకు ఎస్‌డీఎఫ్ ద్వారా బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాలకు నిధులు మంజూరు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులను సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చొరవతో ఆయా గ్రామాల్లోని 12 అభివృద్ధి నిర్మాణ కార్యక్రమాలకు మంజూరు చేయించారు. ధర్మపురి మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో ఎల్లమ్మ టెంపుల్ నుంచి తుమ్మెనాల ఎక్స్ రోడ్డుకు రూ.3కోట్ల 5 లక్షలు, వీరభద్ర స్వామి టెంపుల్ కమ్యూనిటీ హాల్‌కు రూ.25 లక్షలు, యాదవ సంఘం భవనానికి రూ.25 లక్షలు, ఎల్లమ్మ టెంపుల్‌కు రూ.25 లక్షలు, గ్రామంలోని రైతు వేదిక భవనానికి రూ.25 లక్షలు, వీరన్న టెంపుల్ నుంచి మంగలి మల్లయ్య ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.35 లక్షలు, వీరన్న ఆలయం నుంచి కిషన్ ఇంటి వరకు రూ.16 లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణం, దాసరి పల్లె నుంచి మామిండ్ల పోచమ్మ గుడి వరకు రూ.50 లక్షలు, రాజేశం ఇంటి నుండి సిహెచ్ వెంకన్న ఇంటి వరకు డ్రైనేజీ కోసం రూ. 11 లక్షలు, ఎం శ్రీను ఇంటి నుంచి భీమన్న ఇంటి వరకు రూ.10 లక్షలు, రాజారం గ్రామంలో రైతుల వేదికకు రూ.25 లక్షలు, గ్రామంలోని ఎల్లమ్మ టెంపుల్ కమ్యూనిటీ హాల్ కోసం రూ.25 లక్షలు, మొత్తం రూ.5 కోట్ల 87 లక్షల ఎస్డిఎఫ్ నిధులను మంజూరు చేయించినందుకు సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, సీఎం కేసీఆర్ చిత్ర పటాలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీల, బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు.


పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మండల స్థాయి క్రీడాలు ప్రారంభం

నవతెలంగాణ- మల్యాల

మండలంలోని తాటిపల్లి గురుకుల పాఠశాలలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులకు అండర్స్-14, అండర్-17 విభాగాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాలు బుధవారం నిర్వహించారు. ఎంఈవో శ్రీనివాస్, ప్రిన్సిపాల్ పి శ్రీనివాస్, ఎంపీపీ మిట్టపల్లి విమల పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మల్యాల సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న ఎంపీపీ మిట్టపల్లి విమల

ఆర్ఎంపి, పీఎంపీ భవన నిర్మాణానికి ప్రొసీడింగ్ పత్రాలు అందజేత

నవతెలంగాణ-పెగడపల్లి

పెగడపల్లి మండల ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ భవన నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి మంజూరు చేసిన రూ.10 లక్షల మంజూరు చేసిన ప్రొసీడింగ్ పత్రాన్ని ఆర్ఎంపీ, పీఎంపీలకు కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీ మండల అధ్యక్షుడు కుసుమ శంకర్, వైస్ ఎంపీపీ మండల ప్రధాన కార్యదర్శి గాజుల గంగాధర్, కోశాధికారి బర్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల నిర్వహకులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

- జగిత్యాల ఎస్పీ భాస్కర్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

పోలీసు శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన http:// policeportal. tspolice. gov.inలో గణేష్ మండపం నిర్వహణకు సంబంధించిన దరఖాస్తు చేసుకోవాలని జగిత్యాల ఎస్పీ భాస్కర్ సూచించారు. ఈ సమాచారం ద్వారా భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసులకు సులువుగా ఉంటుందన్నారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే ఎలాంటి రూమర్స్, వదంతులను నమ్మొద్దని సూచించారు. ఎవరికైనా ఎలాంటి సందేహాలు ఉన్న సంబంధిత పోలీసు వారికి లేదా డయల్ 100కి సమాచారం ఇవ్వాలన్నారు.

దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ

- ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు

నవతెలంగాణ-మల్లాపూర్

దేశంలోనే అభివృద్ధి చెంది, నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని కుస్తాపూర్ గ్రామంలో మున్నూరు కాపు ఫంక్షన్ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టని సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేశారని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత తొమ్మిదేండ్లల్లో గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధి జరిగిందన్నారు. అనంతరం గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సంధిరెడ్డి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ సరికెల లక్ష్మి, నాయకులు డీలర్ మల్లయ్య, కాటిపల్లి ఆదిరెడ్డి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, ద్యాగా గంగారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

స్వచ్ఛ సర్వేక్షన్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన చింతలపెట్

నవతెలంగాణ -మెట్ పల్లి

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2023 అవార్డుకు జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం చింతలపెట్ గ్రామం రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైనట్లు గ్రామ సర్పంచ్ మేకల అర్చన తెలిపారు. బుధవారం జగిత్యాల జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2023 అవార్డులకు ఎన్నికైన మెట్ పల్లి మండలంలోని వెల్లుల్ల, చింతలపెట్ గ్రామాల సర్పంచ్ గూడూరు రజినీ తిరుపతి, మ్యాకల అర్చన సుదర్శన్ అవార్డులు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ మారు స్థాయిరెడ్డి, ఎంపీడీవో బీమేశ్, ఎంపీవో మహేశ్వర్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ లు, అశోక్, ఎంపీఎం విమోచన, సీసీ సూరయ్య, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.


అవార్డు అందుకొంటున్న వెల్లుల్ల సర్పంచ్

సబ్బండ వర్గాలకే రాజ్యాధికారం రావాలి

- తెలంగాణ బహుజన గలం వ్యవస్థాపకులు లింగంపల్లి నరేష్

నవతెలంగాణ-మల్లాపూర్:

సబ్బండ వర్గాలకే రాజ్యాధికారం రావాలని తెలంగాణ బహుజనగలం వ్యవస్థాపకుడు రచయిత గాయకుడు లింగంపల్లి నరేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సబ్బండ వర్గాల చైతన్య వేదిక నిర్వహించారు. అనంతరం ప్రజా గాయకుడు గద్దర్‌కు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాంచన్ గిరి బతుకులయే తెలంగాణలో ఆల్బమ్ ఆవిష్కరించి మాట్లాడారు. . అనుగారిన వర్గాల హక్కుల కోసంసబ్బండ వర్గాలు నిరంతర పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాలలో కులవృత్తులను ధ్వంసంమై కులాలుగా విడిపోయిన వారందరూ, రాజ్యాధికారం సాధించేందుకు ఏకమవ్వాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ఓబీసీలు, పార్టీలకు అతీతంగా ఏకమవ్వాలని అన్నారు. 75 సంవత్సరాలుగా అణుగారిన వర్గాలను దొరలు పాలిస్తూనే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమానికి బిజెపి పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి జేఎన్ వెంకట్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ .. దొరల పాలనలో తెలంగాణ బందీపాలైందని, బీసీలంతా ఏకమై సబండ వర్గాలకు రాజ్యాధికారం వచ్చేంతవరకు పోరాటం చేయాలని అన్నారు. నియోజకవర్గంలో అత్యధికమంది ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఓబీసీలు, ఉన్న అతి తక్కువ ఓటు శాతం ఉన్న దొరలు మనల్ని పాలించడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొన్నం తిరుపతి గౌడ్, రుద్ర శ్రీనివాస్ వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పాల్గొన్న మహజన నాయకులు

జాతీయ స్థాయి అవార్డులు పొందాలి

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

నవతెలంగాణ-జగిత్యాల

గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తూ జాతీయస్థాయి అవార్డు పొందాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ... జిల్లా స్థాయిలో 15 గ్రామ పంచాయతీలకు అవార్డులు రావడం శుభపరిణామమన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా గ్రామాల స్థితిగతులు మారుతున్నాయన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సమిష్టి కృషి, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలు అభివృద్ధి చెందు తున్నాయన్నారు. ప్రభుత్వం పల్లెప్రగతి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ప్రతీ నెల గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించడం ద్వారా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. తద్వారా దేశానికే ఆదర్శవంతమైన గ్రామాలుగా కీర్తి సంపాదిస్తున్నాయని, మున్ముందు కూడా ఇదే కృషితో ప్రగతి సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ చట్టాన్ని తీసుకొచ్చి గ్రామాభ్యున్నతికి తోడ్పాడుతోందని కలెక్టర్ యాస్మిన్ భాషా అన్నారు. భావితరాల వారికీ మంచి వాతావరణం అందించడం కోసం గ్రామాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించు కుంటున్నామని, వంద శాతం ఇంటిపన్ను వసూలు ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో మొదటి స్థానం సాధించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు పోటీతత్వంతో పని చేయాలని సూచించారు. దేశంలోనే జగిత్యాల జిల్లా రెండవ స్థానంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రజా ప్రతినిధుల సహకారం, అధికారుల పర్యవేక్షణ, ప్రజల భాగస్వామ్యం ద్వారానే ప్రగతి సాధించామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ చంద్రశేఖర్‌గౌడ్, ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వెంకట్రావ్, జిల్లా గ్రామీణాభివద్ధి అధికారి నరేష్ అధికారులు పాల్గొన్నారు.


అవార్డు అందజేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



అద్దె అంగన్‌వాడీ కేంద్రం తాళం ధ్వంసం

ఇంటి యజమానికి సమాచారం ఇవ్వకుండా పగులగొట్టిన అధికారులు

నవతెలంగాణ-కోరుట్ల

కోరుట్ల పట్టణంలోని రాంనగర్ ప్రాంతంలో అద్దె భవన్‌లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం తాళాన్ని సీఐడీఎస్ అధికారులు పగుల గొట్టారు. ఆ ఇంటి యజమానికి సమాచారం ఇవ్వకుండా అధికారులు తీశారు. సోమవారం నుంచి అంగన్‌వాడీలు సమ్మె చేస్తుండడంతో అంగన్‌వాడీ సెంటర్లకు తాళాలు వేసి ఉన్నాయి. ఈక్రమంలో సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి జిల్లా అధికారి నరేష్ బోనగిరి సమక్షంలో అధికారులు తాళాలు పగులగొట్టారు. స్థానిక కౌన్సిలర్, అధికారి ఇంటి యజమానికి తెలుపకుండా వచ్చి తాళాలు పగులగొట్టడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధికారి నరేష్‌ను సంప్రదించగా తాము ఏడాది ముందే అద్దె చెల్లించి, లీజుకు తీసుకున్నామని చెప్పారు. ఇంటి యజమానికి సమాచారం ఇవ్వలిగా అని ప్రశ్నించగా ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. ఏఐటీయూసీ అధ్యక్షులు అంగన్‌వాడి టీచర్ సాయిా ఈశ్వరి మాట్లాడుతూ.. తమ ఉద్యోగ భద్రత కోసం సమ్మె చేస్తుంటే ప్రభుత్వం విచ్ఛిన్నం చేస్తోందని మండిపడ్డారు. భవనం అద్దెకు సంబంధించి యజమానికి ఎలాంటి వ్రాతపూర్వకంగా ఏమీ ఇవ్వలేదని, మూడు, నాలుగు నెలలకోసారి అద్దె ఇస్తున్నామని తెలిపారు.

పోచమ్మ ఆలయంలో జడ్పీ నీలిమ పూజలు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణంలోని పురాణిపేటలో లోకమాత పోచమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా జిల్లా జడ్జి నీలిమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలతో దాండియా ఆడారు.

జీపీ భవన నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ- కథలాపూర్

మండలంలోని బొమ్మెనా గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి సర్పంచ్ లావణ్య తిరుపతి బుధవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుధాకర్, ఎంపీడీఓ, ఎంపీవో పాల్గొన్నారు.



కళ్యాణలక్ష్మి పథకం పేదింటి ప్రజలకు వరం

-ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

నవతెలంగాణ- ఇల్లంతకుంట:

మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక రథసారథి మానకొండూర్ శాసనసభ్యులు రసమయి బాలకిషన్ బుధవారం పర్యటించారు. వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సుమారు 20 లక్షలు కళ్యాణ లక్ష్మీ చెక్కులు అందించారు . మండల కేంద్రంలో పలు అభివద్ధి పనులకు భూమి పూజ చేశారు. ప్రజా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పల్లె పల్లెనా అభివృద్ధి కార్యక్రమాలు జరుపుతుందన్నారు.



సమైక్య పాలనలో అన్నీ సమస్య లేన న్నారు. తాగు నీరు, సాగునీటికి కొరత లేదని అన్నారు . కరంటు లేక గ్రా మాలు విల విల లాడా యని, తెలం గాణ ప్రభు త్వంలో 24 గంటల విద్యుత్, మిషన్ భగీ రథతో తాగునీరు, ఎత్తిపోతల పథకాలు పూర్తి చేసిందన్నారు.

తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రశాంతంగా వినాయక ఉత్సవాలు జరుపుకోవాలి

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ-తంగళ్ళపల్లి



పోలీస్ స్టేషన్ తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రజలకు సూచించారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. చాలాకాలంగా పోలీస్ స్టేషన్లోనే పడి ఉన్న వాహనాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఠాణాకు వచ్చిన ప్రతి ఫిర్యాదుకు రసీదును తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. వినాయక ఉత్సవాలను ఏలాంటి మతపరమైన ఘర్షణలకు తావివ్వకుండా ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్ రెడ్డి, సిరిసిల్ల రూరల్ సీఐ సదన్ కుమార్,ఎస్సై వెంకటేశ్వర్లు ఉన్నారు.

రైతాంగ పోరాట యోధుడు తిరుపతిరెడ్డి

నవతెలంగాణ- చందుర్తి:

రైతాంగ సాయుధ పోరాట యోధుడు గడ్డం తిరుపతి రెడ్డి అని సీపీఐ నాయకులు కడారి రాములు అన్నారు. బుధవారం ఆయన బండపల్లి గ్రామంలోని కమ్యూనిస్టు యోధుడు గడ్డం తిరుపతి రెడ్డి స్మారక స్తూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 17 వరకు తెలంగాణ సాయుధ పోరాట యోధుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా పోరాటయోధులకు నివాళులు అర్పించడం జరుగుతుందన్నారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ- చందుర్తి:

ముఖ్యమంత్రి కేసీఆర్ సభను విజయవంతం చేయాలని మండల బీఆర్ఎస్ నాయకులు మ్యాకల ఎల్లయ్య అన్నారు. బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 15న సిరిసిల్లలో జరిగే భారీ బహిరంగ సభకు చందుర్తి మండలంలోని అన్ని గ్రామాల నుండ ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబు అరెస్ట్ అప్రజాస్వామికం

నవతెలంగాణ-చందుర్తి:

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని వేములవాడ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు పులి రాంబాబు అన్నారు.బుధవారం ఆయన మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. వెంటనే చంద్రబాబు నాయుడును విడిచి పెట్టాలని డిమాండ అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నెంబర్ వెంకటి కార్యకర్తలు పాల్గొన్నారు.

గణపతి మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-చందుర్తి:

గణపతి మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలని సీఐ కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని అన్ని గ్రామాల గణపతి నిర్వహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద అసంఘీక శక్తుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏలాంటి గొడవలకు తావు లేకుండా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సై అశోక్ మండపాల నిర్వహకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలు

నవతెలంగాణ- ముస్తాబాద్.



ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకల్లో బీసీ నాయకులు

మండలంలోని కొండాపూర్ గ్రామంలో బీసీ హక్కుల రాష్ట్ర అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ బీసీల హక్కుల సాధనకై, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఆర్ కృష్ణయ్య ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి పిడుగురాళ్ల సురేష్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రావణ్ కుమార్, బీసీ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు బండి ఆదర్శ్ పటేల్, పాకాల నవీన్, దాసోజు శ్రీనివాస్,సర్దని దేవయ్య,సర్దని ఎల్లయ్య, చిగురు శేంకర్,సర్దని శ్రీనివాస్, ఎండీ, సొహెల్,కోతపెల్లి శివ,చిగురు రమేష్ , ముష్కం అశోక్,పెద్దురి బలార ములు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలువెంటనే చెల్లించాలి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన


నవతెలంగాణ-కోనారావుపేట



ఆందోళన చేపిస్తున్న కార్మికులు

పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తయారు చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్క రించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణ అన్నారు. ఈ మేరకు కోనరావుపేట తహశీల్దార్ విజయ్ ప్రకాశరావుకు వినతీపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజనకార్మికులకు జీవో నెంబర్ 8 ప్రకారం పెంచిన వేతనాలు ఏరియాస్ ప్రకారం అందించాలని సబ్సిడీ గ్యాస్ కొత్త మెనూ సంహరించాలని , ప్రమాద బీమా సౌకర్యం కల్పించి కార్డులను అందజేయాలని లేనిపక్షంలో సమ్మె కొనసాగుతామని అన్నారు చాలీచాలని వేతనాలతో అప్పుల అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో. సిఐటియు నాయకురాలు సుర పద్మ కార్మికులు పుష్పలత, గడప సంధ్య, దప్పుల లక్ష్మి, లత, గడ్డం కవిత, పులి వసంత, దాసరి మరియ, పాటి కమల. జంగం దేవవ్వ తదితరులు ఉన్నారు.

దాబాపై ఎక్సైజ్ దాడులు



దాబా సీజ్ ...ఇద్దరిపై కేసు నమోదు

నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మద్యం దాబాలు విచ్చలవిడిగా కనిపిస్తున్నాయి. సిరిసిల్ల సమీపంలోని రగుడు సమీపంలో ఉన్న దాబాపై ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. దాబాలో బార్ విచ్చలవిడిగా నడుస్తోందని ఒక వ్యాపారి ఫిర్యాదు చేయడంతో ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. ఈ దాడిలో సుమారు రూ.50 వేల విలువగల మద్యంను పట్టుకున్నారు. దాబాను సీజ్ చేసి, దాబా నిర్వాహకులు ఆసరి సతీష్, ముని శ్రీకాంత్ అనే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు.

నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

నవ తెలంగాణ-వేములవాడ రూరల్

నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతి జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తుందని వేములవాడ అర్బన్ మండల జడ్పీటీసీ మ్యాకల రవి అన్నారు. బుధవారం వేములవాడ అర్బన్ మండలం చింతల్ ఠాణా ఆర్అండ్ఆర్ కాలనీలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బూర వజ్రమ్మ-బాబు, సెస్ డైరెక్టర్ హరిచరణ్ రావు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల బీజేపీలో బీటలు.. రాజీనామా బాటలో నేతలు

మాజీ ఎమ్మెల్యే బీజేపీకి రాజీనామా

బండి సంజయ్ మార్పుతో అసంతప్తి

నవతెలంగాణ- సిరిసిల్లరూరల్

రాజన్న సిరిసిల్ల జిల్లాలో బీజేపీకీ బీటలు పారుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇటీవల ఓ కీలక నేత బీజేపీకీ టాటా చెప్పారు. ఒక్కరొక్కరుగా బీజేపీ నేతలు రాజీనామాలు చేస్తుండడం కనిపిస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్‌ని మార్పు చేయ డంతో పాటు మారుతున్న రాజకీయ పరిణామాలు ఇందుకు ప్రధాన కారణమని చెబు తున్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో టిక్కెట్లు లొల్లి పుట్టింది. నాకంటే నాకేనని టిక్కెట్ల కోసం నేతల్లో పోటాపోటీ పెరిగింది. ఇప్పటి వరకు సిరిసిల్ల నియోజకవర్గం నుండి బీజేపీ టికెట్ కోసం 15 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. జిల్లాలో సరైన నాయకత్వం లేకపోవడంతో సిరిసిల్ల బీజేపీలో నేతలు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు కనిపిస్తుంది.

సిరిసిల్ల బీజేపీలో వర్గపోరు

జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల నియోజకవర్గంలో కార్యక్రమాలు పట్టించుకోవడంలేదని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పద్మశాలి వర్గానికి చెందిన లగిశెట్టి శ్రీనివాస్‌కు టికెట్ వస్తుందని బలంగా వినిపిస్తున్నప్పటికీ నియోజకవర్గంలోని కొందరు నేతలు ఆయనపై అసంతప్తితో ఉన్నట్లు కనిపిస్తుంది. నాయకులను కలుపుకొని వెళ్లడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో రాష్ట్ర అధినాయకత్వం టికెట్ విషయంలో సమాలోచనలో పడ్డట్టు తెలుస్తోంది.

బలమున్ననేత మరో పార్టీలోకి

మాజీ ఎమ్మెల్యే కటకం మత్యుంజయం సిరిసిల్ల నియోజకవర్గంలో బీజేపీలో బలమున్ననేతగా చెప్పు కోవచ్చు. తలపండిన రాజకీయ నేత. ఉమ్మడి రాష్ట్రంలో డీసీసీ అధ్యక్షు నిగా పని చేశాడు. టీఆం ఎస్ ఆవిర్భావ సమ యంలో కేసీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీఆర్ఎస్ చేరాడు. అత్యంత స్నేహితుడిగా ఉండే మత్యుంజయం ఆయన పిలుపు మేరకు టిఆర్ఎస్ పార్టీలో చేరారు. కానీ వారి మధ్య భేదాభిప్రాయాలు రావడంతో టీఆర్ఎస్‌కు సైతం రాజీనామా చేసి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ నమ్మదగిన నేతగా రాణించాడు. బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్ష పదవీనుండి తపించడంతో మృంత్యుంజయం తవ్ర అసంతృప్తికి లోనైయ్యాడు. ఆ తర్వాత ఆయన బీజేపీకి రాజీనామా చేసి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరాడు. మృంత్యుంయం బాటలో చాలా మంది బీజేపీ నేతలు పార్టీ నుండి బయటకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.



సిరిసిల్ల బీజేపీలో నాయకత్వ లేమి

సిరిసిల్ల నియోజకవర్గంలో నాయకత్వం వహించే నాయకుడు బీజేపీలో లేడని చెప్పుకోవచ్చు. దీని ప్రతిఫలమే బీజేపీ మూడు ముక్కలాటగా మారింది. ఎవరూ పార్టీలోకి వస్తున్నారో, ఎవరూ పార్టీకి రాజీనామా చేస్తున్నారో ఆ పార్టీ నాయకులకే అర్థం కానీ పరిస్థతి నెలకొంది. వేములవాడ ప్రాంతంలో బీజేపీకి కొంత పట్టు ఉండగా, సిరిసిల్ల ప్రాంతంలో నాయకత్వం లేమి కొట్టచ్చినట్లు కనిపిస్తోంది. సిరిసిల్ల శాసనసభ్యునిగా కేటీఆర్ ప్రాతినిథ్యం వహించడంతో బీజేపీ మనుగడ లేకుండా పోయిందని చెప్పవచ్చు. నేతల మధ్య ఉన్న విభేదాలు కూడా కార్యకర్తలను మరింత దూరం చేస్తున్నాయని ప్రచారం జరుగుతోంది.

మండపాల పూర్తి బాధ్యత నిర్వాహకులదే

- మండపాల వద్ద సీసీ కెమెరాలు ఉండాలి
- ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదు
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్

మత సామరస్యం, సహెూదర భావంతో పండుగలు జరుపుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం రోజున సిరిసిల్ల పట్టణ పరిధిలోని పద్మనాయక ఫంక్షన్‌హాల్ లో పట్టణంలోని గణేష్ మండపాల నిర్వహకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎస్పీ మాట్లాడుతూ రానున్న గణేశ్ చతుర్థి, మిలాద్ ఉల్ నబీ పండుగలు మత సామరస్యం, సహెూదర భావంతో పండుగలు జరుపుకోవాలని అన్నారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉత్సవాలను సంతోషంగా జరుపుకునేలా జిల్లా పోలీస్ శాఖ తరుపున బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. మండపాల వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని, షాట్ సర్క్యూట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు కమిటీ సభ్యుల వివరాలు, మండపాల బాధ్యుల ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ ఉదయ్ రెడ్డి, సీఐ ఉపేందర్, ఎస్ఐ లు ప్రేమనందం, రాజు సిబ్బంది పాల్గొన్నారు

అఖిలపక్ష నేతలు రాస్తారోకో

మల్కపేట రిజర్వాయర్‌కు నరసయ్య పేరు పెట్టాలని డిమాండ్

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్



సిరిసిల్లలో అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తున్న నేతలు


తెలంగాణ సాయుధ పోరాట యోధుడు నర్సయ్య కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ కు మాజీ ఎమ్మెల్యే కర్నాలు నరసయ్య పేరును ప్రకటించాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం సిరిసిల్లలో అఖిలపక్షల ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష పార్టీల ప్రజాసంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాల నాయకులు, పోరాటయోధుల చరిత్రను కాలగర్భంలో కలిపే కుట్ర జరుగుతుందన్నారు. సిరిసిల్ల నియోజకవర్గానికి అనగారిన వర్గాల నుండి ప్రాతినిధ్యం వహించిన ఏకైక ఎమ్మెల్యే కర్రోల్ల నర్సయ్య స్వగ్రామం కోనరావుపేట మండలం మల్కపేటలో నిర్మించిన రిజర్వాయర్‌కు ఆయన పేరు పెట్టాని అన్నారు. ఆయన స్మారకార్థం మల్కపేట రిజర్వాయర్ దగ్గర స్మృతి వనంతో పాటు జిల్లా కేంద్రంలో నర్సయ్య కాంస్య విగ్రహాలను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు,బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు అంకని భాను, ఎనగందుల వెంకన్న, జిల్లా ఇంచార్జీ మ్యాకల మునిందర్,అధ్యక్షులు వర్దవెళ్ళి స్వామిగౌడ్, సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సిపిఐ(యం)జిల్లా కార్యదర్శి మూషం రమేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి జవాజి విమల, ఎంఆర్పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆవునూరి ప్రభాకర్,జిల్లా అధ్యక్షులు కానపురం లక్ష్మణ్ బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్యాలమధు, సిపిఐ పట్టణ కార్యదర్శి పంతం రవి,ఎస్సీఎస్టీ సబ్ ప్లాన్ కమిటి జిల్లా అధ్యక్షుడు కంసాల మల్లేశం, సుద్దాల ఉపసర్పంచ్ ఎరవెళ్ళి నాగరాజు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి నవీన్, వివిధపార్టీల జిల్లా,స్థానిక,నాయకులు పాల్గొన్నారు

మాదకద్రవ్యాల అలవాట్లకు చెక్

'ఆపరేషన్ విముక్తి' పేరుతో వినూత్న ప్రయత్నం

ఇద్దరు స్పెషలిస్టులతో డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు

10 రోజుల్లో ప్రారంభించనున్న పోలీసు శాఖ



ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:

మాధకద్రవ్యాలకు అలవాటు పడిన వారికి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "ఆపరేషన్ విముక్తి" పేరుతో డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం రోజున ఒక ప్రకటనలో తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తు నాశనం చేసుకొంటున్న వారికి విముక్తి చేయాలనే ఒక మంచి ఉదేశ్యంతో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలో డి-అడిక్షన్ సెంటర్ ను ఏర్పాటు చేసి, నిపుణులైన సైక్రియాటిస్ట్ లతో మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మాధకద్రవ్యాలకు అలవాటు పడి మానివేయలేని స్థితిలో ఉన్న వారిని తల్లిదండ్రులు గుర్తించి తమ దగ్గరికి తీసుకువస్తే కౌన్సెలింగ్ నిర్వహించి, మాధకద్రవ్యాల నుండి విముక్తి కలిపిస్తామన్నారు. కౌన్సెలింగ్ కోసం తమ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్, లేదా పెరు నమోదు, ఇతర సమాచారం కోసం స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ రవికుమార్ ఫోన్ నెంబర్ 8712656410, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ ఫోన్ నెంబర్ 8712656411 లను సంప్రదించాలని ఈ సందర్భంగా ఎస్పీ కోరారు.

ఎండీ రామకృష్ణ చేసిన సేవలు మరువలేనివి

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్

సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘంలో రెండున్నరేళ్ల పాటు పనిచేసి విద్యుత్ సంస్థకు ఎనలేని సేవలు చేసిన ఎండీ రామకష్ణ సేవలు మరువలేనివని సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. బుధవారం రామకష్ణ కు బదిలీ వీడుకోలు సభను ఏర్పాటు చేసి ఆయనను పాలకవర్గ సభ్యులు ఉద్యోగులు ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా సెస్ చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ తప్పదనిన్నారు. కార్యక్రమంలో సెస్ ఎండీ సూర్యచంద్రారావు. సెస్ వైస్ చైర్మన్ తిరుపతి పాలకవర్గ సభ్యులు అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

కృతజ్ఞత సభకు పెద్ద ఎత్తున తరలిరావాలి

జడ్పిటి కో ఆప్షన్ సభ్యుడు చాంద్ పాష

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

ఈ నెల 15వ తేదిన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల ప్రారంభం సందర్భంగా కృతజ్ఞత సభకు తరలిరావాలని బుధవారం జడ్పీకో ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాష విజ్ఞప్తి చేశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు చేరువ చేయడంతో పాటు తెలంగాణ విద్యార్థులకు వైద్య, విద్య అందించేందుకు సిఎం కేసీఆర్, కేటీఆర్ జిల్లాకు ఒక మెడికల్ కాలేజి ప్రారంభించడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో యాదవ సంఘం ఉమ్మడి మండల అధ్యక్షుడు మెండే శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట




పిచ్చి మొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో బుధవారం పిచ్చి మొక్కలను, గడ్డిని తొలగించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రోగాం అధికారి వాసరవేణి పరశురాం మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థులకు శ్రమజీవనం, సేవాభావం, అలవడటంతోపాటు, సామాజిక సేవకులుగా రాణిస్తారన్నారు. కార్యక్రమంలో ఇంచార్జీ ప్రిన్సిపాల్ క్యాంతం సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి వాసరవేణి పరశురాం, అధ్యాపకులు 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు

సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట



డీఎస్పీ ఉదయ్‌రెడ్డి

ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కులాలను, మతాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని, ఎన్నికల నియమావళి పాటించాలని బుధవారం సిరిసిల్ల డిఎస్పి ఉదయ్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేటలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల అఖిలపక్ష రాజకీయ నాయకులతో ఎన్నికల అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐలు రమాకాంత్, మహేష్, నవత, అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం

నవతెలంగాణ-ముస్తాబాద్.



వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మండల కేంద్రంలో ప్రభుత్వం వెంటనే డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని మండల ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వ కాలేజీ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తాహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. మంత్రి కేటీఆర్ కూడా మాట ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కుర్ర రాకేష్, సాయి చరణ్, అభిలాష్, ఆదిత్య, భాను విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట డీజే యజమానుల బైండోవర్

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన 14 మంది డీజే నిర్వహకులను బుధవారం మండల తహసీల్దార్ రాంచంద్రం ముందు బైండోవర్ చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమాకాంత్ మాట్లాడుతూ డీజే నిర్వహకులు చట్టానికి అనుగుణంగా వ్యవహరించాలన్నారు.

ఈనెల17న సోనియా గాంధీ సభ

ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్

నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్



ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్

ఈ నెల 17న కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ సభను విజయవంతం చేయాలని ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్ అన్నారు సిరిసిల్లలోని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆది శ్రీనివాస్, నాయకులతో జిల్లా కాంగ్రెస్ కార్యక్రమంలో సమావేశం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు టీపీసీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

18ఏండ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్



మాట్లాడుతున్న కలెక్టర్ జయంతి అనురాగ్

జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన పౌరులు అందరూ తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారు .బుధవారం సాయంత్రం కలెక్టరేట్ నుండి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరేన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ లు ఎన్ ఖీమ్యా నాయక్, గౌతమ్ రెడ్డి, ఆర్డీఓ లు ఆనంద్ కుమార్, మధు సూదన్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస చారి, జిల్లా పంచాయితీ అధికారి రవీందర్, జిల్లా లేబర్ అధికారి రఫీ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీలలో ఎండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలో నీ రగుడు, పెద్దూర్ లలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీలను జిల్లా అదనపు కలెక్టర్ క్షేత స్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అయాజ్, తహశీల్దార్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

నవతెలంగాణ-ముస్తాబాద్.

నూతన బాధ్యతలు స్వీకరించిన ముస్తాబాద్ తహసీల్దార్ సన్మానించారు. గణేష్‌ను పోతుగల్ ప్యాక్స్ వైస్ చైర్మన్ మెరుగు రాజేశంగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ నాగుల శ్రీనివాస్‌గౌడ్, రామలక్ష్మణపల్లె సర్పంచ్ దమ్మ రవీందర్ రెడ్డి, డైరెక్టర్లు కట్ట బాపురావు,,సతీష్ , చందర్ రావు, గన్నే నర్సింల మాధవరావు, కుర్ర కీర్తన్, గన్నేఆనంద్, బైరి శ్రీనివాస్ గౌడ్ తదితరులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు

కల్లుగీత కార్మికుల మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-తంగళ్ళపల్లి

కల్లుగీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కల్లుగీత కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి అన్నారు.. ఈ సందర్భంగా గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్, సుద్దాల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఈనెల 22న హైదరాబాదులో జరిగే గౌడ కల్లుగీత కార్మికుల సదస్సుకు కార్యక్రమానికి గౌడ కులస్తులందరూ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధిలో రాణించాలి

నవతెలంగాణ-రుద్రంగి

రుద్రంగి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రియ మిల్క్ పార్లర్ ను జెడ్పీటీసీ గట్ల మీనయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని కోరారు. ప్రియపాలు, పాల పదార్థాల సెంటర్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ జలగం కిషన్ రావు, ప్రియా మిల్క్ డైరెక్టర్ రామ రామ్మోహన్ రావు, జీఎం జనగామ రాజేంద్ర రావు, డీఎండీ జాన్సన్, ఏఎస్ఎంజే బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ చేసిన ఎస్ఐ రాజేష్

నవతెలంగాణ -రుద్రంగి

రుద్రంగి మండల కేంద్రంలో బుధవారం ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన దారులు వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు తమ వెంట తెచ్చుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇన్సూరెన్స్, హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి గర్జనసభ కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాల ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

నవతెలంగాణ -సిరిసిల్ల రూరల్

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్ ఆధ్వర్యంలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి గర్జన సభ కరపత్రాలను ఆవిష్కరించారు. (అంగూరి రంజిత్ మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు అవలంబిస్తోన్న విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అక్టోబర్ 6న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం కార్మిక భవన్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికై విద్యార్థి గర్జన సభ నిర్వహించబోతున్నామని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకొచ్చి 9 ఏళ్ళు గడుస్తున్నప్పటికీ విద్యార్థులకు ఏ మేలు చేయలేదన్నారు. విద్యార్థి గర్జన సభను జిల్లా నలుమూలలనుండి పెద్ద ఎత్తున విద్యార్థి లోకం సిరిసిల్లకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎనుకొండ శ్రావణ్,మధు,గణేష్, శర్ధుల్,వినయ్,నవీన్ తదితరులు పాల్గొన్నారు


విద్యార్థుల ధర్నా

నవతెలంగాణ-ఇల్లంతకుంట:

రోడ్డు నిర్మాణం చేపట్టాలని విద్యార్థులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు జిల్లా కన్వీనర్ అక్కేం నాగరాజు హాజరై మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే ప్రధాన రోడు పూర్తిగా చెడిపోయి ఇబ్బందికరంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కూనబోయిన ప్రవీణ్, అవినాష్, కిరణ్, సాయి, సమీర్, దినేష్, విజయ్, రామ్ చరణ్, ప్రవీణ్, నాగరాజు, వినయ్, నవీన్, అరవింద్, రాకేష్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-ఇల్లంతకుంట:



మాట్లాడుతున్న ఎంపీపీ

ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీపీ రమణారెడ్డి అన్నారు. ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్య వంతులుగా ఉండాలని కోరారు . ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కూనబోయిన భాగ్యలక్ష్మి బాలరాజు , ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య , పుష్పలత , జంగంరెడ్డిపల్లి సర్పంచ్ శ్రీలత, నరెందర్ రెడ్డి, తాళ్ళపల్లి సర్పంచ్ ఎలుక పద్మ కనకయ్య , హెల్త్ సూపర్‌వైజర్ నయీం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్ల పదోన్నతులు ఆఫ్లైన్‌లోనే నిర్వహించాలి

నవతెలంగాణ -సిరిసిల్ల రూరల్

ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయ బదిలీలు ఆఫ్ లైన్ పద్ధతిలో నిర్వహించాలని టీపీటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దోర్నాల భూపాల్ రెడ్డి,దుమాల రమానాథ్ రెడ్డి లు డీఈవో రమేష్ కు వినతి పత్రం అందజేశారు. జిల్లా చిన్నది కాబట్టి ఆఫ్లైన్ ప్రక్రియలో బదిలీలు పదోన్నతులను పూర్తి చేయవచ్చని సూచించారు.

సకాలంలో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాదలాల్



రామగిరి: రికార్డులను పరిశీలిస్తున్న శ్యామ్ ప్రసాద్ లాల్

నవతెలంగాణ-మంథని/రామగిరి:
ప్రజా సమస్యలపై వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిశీలించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ అన్నారు. బుధవారం మంథని డివిజన్ పరిధిలోని కమాన్ పూర్, రామగిరి మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాలను అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ తనిఖీ చేశారు. కమాన్‌పూర్ మండల పరిధిలో పెండింగ్ ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. రామగిరి మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన పెండింగ్ ధరణి దరఖాస్తులు, ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 59, 76, ఓటరు జాబితా సవరణపై అధికారులతో సమీక్షించారు. అదనపు కలెక్టర్ వెంట కమాన్‌పూర్ తహసీల్దార్ మోహన్‌రెడ్డి, రామగిరి తహసీల్దార్ రామచందర్‌రావు పాల్గొన్నారు.

జాతీయ అవార్డు గ్రహీత శ్రీనివాస్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ సాయికుమార్, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ధర్మారం: బహుజన సాహిత్య అకాడమీ వారిచే సాహితీ రత్న జాతీయ అవార్డుకు ఎంపికైన కవి, గాయకులు శాయంపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాడి శ్రీనివాస్‌ను శాయంపేట సర్పంచ్ చెన్నెల్లి సాయికుమార్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. సర్పంచ్ సాయికుమార్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తూ సాహిత్య సామాజిక రంగంలో కృషి చేస్తున్నందుకు తమ ఊరి ప్రధానోపాధ్యాయుడికి జాతీయ అవార్డు రావడం గర్వకారణ మన్నారు. పాఠశాల ఉపాధ్యాయుడు కాట నరసయ్యగౌడ్ మాట్లాడుతూ శ్రీనివాస్ విద్యార్థుల అభివృద్ధికి గ్రామస్తులకు ఎలా సహాయం చేయాలని ఆలోచిస్తుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొడిగె నరసయ్య, వార్డుసభ్యులు పబ్బతి స్వామి, బొంగాని తిరుపతి, తల్లిదండ్రులు మిట్ట మల్లేష్ , చీకట్ల తిరుపతి, కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

నవ తెలంగాణ- పెద్దపల్లి
ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని డిగ్రీ, పీజీ, మెడికల్, సాంకేతిక విద్యా కళాశాలలోని ప్రిన్సిపాల్స్, క్యాంపస్ అంబాసిడర్లతో నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పాల్గొన్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ మన భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ ద్వారా మన పాలకులను ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎంపిక చేసుకుంటుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు మన రాజ్యాంగం కల్పించిందని కలెక్టర్ తెలిపారు. లింగ, వర్గ, కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్క పౌరునికి ఓటు హక్కు కల్పించిందన్నారు. రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం అక్టోబర్ 1 2023 నాటికి 18 సంవత్సరాలు నిండబోయే ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తుందని తెలిపారు. జిల్లాలోని డిగ్రీ, పీజీ, మెడికల్, సాంకేతిక కళాశాలలో చదివే ప్రతి 18 సంవత్సరాలు నిండిన విద్యార్థికి ఓటు హక్కు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఓటు హక్కు సరిగ్గా వినియోగించుకోవడంతో మంచి నాయకులను పరిపాలకులుగా ఎంపిక చేసుకోవచ్చని కలెక్టర్ అన్నారు. మనం ఒక్క ఓటుతో ఏమీ మారదు అనే నిర్లక్ష్య ధోరణి వీడాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ, పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి మధుమోహన్, స్వీప్ ఆక్టివిటీస్ జిల్లా నోడల్ అధికారి రౌఫ్ ఖాన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె లక్ష్మీనర్సయ్య, కళాశాలల ప్రిన్సిపల్స్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

- ఓటు ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం

2 ఇంక్లైన్ గని, 2ఏ సెక్షన్ ఇంక్లైన్ లో రెండు షిఫ్టులలో పనికి వచ్చే కార్మికులకు సాంస్కృతిక సారథి కళాకారులచే ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం 2 ఇంక్లైన్, 2ఏ సెక్షన్ ఇంక్లైన్ గనిలలో స్వీప్ ఆక్టివిటీస్ జిల్లా నోడల్ అధికారి రౌఫ్ ఖాన్ ఓటు ప్రాముఖ్యతను, ఓటర్ నమోదు, ఓటు హక్కు సద్వినియోగంపై సాంస్కృతిక సారథి కళాకారులచే కల్పించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులకు రాత పరీక్షలు



పరీక్షలు రాస్తున్న మహిళలు

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ: ఆర్జీ-2 ఏరియా యైటింక్లైన్ కాలనీలోని సింగరేణి హై స్కూల్‌లో 2022- 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన వృత్తి విద్య కోర్సులైన టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు బుధవారం రాత పరీక్షలు నిర్వహించారు. అఫీషియేటింగ్ డీజీఎం (పర్సనెల్) అధికార ప్రతినిధి ఎస్.అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎంలు వేణుగోపాల్, వంశీధర్, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, సింగరేణి సేవా సమితి కో-ఆడినేటర్ శివకుమార్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

నవతెలంగాణ-ముత్తారం: ఈ నెల 15న ముత్తారంలోని వెంకటలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేయనున్నట్లు టిఎస్ఎన్‌పిడిసిఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ ఎన్‌వి.గోపాలచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోకల్ కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్చడం, వోల్టేజీ హెచ్చు తగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, తదితర సమస్యలపై ఫిర్యాదులు అందించవచ్చని తెలిపారు.

రాజకీయ పార్టీ నేతలతో ఆర్డీవో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

నవతెలంగాణ-మంథని: నియోజకవర్గస్థాయి రాజకీయ పార్టీ నేతలతో బుధవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో హనుమాన్ నాయక్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంథని నియోజకవర్గంలోని 288 పోలింగ్ కేంద్రాలకు ఒక్కొక్క బూత్‌కు ఏజెంట్‌ను పార్టీ నుంచి నియమించుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో టీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఐ(ఎం) నాయకులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

విజయభేరీ సభను విజయవంతం చేయండి

నవతెలంగాణ-మంథని: మేనిఫెస్టో చైర్మన్ శ్రీధర్‌బాబు సారథ్యంలో టీపీసీసీ ఏర్పాటు చేసిన విజయభేరి సభను విజయవంతం చేయాలని పీసీసీ అధికార ప్రతినిధి సుధాకర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవులు కోరారు. ఈ నెల 17న సభ జరుగనుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఐలీ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్, ముత్తారం అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, రామగిరి మండల అధ్యక్షుడు తోట చంద్రయ్య, కమాన్‌పూర్ అధ్యక్షుడు వైనాల రాజు, తోకల మల్లేష్, బ్లాక్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేల్పుల రాజు, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కిషన్‌జీ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జికి ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న నాయకులు

నవతెలంగాణ-సుల్తానాబాద్:
పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి మోహన్ జోషి పెద్దపల్లి పర్యటన సందర్భంగా బుధవారం సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణరావు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి అసెంబ్లీ కోఆర్డినేటర్ మల్లేష్‌గౌడ్, సుల్తానాబాద్ మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్యగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్‌రావు, సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు సతీష్, సుల్తానాబాద్ టౌన్ అధ్యక్షుడు అబ్బయగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ సమత-కృష్ణ, రైతు మండల అధ్యక్షుడు రాములు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలు

సుల్తానాబాద్-నవతెలంగాణ: మండలంలోని మానసిక దివ్యాంగుల కేంద్రంలో ఆర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల రమేష్, బీసీ యువజన సంఘం మండల అధ్యక్షుడు చొప్పరి సంతోష్, బండి శ్రీకాంత్, అవినాష్, శీను, అరుణ్ పాల్గొన్నారు.

అలయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బస్టాండ్‌లో టీవీల ఏర్పాటు

నవతెలంగాణ-ధర్మారం: మండల కేంద్రంలోని బస్టాండులో అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొత్త మోహన్, జోన్ చైర్మన్ తాళ్లపల్లి సురేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం బస్టాండ్‌లోని రెండు టీవీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బస్టాండ్ కంట్రోలర్ రాజు, పీఆర్వో బైరీ చంద్రమౌళి, అలయన్స్ క్లబ్ సభ్యులు వేముల సుభాష్, దాసరి శ్రీనివాస్, కోల తిరుపతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-మంథని: ఏపీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ కుట్రపూరితంగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేసినందుకు మంథనిలో టీడీపీ నాయకులు ముఖానికి నల్ల గుడ్డలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. బాబును అరెస్టు చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజయ్య, మట్ట శంకర్, బడుగు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్టాపనకు అనుమతి తీసుకోవాలి: సీఐ

నవతెలంగాణ-మంథని: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేష్ విగ్రహ ప్రతిష్టాపనలకు నిర్వాహకులు పోలీస్ అనుమతి తీసుకోవాలని మంథని సీఐ జి.సతీష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల నిబంధనలు పాటించి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. పోలీసు అనుమతి కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులకు ఆయన సూచించారు.

అంగన్వాడీల సమ్మెను ఉధృతం చేస్తాం

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యంరావు



మాట్లాడుతున్న ముత్యంరావు

నవతెలంగాణ-మంథని:
అంగన్వాడీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మెను ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు తెలిపారు. అంగన్వాడీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని బుధవారం సమ్మె శిబిరం నుంచి ర్యాలీగా వెళ్లి మంథని అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి జి. జ్యోతి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్, అంగన్వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.
ఐటెం నెంబర్.06

రాబందుల చేతుల్లో మోసపోతున్న తెలంగాణ ప్రజానీకం

- పెద్దపల్లి పార్లమెంటరీ ఇన్‌చార్జి మనోహర్ జోషి



మాట్లాడుతున్న మనోహర్ జోషి

నవతెలంగాణ-గోదావరిఖని:
రాబందుల చేతుల్లో తెలంగాణ ప్రజానీకం మోసపోతుందని ఏఐసీసీ సీనియర్ నేత, పెద్దపల్లి పార్లమెంటరీ ఇన్‌ఛార్జి మనోహర్ జోషి అన్నారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల జీవితాలతో అధికార ప్రభుత్వం చెలగాటమాడుతూ ప్రజల హక్కులను కాలరాస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల బతుకులు మారాలంటే సామాన్య ప్రజానీకానికి అభివృద్ధి ఫలాలు అందాలంటే తప్పకుండా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని అన్నారు. దేశ రాజకీయ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఈనెల 17న జరగబోయే విజయ బేరి సభలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చే హామీలకు కట్టుబడి ఉంటుందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు, నాయకులు మహంకాళి స్వామి, ఎండి.ముస్తాఫా, గాదం విజయానంద్, పెండ్యాల మహేష్, గట్ల రమేష్, యుగంధర్, కవటం సతీష్‌తోపాటు తదితరులున్నారు.

గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు అవగాహన

నవతెలంగాణ-జూలపల్లి మండలంలో పోలీస్ స్టేషన్ ఆవరణంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నిర్వహణలో భాగంగా గణేష్ ఉత్సవాలను భక్తులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని హెడ్ కానిస్టేబుల్ రవీకుమార్ కోరారు. ఆయా గ్రామాల్లో గణేష్ ఉత్సవ కమిటీలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల భక్త మండలి సభ్యులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ఆయుష్మాన్‌భవ' ప్రారంభం



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-పెద్దపల్లి
భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా వర్చువల్ విధానంలో ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించినట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రిలో జరిగిన ఆయుష్మాన్ భవ వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు దాసరి మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నిక్షయ మిత్ర ఎర్రబాటి వెంకటేశ్వర్‌రావును ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమములో అవయవ దాన ప్రతిజ్ఞ చేయించారు. జిల్లాలోని జిల్లా ప్రధాన ఆసుపత్రి, ప్రాంతీయ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ వెల్ నెస్ సెంటర్ ల యందు వర్చువల్ విధానంలో భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తెలిపారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించి గ్రామ, వార్డు సభల ద్వారా ఆరోగ్య కార్యక్రమాలు సంపూర్ణ దశకు చేరుకున్న గ్రామాలకు, వార్డులకు సర్టిఫికేట్ ప్రదానం చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమములో డీసీహెచ్ఎస్ డాక్టర్ రమాకాంత్, మెడికల్ సూపరింటెండ్ డాక్టర్ శౌరయ్య, ప్రోగ్రామ్ అధికారి (యం.హెచ్. ఎన్) డాక్టర్ ఆర్. రాజమౌళి, ప్రోగ్రామ్ అధికారి (ఎన్‌టీఈపీ) డాక్టర్ సుధాకర్ రెడ్డి, ప్రోగ్రామ్ అధికారి (ఎన్‌సీడీ) డాక్టర్ పి.మధుకర్‌రెడ్డి, ఆస్పత్రి స్పెషలిస్టులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-ధర్మారం: మండలంలోని నంది మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, వైద్యాధికారులు ఆసుపత్రికి వచ్చిన రోగులతో కలిసి టీవీ ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. డాక్టర్ అనుదీప్, డాక్టర్ సుస్మిత, డాక్టర్ అమర్‌నాథ్, డాక్టర్ కేశవరెడ్డి, డాక్టర్ గౌతమ్ పాల్గొన్నారు
నవతెలంగాణ-గోదావరిఖని: అడ్డగుంటపల్లి యుపీఎస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మణికేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అడ్డగుంటపల్లిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా 42 వ డివిజన్ కార్పొరేటర్ బాల రాజ్ కుమార్, మరియు డీహెచ్ఎంఏ డాక్టర్ కపా బాయ్ పాల్గొని అవయవదానంపై ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు జి.స్వప్న, శారదా, కే.పద్మ, మల్లమ్మ, విజయ, పద్మ, ఆశా వర్కర్లు సరస్వతి, రాజేశ్వరి, సుజాత, మల్లేశ్వరి, రూప తదితరులున్నారు.

కార్పొరేట్ తరహాలో పనిచేస్తున్న సహకార బ్యాంకులు

- జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్



ముత్తారంలో సహకార బ్యాంకును ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ మధు

నవతెలంగాణ-ముత్తారం: ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీలాంటి కార్పొరేట్ బ్యాంకుల తరహాలో సహకార బ్యాంకులు పనిచేస్తున్నాయని పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. ముత్తారం మండలం కేంద్రంలో సహకార బ్యాంకు బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, ఎస్ఎఫ్ఎస్‌సీటీబీ అండ్ టీఎస్‌సీఏబీ చైర్మన్ కొండూరి రవీందర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు బ్యాంకును ప్రారంభించి అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతంలో అక్కడక్కడ కార్పొరేట్ బ్యాంకులను మాత్రమే చూసే వారమని, కానీ ఈనాడు ముత్తారం లాంటి ప్రాంతాల్లో కూడా కార్పొరేట్ స్థాయిలో నడిచే సహకార బ్యాంకును ప్రారంభించుకున్నామన్నారు. అనంతరం జాతీయ సహకార సంఘం అధ్యక్షుడు కొండూరి రవీందర్రావు మాట్లాడుతూ రైతులకు రుణాలు అందిస్తూ ఆర్థికంగా ఆదుకోవాలని ఉద్దేశంతోనే కేడీసీసీ బ్యాంకులను ఏర్పరచమన్నారు. ప్రస్తుతం 72 బ్యాంకులు పనిచేస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకార బ్యాంకులను బలోపేతం చేయడానికి అనేక చర్యలను చేపట్టామన్నారు. 400 కోట్ల నుండి 6000 కోట్ల వ్యాపారం చేసే స్థాయికి బ్యాంకులు చేరుకోవడం గొప్ప విశేషం అన్నారు. ఈ కార్యక్రమంలో కేడిసిసి బ్యాంకు ఉపాధ్యక్షులు పింగిలి రమేష్, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ ముత్తారం పీఏసీఎస్ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, బ్యాంక్ సీఈఓ సత్యనారాయణరావు, ఎంపీపీ జక్కుల ముత్తయ్య, జడ్పిటిసి చెలకల స్వర్ణలత అశోక్ కుమార్, మండల రైతు బంధు అధ్యక్షుడు అత్తె చంద్రమౌళి, మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి రాజలింగు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడు బీఆర్ అంబేద్కర్

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



అంబేద్కర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని: దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తున్నారని ఆయన చెప్పారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని బుధవారం అంతర్గాం సెంటర్‌లో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అంబేద్కర్ భావజాలానికి అనుగుణంగా ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పాలనను కొనసాగిస్తున్నారని అన్నారు. దళితుల కోసం ప్రత్యేక గురుకుల పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్య, షెడ్యూల్డ్ కులాలు, తెగలకు ప్రగతి నిధి, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ద్వారా రూ.20 లక్షల ఆర్థిక సాయం, ఎస్సీలకు నైపుణ్య శిక్షణ, ఎస్సీ పారిశ్రామికవేత్తలకు రాయితీలు, దళితులను పారి శ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో టీఎస్ ప్రైడ్, ఎస్సీలకు 101 యూనిట్ల వరకు ఉచిత్ విద్యుత్ వంటి ఎన్నో పథకాలు, కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అంతర్గాం మండల ఎంపీపీ దుర్గం విజయ, జడ్పీటీసి అముల నారాయణ, వైస్ ఎంపిపి మట్ట లక్ష్మి మహేందర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు గౌస్ పాషా, సర్పంచ్‌లు వెంకటమ్మ, నూకరాజు, ధర్మాజీ కష్ణ, దేవమ్మ రాములు, తుంగపిండి సతీష్, బాదరవేని స్వామి, దళిత సంఘాల నాయకులు ఉన్నారు.

దశలవారీగా ఆందోళనలు చేపడుతాం



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథ్

నవతెలంగాణ-గోదావరిఖని: ఐఎఫ్‌టీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సెప్టెంబర్ 5 నుంచి 20 వరకు దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడు తున్నామని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కే.విశ్వనాథ్ తెలిపారు. సింగరేణి ఆర్జీ-1 రైల్వే కార్మికులతో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.విశ్వనాథ్, రామగుండం రీజియన్ కార్యదర్శి ఈ.రాజేందర్ బుధవారం సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. సింగరేణిలో సుమారు 30వేల మంది కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈ ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. సమస్యలను వెంటనే పరిష్కరించని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపట్టేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు ఈ.రాజేందర్, ఐలయ్య, పి.వెంకన్న, రమేష్ ఉన్నారు.

మల్లికార్జున ఆలయంలో పూజలు



విరాళం అందజేస్తున్న చల్లా నారాయణ

నవతెలంగాణ-ముత్తారం: మండలంలోని పారుపల్లి, కేశన్ పల్లి గ్రామాల ప్రజల ఇలవేల్పు శ్రీ ఆదిమల్లికార్జున స్వామి పట్నాలు, బోనాల పండుగ బుధవారం ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్లా నారాయణరెడ్డి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అభివృద్ధికి 15,000/-రూపాయలు విరాళం అందజేసారు. ఈ కార్యక్రమంలో మంథని ముత్తారం మండల మాజీ జడ్పీటీసీ జగన్ మోహన్ రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ చైర్మన్ వినోద్ కుమార్ ఉన్నారు.

క్రీడల్లో నాంసానిపల్లి విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన నాంసానపల్లి విద్యార్థులు

నవతెలంగాణ ఓదెల: మండలంలోని కనగర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడల్లో నాంసానిపల్లి ప్రభుత్వ పాఠ శాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కన బరిచిన వారిలో అండర్-14 బాలికల కబడ్డీ విభా గంలో పెనుకుల కృష్ణప్రియ, ఖోఖో బాలికల విభాగంలో వీరనేని కాత్యాయని, కూనారపు హాసిని, బోగె అక్షర, సాహిత్య నేదురు రష్మికలు గండికోట స్వాతిక్, తేజ, సుల్తానాబాద్ జోన్‌కు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యా యుడు అమృత కిషోర్‌కుమార్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

రచ్చపల్లిలో 'కమ్యూనిటీ కాంటాక్ట్'

నవతెలంగాణ-మంథని: మండలంలోని రచ్చపల్లిలో బుధవారం పోలీస్ కమ్యూనిటీ కాంట్రాక్టు ప్రోగ్రాన్ని నిర్వహించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని టూ టౌన్ సీఐ అఫ్జాల్ ఉద్దీన్, మంథని ఎస్సై కిరణ్ తెలిపారు. షీ టీం యొక్క ప్రాముఖ్యతను, మహిళల రక్షణపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు కిరణ్ కుమార్, రాణి వర్మ, దివ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం: ఎమ్మెల్యే

నవతెలంగాణ-సుల్తానాబాద్‌రూరల్: ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. బుధవారం సుల్తానాబాద్ మండలంలో నరసయ్యపల్లి గ్రామంలో రూ.20లక్షలతో నిర్మాణం చేపడుతున్న గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ భవనాలకు సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పురం ప్రేమ్ చందర్‌రావు, సర్పంచ్ సుంకే లావణ్య, వెంకటేష్, గర్రెపల్లి సింగిల్ విండో చైర్మన్ సందీప్‌రావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'మన ఊరు-మన ఉష'



ర్యాలీ నిర్వహిస్తున్న దాసరి ఉష

నవ తెలంగాణ-సుల్తానాబాద్ రూరల్: మండలంలోని నారాయణపూర్ గ్రామంలో బీఎస్పీ ఆధ్వర్యంలో 38వ రోజు మన ఊరు-మన ఉష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష హాజరై గడపగడపకు ఏనుగు గుర్తును పరిచయం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల దోపిడీని ఎండగాడుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేష్‌పటేల్, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు నార్లగోపాల్ యాదవ్, అసెంబ్లీ కోశాధికారి ఎండీ రియాజ్, నియోజకవర్గ మహిళా కన్వీనర్ ఆముదల అరుణ, సుల్తానాబాద్ మండల కోశాధికారి చంద్రశేఖర్, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

బీఎస్పీలో పలువురి చేరిక

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్: బహుజన్ సమాజ్ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష సమక్షంలో పెద్దపల్లి అసెంబ్లీ కో కన్వీనర్ దేశబోయిన అఖిల, జూలపల్లి మండల అధ్యక్షుడు సిపల్లి కొమురయ్యల ఆధ్వర్యంలో చీమలపేట గ్రామానికి చెందిన కట్ల రాజేశం (కాంగ్రెస్ మాజీ ఉపసర్పంచ్, జిల్లా సేవాదళ్ ప్రధాన కార్యదర్శి), ఉత్తర్ల సంపత్ (కాంగ్రెస్ వార్డ్ మెంబర్), ఉత్తర్ల మల్లేశం (కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు), రాణవేణి వెంకటేశం (కాంగ్రెస్ సీనియర్ నాయకులు), యాదగిరి రామచంద్రం (బీఆర్ఎస్ సీనియర్ నాయకులు), యాదగిరి రాజేశం (బీఆర్ఎస్), తీగల శ్రీనివాస్ (కాంగ్రెస్), యాదగిరి రాము (బిజెపి), రానవేని రాజేశం (కాంగ్రెస్), మల్లారపు శ్రీనివాస్ (కాంగ్రెస్), కనకం మల్లేష్ (కాంగ్రెస్) తాటి రమేష్ (టిఆర్ఎస్), తోంటి వీరయ్య (కాంగ్రెస్), గుర్రం శ్రీనివాస్ (కాంగ్రెస్), లంక సుమన్ (కాంగ్రెస్) బుద్ధి పోశాలు (బీఆర్ఎస్), యాదగిరి తిరుపతి (బిఆర్ఎస్), మల్లారపు రవీందర్ (బీఆర్ఎస్), యాదగిరి ఓదెలు (బీఆర్ఎస్), యాదగిరి రవి (బీఆర్ఎస్) ముత్యాల పోచాలు (బిఆర్ఎస్)లకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

- మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుచనపల్లి రవి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల సమ్మయ్య ఆధ్వర్యంలో పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చేయకుండా మాయ మాటలు చెబుతూ మాదిగ, ఉప కులాలను మోసం చేస్తున్నాయని అన్నారు. అనంతరం పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా సంటి మల్లేష్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో గద్దల నర్సయ్య, అరికిల్ల ఓదెలు, అరకిల్ల రవి, తోకల ప్రశాంత్, నక్క సురేష్, బచ్చుల కొమురయ్య, విజయ్ పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-గోదావరిఖని: గోదావరిఖని పట్టణంలోని బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయంలో డాక్టర్. ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఎందుకు సీయం కావాలి అనే పోస్టర్‌ను బీఎస్పీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరికిల్ల రాయనర్సు మాట్లాడుతూ ఐపీఎస్‌గా ఉన్నత పదవిలో ఉన్న డాక్టర్ ఆంఎస్ ప్రవీణ్ కుమార్ ఎందుకు ఆరున్నర సంవత్సరాల ముందు రాజీనామా చేశారు, తదితర అంశాలపై కరపత్రాలు విడుదల చేసినట్లు తెలిపారు. బీఎస్పీ రామగుండం నియోజకవర్గ అధ్యక్షుడు కాసిపేట స్వామి, కార్మిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేగ నరేష్, రామగుండం కార్పొరేషన్ నాయకులు సిరికొండ సది, తోకల రమేష్, జనగామ మల్లేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న మమతారెడ్డి

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
పెద్దపల్లి పట్టణ అభివృద్ధిలో భాగంగా 8వ వార్డులో మున్సిపల్ సాధారణ నిధుల ద్వారా 13.4 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులను మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి-సన్నీ, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, ఏఈ సతీష్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, సానిటరీ జవాన్ జయరాజ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
గురువారం | సెప్టెంబర్ 14, 2023 | www.navatelangana.com

అక్టోబర్ 2వరకు ఆయుష్మాన్ భవ కార్యక్రమం

కరీంనగర్ కలెక్టర్ డాక్టర్ బి.గోపి

నవతెలంగాణ - కరీంనగర్ : సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లాలో ఆయుష్మాన్ భవ కార్యక్రమాలను నిర్వహించాలని కరీంనగర్ కలెక్టర్ డాక్టర్ బి.గోపి తెలిపారు. బుధవారం ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించగా, జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాన్ని కలెక్టర్ వీక్షించారు. దృశ్య మాధ్యమం ద్వారా రాష్ట్రపతి మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భవ కార్యక్రమం సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్స్, ఆరోగ్య కేంద్రాలు, వైద్య కళాశాలలో హెల్త్ మేళాలను నిర్వహిస్తారని, ఈ హెల్త్ మేళా పేద, మధ్య వర్గ ప్రజలకి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఇందులో భాగంగా స్వచ్ఛత అభియాన్ చేపట్టి పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలలో అవగాహన కల్పిస్తారని, దీని ద్వారా ప్రజల ఆరోగ్య స్థాయిని మెరుగుపరచడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆరోగ్య సేవలు పొందే విధంగా పాటుపడాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని, ఇతర ప్రజా ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కే.లలితాదేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణ ప్రసాద్, ప్రోగ్రాం అధికారులు, జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఇతర వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మొదలైయ్యింది.. మొదటి విడత ప్రచారం..

- పల్లెబాటతో పలకరింపులు
- సంక్షేమ జపంతో ఒకరు.. గడపగడపకు మరొకరు
- ఎన్నికల షెడ్యూల్‌కు ముందే పల్లెబాటలో నేతలు


గంగాధరలో ఎమ్మెల్యే సుంకె వాల్ పోస్టర్


గడప గడపకు వెళ్లి ఆశీర్వదించమని వేడుకుంటున్న మేడిపల్లి సత్యం


పల్లెబాట పట్టిన మాజీ ఎమ్మెల్యే శోభ

నవతెలంగాణ - గంగాధర

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే చొప్పదండి నియోజకవర్గంలో మొదటి విడత ప్రచారం మొదలైంది. టిక్కెట్టు ఖరారై ఒకరు, టికెట్టు ఖాయమనే ధీమాతో మరో ఇద్దరు పల్లెబాట పట్టారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన పాత కాపుల మధ్యే మళ్లీ పోటీ నెలకొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎవరికి తోచిన తీరును వారు అనుసరిస్తూ ప్రజల్లోకి చేరి పలకరింపులతో పల్లెలను చుట్టే పనిలో పడ్డారు. షెడ్యూల్ వెలువడితే అన్ని గ్రామాలను, గడపగడపకు తిరగలేమన్నా యోచనలో ఉన్న నేతలు ముందస్తుగానే పల్లెలకు చేరి ప్రజలకు తానున్నాననే సంకేతాలను ఇస్తున్నారు. నాడు ఓడించారు.. నేడు ఆశీర్వదించండంటూ గడపగడపకు ఓ నాయకుడు తిరుగుతుంటే, అక్కా.., అవ్వ.. బాగున్నారే అంటూ పల్లెబాట పట్టిన ఓ అక్క పలకరింపులతో ముందుకు సాగుతోంది. అధికారంలో ఉన్నా అనుకువగా ఉంటూ ప్రతి రోజు పల్లెలను చుడుతున్న 'మాస్టారు' సంక్షేమ జపంతో సాగుతున్న తీరు ఆసక్తిగా మారింది. అనుకోకుండా అవకాశం, అధికారం చేజిక్కిన ప్రస్తుత ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, గెలిచిన, ఓడిన మీ వెంటేనంటూ.. ముచ్చటగా మూడోసారి తన భవితవ్యాన్ని తేల్చుకోవడానికి సిద్ధపడిన టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం, ఓ టర్మ్ ఎమ్మెల్యేగా గెలిచి బీఆర్ఎస్ టిక్కెట్టు రాక బీజేపీలో చేరిన బొడిగె శోభ మరోసారి తన భవితవ్యాన్ని తేల్చుకోవడానికి ముందస్తు ప్రచారంతో ముందుకు సాగుతున్నారు. బీఆర్ఎస్ టికెట్టు ఖరారై ధీమాగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ యధావిధిగా అభివృద్ధి పనులు ప్రారంభిస్తూ, సంక్షేమ పథకాల చెక్కులను పంపిణీతో పల్లెల్లో తిరుగుతున్నారు. ఓటమి గెలుపు కోసమేననే ధీమాలో ఉన్న మేడిపల్లి సత్యం తనకు కాంగ్రెస్ టికెట్టు ఖరారు అవుతుందనే భరోసాతో గడపగడపకు తిరిగే పనిలో పడ్డారు. ఓ టర్మ్ ఎమ్మెల్యేగా కొనసాగి ప్రజల నాలుకలపై నానుతున్న మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ ప్రజలను పలకరిస్తూ మళ్లీ పల్లెబాట పట్టారు. బీజేపీ టికెట్టు తనకే ఖాయమనే ధీమాతో ముందుకు సాగుతున్న శోభ అక్కా, అవ్వ పిలుపులతో పల్లె జనాన్ని కలుస్తున్నారు.

మొదలైన వాల్ పోస్టర్లు..వాల్ రైటింగ్

అభివృద్ధి, సంక్షేమ జపంతో ముందుకు సాగుతున్న సుంకె ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ఓ అడుగు ముందుకేశారు. వాల్ పోస్టర్లు, వాల్ రైటింగ్‌ను ఏ పార్టీ చొప్పదండి నియోజకవర్గంలోని చేపట్టకపోగా, ప్రస్తుత ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పల్లెపల్లెలో వాల్ పోస్టర్లు, వాల్ రైటింగ్‌ను చేపట్టారు. గంగాధర మండలం బూర్గుపల్లి గ్రామంలోని తన ఇంటినే కార్యాలయంగా మలచుకున్న సుంకె నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రతి రోజు ఏదో ఓ సమావేశాన్ని, కార్యక్రమాన్ని చేపడుతూ అవిశ్రాంత పోరాటమే చేస్తున్నారు. మధురానగర్ చౌరస్తాను కూడలిగా మలచుకున్న మేడిపల్లి సత్యం చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని ఏదో ఒక మండలంలో ప్రతి రోజు పర్యటిస్తూ పల్లెబాటతో ప్రజలకు చేరువ అవుతున్నారు. ఇదే మధురానగర్ చౌరస్తాను నివాసంగా చేసుకున్న మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ సైతం పల్లెలను చుట్టె పనిలో పడ్డారు. మేడిపల్లి, బొడిగెలకు పార్టీ టికెట్టు ఖరారు కాకపోగా, టికెట్టు తమకేనన్న ధీమాతో ప్రచార పర్వానికి దిగడం ఆయా పార్టీ వర్గాలు, ప్రజల్లో టికెట్టు వీరికే వస్తుందోమోననే చర్చా కొనసాగుతోంది. పార్టీ పరంగా చేపట్టే కార్యక్రమాలతో బీఎస్పీ కాస్త ప్రజల్లో కనిపిస్తున్నా, వైఎస్సార్ సీపీ, టీడీపీ పార్టీల ఊసే లేకుండా పోయింది.

ఫిర్యాదుదారులకు సంతృప్తికర సేవలందించాలి

అడిషనల్ డీసీపీ (పరిపాలన) సి.రాజు


మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ (పరిపాలన) సి.రాజు

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం

పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా రిసెప్షన్ అధికారులు సేవలందించాలని కరీంనగర్ అడిషనల్ డీసీపీ (పరిపాలన) సి.రాజు అన్నారు. ఫిర్యాదుదారులకు కనీస మర్యాదనిచ్చి వారికి కేటాయించిన సీట్లలో కూర్చొబెట్టి సమస్యలను ఓపికగా తెలుసుకుని, సత్వరం పరిష్కారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధి పోలీస్ స్టేషన్లలోని రిసెప్షన్ కేంద్రాలలో పని చేస్తున్న పోలీసు అధికారులకు కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిసెప్షన్ కేంద్రాల్లో పని చేస్తున్న అధికారులు అన్ని వర్గాలకు చెందిన ప్రజల ఫిర్యాదులపై సత్వరం స్పందిస్తూ వేగవంతంగా వారి సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు వచ్చే ఫిర్యాదుల వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత సీసీటీఎన్ఎస్ పోలీస్ శాఖ అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేయాలని, సమస్య పరిష్కార అనంతరం కేటాయించబడిన సమయంలో క్లోజ్ చేయాలని సూచించారు. టెక్నాలజీ వినియోగాన్ని పెంపొందించుకునేందుకు ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. సమర్థవంతమైన సేవల ద్వారానే గుర్తింపు లభిస్తుందని, పోలీస్ స్టేషన్ వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, పోలీస్ శాఖ ప్రతిష్టను పెంపొందించేందుకు క్రమశిక్షణతో మెదలాలని కోరారు. కార్యక్రమంలో ఏసీపీ కాశయ్య, సంబంధిత పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

తపాలా సేవలను ప్రజలకు చేరవేయాలి

చొప్పదండి ఎంపీపీ చిలుక రవీందర్



నవతెలంగాణ - చొప్పదండి : తపాలా సేవలను మారుమూల ప్రాంత ప్రజలకు చేరవేయాలని ఎంపీపీ చిలుక రవీందర్ అన్నారు. చొప్పదండి మండల కేంద్రంలోని తపాలా కార్యాలయం ఆవరణలో బుధవారం డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా తపాలా అధికారి శివాజీ, ఎంపీపీ చిలుక రవీందర్ పాల్గొని మాట్లాడుతూ మండల ప్రజాప్రతినిధుల సహకారంతో డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన నిర్వహించాలన్నారు. పెన్షన్లు, ఉపాధి హామీ పథకం డబ్బుల పంపిణీ, జీవిత బీమా, చిన్న మొత్తాల పొదుపు వంటి సౌకర్యాలను గ్రామీణ ప్రాంత ప్రజలు పొందుతున్నారని తెలిపారు. 399రూపాయల అతి తక్కువ ప్రీమియంతో 10లక్షల ప్రమాద బీమా అందజేయడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ నార్త్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్, మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, ఐపిపిబి మేనేజర్ రేవతి, కౌన్సిలర్లు మాడురి శ్రీనివాస్, కొత్తూరి మహేష్, తాటికొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్గీకరణపై బీజేపీ ద్రోహం

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ

నవతెలంగాణ - కరీంనగర్ : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని 29 ఏండ్లుగా మాటలు చెబుతూ ఆచరణలో మోసం చేసిన బీజేపీ మాదిగలకు చిరకాల ద్రోహిగా మిగిలిపోతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు జరుగుతున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కనకం అంజిబాబు మాదిగ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష ప్రారంభమైంది. ఈ సందర్భంగా బెజ్జంకి అనిల్ మాదిగ మాట్లాడారు. వర్గీకరణ సాధన కోసం ఉద్యమం ఆగదని అన్నారు. కనకం అంజిబాబు, దండు అంజయ్య, గొర్రె రాజయ్య, కండే మహేందర్, చంటి అంజయ్య, కొత్తూరి రాజన్న, నెరేళ్ల సౌమ్య, కొమ్ముల రాజమల్లు, నక్క లక్ష్మణ్, పొత్తూరి రమేష్, బూత్కురి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదుపై అవగాహన

నవతెలంగాణ - చొప్పదండి : చొప్పదండి పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటర్ నమోదుపై ఏడిఎంసి మానస అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చొప్పదండి పట్టణంలో 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు పొందాలని సూచించారు. అవగాహన సదస్సు మూడు రోజులపాటు ఉంటుందని తెలిపారు. ఓటర్ నమోదుపై మెప్మా ఆర్పీలతో ప్రతిజ్ఞ చేయించారు.

ఎంపీడీవోకు సన్మానం

నవతెలంగాణ - శంకరపట్నం : శంకరపట్నం ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్.శ్రీవాణిని బుధవారం మండలంలోని గ్రామపంచాయతీ సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీడీవోగా మండలంలో గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు.

20 నుంచి వంట కార్మికుల సమ్మెబాట..


ధర్నా చేస్తున్న వంట కార్మికులు

నవతెలంగాణ - కరీంనగర్

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ మాట్లాడుతూ.. 20 సంవత్సరాలుగా పాఠశాలలో వంట కార్మికులుగా పని చేస్తూ, పిల్లలకు నాణ్యమైన భోజనం అందిస్తూ, వంట కార్మికులు మాత్రం పస్తులతో ఉండాల్సిన పరిస్థితులు ఉన్నవి అన్నారు. కేవలం రూ.1000 జీతంతో ఎలా పని చేస్తారో ఒకసారి ప్రభుత్వం ఆలోచించాలని, అనేక పోరాటాల ఫలితంగా 2022 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి సాక్షాత్తు అసెంబ్లీలోనే వేతనాలు పెంచుతున్నట్లు ప్రకటించినా అవి నేటికీ అందలేదన్నారు. కోడిగుడ్లు తదితర నిత్యావసర సరుకులు అన్ని ప్రభుత్వ సరఫరా చేస్తామని చెప్పి, అది కూడా అందించడం లేదన్నారు. విద్యాశాఖ మంత్రి జూన్ నుంచి పెంచిన వేతనాలు అందిస్తామని ప్రకటించినా అమలు కాలేదు అన్నారు. అందుకే నాలుగవ తేదీన ప్రభుత్వానికి సమ్మె నోటీసు అందించామని, ఈ నెల 19వ తేదీ వరకు పెంచిన వేతనాలు, పెండింగ్ వంట బిల్లులు, కోడిగుడ్ల బిల్లులు అన్ని అందించకపోతే, 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని తెలిపారు. ప్రభుత్వం పెంచిన వేతనాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ సాయిలు, పిట్ట దేవేంద్ర, కార్యదర్శి రజిత, పుష్పలత, రమేష్, లావణ్య రాణి లక్ష్మి హాలియా తదితరులు పాల్గొన్నారు.

17న కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభను విజయవంతం చేద్దాం

- ఐదు డిక్లరేషన్‌లను ప్రకటించనున్న సోనియా గాంధీ
- టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి రేగులపాటి రమ్యరావు

నవతెలంగాణ - కరీంనగర్ : తెలంగాణ విమోచన దినోత్సవ సందర్భంగా సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ విజయభేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని మాజీ టీపీసీసీ అధికార ప్రతినిధి రమ్యరావు కోరారు. బుధవారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. సభకు పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ, రాహుల్‌గాంధీతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు. తెలంగాణ ఏర్పాటులో అత్యంత కీలకపాత్ర పోషించిన సోనియాగాంధీ హైదరాబాద్ వేదికగా నిర్వహించే బహిరంగ సభలో తెలంగాణ ప్రజలకు సందేశం ఇవ్వనున్నట్టు చెప్పారు. పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే డిక్లరేషన్‌లను సోనియా ఈ సభలో ప్రకటించనున్నట్టు తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ బహిరంగ సభకు కాంగ్రెస్ అభిమానులు ,కార్యకర్తలు , నాయకులు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రానుందని ధీమా వ్యక్తం చేశారు. విజయభేరి సభకు భారీ జనసమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. తన వంతుగా 2500 మందని సభకు తరలిస్తున్నట్టు చెప్పారు. సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర ఫలాలను ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఐదుగురు మాత్రమే అనభవిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామిలను వాగ్దానాలు నిలబెట్టుకోలేకపోయిందని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు ఒక గూటివని అన్నారు.

దేశాయిపేటలో సామూహిక సీమంతాలు

నవతెలంగాణ - చొప్పదండి : చొప్పదండి మండలంలోని దేశాయిపేట గ్రామంలో బుధవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార ప్రాముఖ్యతను వివరిస్తూ, చంటి పిల్లలకు తల్లి పాలు ఆరు నెలల వరకే కాకుండా, రెండు సంవత్సరాల వరకు ఇవ్వాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. పిల్లలకు అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుంట రవి, ఉపసర్పంచ్ సింగిరెడ్డి వెంకట్రాంరెడ్డి, ఏసిడిపిఓ సౌందర్య, సూపర్వైజర్ రమాదేవి, చంటిబాబు, తిరుపతిరెడ్డి, అంగన్వాడీ టీచర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

పోషకాహారంతోనే తల్లి, బిడ్డల ఆరోగ్యం

నవతెలంగాణ-గంగాధర : బాలింతలు, గర్భిణులు విధిగా పోషకాహారం తీసుకోవడం ద్వారే తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో కస్తూరి సూచించారు. గంగాధర మండలం కొండాయపల్లి గ్రామంలో బుధవారం పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించగా, తల్లులకు పోష్టికాహారం అందించారు. సీడీపీవో కస్తూరి మాట్లాడుతూ తల్లి గర్భంలో ఉన్న శిశువుల ఎదుగుదలకు, ఆరోగ్య పరిరక్షణకు విధిగా పోషక విలువలు గల ఆహారం తీసుకోవాలన్నారు. సమతుల ఆహారం తీసుకోకపోవడం వల్ల రక్తహీనత గల పిల్లలను జన్మనిస్తున్నారని, ఈ విషయాన్ని తల్లులు గ్రహించాలని అన్నారు. సర్పంచ్ వెంకటమ్మ, ఎంపీటీసీ అట్ల రాజిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, హెచ్ఎం చంద్రశేఖర్, విద్యా కమిటీ చైర్‌పర్సన్ కావేరి పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుపై నిరసన

నవతెలంగాణ - హుజురాబాద్ : ఏపీ మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేశారని హుజురాబాద్ పట్టణంలో టీడీపీ నాయకులు గాంధీ విగ్రహం ముందు బుధవారం కండ్లకు నల్ల రిబ్బన్లు ధరించి వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయిత హరీశ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే. ఫయాజ్, వర్దిని లింగారావు, పట్టణ అధ్యక్షుడు రామగిరి అంకూస్, శివ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఆడెపు రవీందర్, ప్రతాప్ రాజు, ఇనుగాల గోవర్ధన్, మాడిశెట్టి అశోక్, కామణి రాజేశం, నరేష్, మొలుగూరి అనిల్, శడమాకి బిక్షపతి, ఆత్రం సదానందం, రూపురెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు



నవతెలంగాణ - హుజురాబాద్ : పట్టణంలోని యాదవ నగర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో యాదవ సంఘం మండల అధ్యక్షుడు బద్దుల రాజ్ కుమార్ యాదవ్, సింగరేణి సమ్మయ్య తొర్రి చిన్న సమ్మయ్య, తొర్రి సురేష్, భాషబోయిన రవి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్

నవతెలంగాణ - కరీంనగర్ : పీఆర్టీయూ టీఎస్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నలుమాచు చంద్రశేఖర్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగళి శ్రీపాల్ రెడ్డి, బీరెల్లి కమలాకర్ రావు, కరీంనగర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్కు తిరుపతి రెడ్డి, మర్రి జయపాల్ రెడ్డి తెలిపారు. ఆయన నియామాకం పట్ల పీఆర్టీయూ రాష్ట్ర జిల్లా బాధ్యులు, రాష్ట్ర, జిల్లా అవోపా (ఏవీఓపీఏ) సభ్యులు, శ్రేయోభిలాషులు, ఆర్యవైశ్య లెజెండ్స్ సభ్యులు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

మహిళా కోటాలో కరీంనగర్ అసెంబ్లీ టికెట్ కేటాయించాలి



నవతెలంగాణ - రామడుగు

మహిళా కోటాలో కరీంనగర్ అసెంబ్లీ టికెట్ కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు, గోపాలరావుపేట సర్పంచ్ కర్ర సత్యప్రసన్నవెంకటరాంరెడ్డి స్టేట్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావును కలిసి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మాణిక్ రావుఠాక్రేను కోరినట్లు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో పది సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీకి పనిచేస్తున్నానని, మహిళా కోటాలో కరీంనగర్ అసెంబ్లీ టికెట్ తనకే కేటాఇంచాలని కోరినట్లు ఆమె తెలిపారు.

ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - కరీంనగర్ : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య జన్మదిన సందర్భంగా స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలోని సుశ్రుత క్యాన్సర్ హాస్పిటల్ వద్ద రోగులకు బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం పటేల్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సందబోయిన ప్రసాద్ యాదవ్, మహిళా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గున్నాల కన్నాంబ, జిల్లా ఉపాధ్యక్షురాలు పాక శ్రీలత, జిల్లా కార్యదర్శి మండల కృష్ణవేణి, మహిళా నగర అధ్యక్షురాలు కురపాటి సింధు, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.


జమ్మికుంట : కేక్ కట్‌చేస్తున్న నాయకులు

నవతెలంగాణ - జమ్మికుంట : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో బుధవారం ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు గుణ సాగర్, సతీష్, రమేష్, పరమేష్, రాము, కిరణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - శంకరపట్నం : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలు శంకరపట్నం మండల కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ జక్కని సంజయ్ కుమార్, మండల అధ్యక్షుడు బొంగొని అభిలాష్ గౌడ్, బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొంగోని శ్రావణ్ కుమార్, రజక సంఘం మండల అధ్యక్షుడు తిరుపతి, పద్మశాలి సంఘం మండల ఉపాధ్యక్షుడు తుమ్మ రఘుపతి, గౌడ సంఘం అధ్యక్షుడు గుర్రం శ్రీనివాస్‌గౌడ్, వంశీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మె నిర్వీర్యానికి ప్రభుత్వ కుట్ర

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య


బతుకమ్మ ఆడి నిరసన తెలుపుతున్న కార్మికులు

నవతెలంగాణ - కరీంనగర్

అంగన్వాడీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ వారిని పర్మినెంట్ చేయకుండా సమ్మెను నిర్వీర్యం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య ఆరోపించారు. అంగన్వాడీ ఉద్యోగుల రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ.. అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం 3 రోజులుగా సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ యూనియన్ నాయకులతో చర్చలు జరపకుండా కేవలం అధికార పార్టీ కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి గతంలో ఇచ్చిన హామీలను మళ్లీ ఇప్పుడు అమలు చేస్తామని చర్చలు జరిగాయని తప్పుడు ప్రచారం చేస్తూ అంగన్వాడీ ఉద్యోగులను తప్పుదోవ పట్టిస్తున్నారని, మీ కుట్రలు సాగవని హెచ్చరించారు. ప్రభుత్వం తప్పుడు ఆలోచనలు మాని 60వేల మంది అంగన్వాడీ ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏఐటీయూసీ, సీఐటీయూ సంఘాలతో చర్చలు జరిపి అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేసి వారికి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు 10లక్షలు, హెల్పర్స్‌కు 5 లక్షలు చెల్లించాలని, వేతనంలో సగం పెన్షన్ నిర్ణయించాలని, 60 సంవత్సరాలు దాటిన అంగన్వాడీ ఉద్యోగుల వాలెంటరీ రిటైర్మెంట్ కోరితే బెనిఫిట్స్ కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ.5లక్షలు చెల్లించాలని, సమ్మె హామీలలో తెలియజేసిన ఇతర డిమాండ్స్ అన్నింటిని వెంటనే పరిష్కరించాలని సమ్మయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటకరెడ్డి బుచ్చన్న యాదవ్, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్ప్ అసోసియేషన్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రజిత, డి,రజిత, నాయకులు కె.అరుణ, అనురాధ, విజయ, రాజాదేవి భారతి, కరుణ, విజయ, శారద, పద్మ, శైలజ, కవిత, అంజలి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో జిల్లాకు పతకాలు


పతకాలతో జిల్లా క్రీడాకారులు

నవతెలంగాణ - కరీంనగర్

హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 11, 12వ తేదీల్లో జరిగిన 8వ తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్స్ జూడో చాంపియంషిప్ పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. పలు విభాగాల్లో పోటీపడిన జిల్లా క్రీడాకారులు మొత్తంగా 2 రజత పతకాలు, 5 కాంస్య పతకాలు సాధించారు. ఎస్.ప్రియాంక, ఏ.నందిత రజత, శ్రీనివాస్ షాహెజన్, హాసినిరెడ్డి, నిత్యారెడ్డి, ఇష్టారెడ్డి కాంస్య పతకాలను కైవసం చేసుకున్నట్లు తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం సభ్యుడు సిలువేరి మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించడం పట్ల తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు, మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, జిల్లా క్రీడా శాఖ అధికారి కీర్తి రాజవీరు, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు మహిపాల్, ఉపాధ్యక్షులు తుమ్మల రమేష్‌రెడ్డి, మహమ్మద్ కరీం, కోశాధికారి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, జిల్లా జూడో సంఘం బాధ్యులు ఎల్వీ రమణ, సత్యనారాయణ, సుధాకర్, శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు.

సెయింట్ జార్జ్ సీబీఎస్ఈ విద్యార్థులకు ఐఐటీ, నీట్‌పై అవగాహనా సదస్సు



నవతెలంగాణ - కొత్తపల్లి : కరీంనగర్‌లోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల (సీబీఎస్ఈ) విద్యార్థులకు ఐఐటీ, నీట్ కౌన్సిలర్ సుభానితో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్షలు, దీనికి తగినటువంటి ప్రిపరేషన్, టిప్స్, తగు సలహాలు ఇచ్చి, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. చైర్మన్ డాక్టర్ పి.ఫాతిమారెడ్డి మాట్లాడుతూ ఇప్పుడున్న ప్రపంచంలో సాఫ్ట్‌వేర్ రంగం, వైద్య వ్యవస్థలలో ముందుండడానికి ఐఐటీ, నీట్ చాలా అవసరమని, అందులో నిపుణులుగా ఉండాలని ఈ సదస్సు నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ భార్గవ్, నిరంజన్, అకాడమిక్ సీఈఓ ఉమాకాంత్ పాల్గొన్నారు.

మెడికల్ కోడింగ్ శిక్షణ



నవతెలంగాణ - కరీంనగర్

స్థానిక అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా మెడికల్ కోడింగ్ మీద శిక్షణ నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మెన్ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కరోనా తర్వాత వచ్చిన ఆరోగ్య సవాళ్లను దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య సంరక్షణ రంగాన్ని బలోపేతం చేయడానికి, లాభదాయకమైన కెరీర్ ఆప్షన్‌లలో మెడికల్ కోడింగ్ ప్రాధాన్యాతని వివరించారు. టాస్క్ రీజనల్ మేనేజర్ గంగాప్రసాద్ మాట్లాడుతూ.. మెడికల్ కోడింగ్‌లో ఉపాధి అవకాశాలను వివరించారు. కార్యక్రమాన్ని హైదరాబాద్‌కి చెందిన మెడిసిన్ హెల్త్ కేర్ ఇన్‌స్టిట్యూట్‌కి చెందిన మేనేజర్ మణికంఠ సాయిరామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ నిర్వాహకులు మణికంఠ సాయిరాం, ఆనంద్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, టీపీఓ, వైస్ ప్రిన్సిపాల్స్ విజయలక్ష్మి, చంద్రశేఖర్ రెడ్డి, డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓట్ల నమోదులో ప్రయాస



- దొంగ ఓట్ల నమోదులో 'అధికారం'
- సవరణకు సహకరించని అధికారులు
- యువకుల ఓట్ల నమోదులో నిర్లక్ష్యం
- చెత్త బుట్టలో ఫామ్-6 దరఖాస్తులు

నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు చాలా కీలకం. అలాంటి ఓటు హక్కును పొందేందుకు సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలగాను 18 ఏండ్లు నిండిన యువకులతోపాటు కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి, జాబితాలో తప్పులు, చేర్పులు, మార్పులు సవరణ చేసుకునేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి విశేష స్పందన వచ్చినప్పటికీ చాలా చోట్ల అధికారుల తీరు వల్ల కొత్తగా ఓట్లు నమోదు కావడం లేదు. అధికార పార్టీ నాయకులు ఇచ్చిన దరఖాస్తులను మాత్రమే నమోదు చేస్తున్నారు. ఇతరులు, సామాన్య ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను నిరాకరిస్తున్నారు. ఏదో ఒక సాకు చెప్పి వెనక్కి పంపిస్తున్నారు. వివాహం చేసుకున్న వారి ఓట్లు ఆయా నియోజకవర్గాల్లో నమోదు కావడం లేదు. కానీ అధికార పార్టీ నాయకులు సొంతంగా ఆన్‌లైన్ చేయించిన దరఖాస్తులకు మాత్రం ఎలాంటి విచారణా చేపట్టకుండానే ఆమోదం తెలుపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఓటు సవరణ పై అధికారుల నిర్లక్ష్యం

ఫారం 8 ద్వారా ఓటరు జాబితాలో సవరణ చేసుకోవాలి. పేర్లు, ఇంటి నెంబర్లు, ఫొటోలు, ఇతర వివరాలు మార్చుకునేందుకు అవకాశం ఉంది. అయితే, సవరణ కోసం చేసుకున్న దరఖాస్తులను అధికారులు పరిగణలోకి తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకే బిఎల్వోలు (పోలింగ్ బూత్‌స్థాయి అధికారులు) దరఖాస్తులు పరిశీలించకుండా.. సవరణ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా చనిపోయిన వారి ఓట్లు, వివాహం చేసుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించడం.. బదిలీ చేయడానికి ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దానికిగాను ఫామ్ నెంబర్ 7 ఇవ్వాలని సూచించింది. వాస్తవానికి ఆయా పోలింగ్ పరిధిలో విధులు నిర్వహించే బిఎల్‌ఓల వద్ద ఆ పోలింగ్ కేంద్రం పరిధిలోని చనిపోయిన వారి వివరాలు స్పష్టంగా ఉంటాయి. బిఎల్వోలు అంగన్వాడీ ఉద్యోగులు కావడం వల్ల మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేయడంలో అంగన్వాడీ టీచర్లే కీలకంగా వ్యవహరిస్తారు. కానీ ఓటర్ జాబితాలో చనిపోయిన వారి ఓటు తొలగించాలంటే కుటుంబ సభ్యుల ద్వారా ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని అధికారులు నిబంధన పెట్టడంతో ముందుకు పడటం లేదు. దీంతో ఓటర్ జాబితాలో చనిపోయిన వారి ఓట్లు అలాగే ఉంటున్నాయి.

ఫారం 6, 8 ను తీసుకోని అధికారులు

18 సంవత్సరాలు నిండిన యువకులు ఓటు హక్కును విధిగా నమోదు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ పిలుపునిచ్చింది. అదేవిధంగా ఆయా గ్రామాల్లోని వార్డుల్లో వలస వచ్చిన వారి ఓట్లను కూడా నమోదు చేసుకోవాలని సూచించింది. దీనికి ఫారం నెంబర్ 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. యువకుల ఓట్లకు తప్పనిసరిగా ఆధార్ కార్డుతోపాటు వయసు ధ్రువీకరించే సర్టిఫికెట్ జత చేయాలని పేర్కొన్నారు. 20 సంవత్సరాలు పైబడి ఉన్న వారి దరఖాస్తులకు ధ్రువీకరణ పత్రం లేకపోయినా సరిపోతుంది. కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకుంటే ఎన్నికల అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరపకుండానే రిజెక్ట్ చేస్తున్నారు. ఈనెల 2, 3 తేదీల్లో ప్రత్యేక క్యాంపుల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. ఈనెల 19వ తేదీ వరకు నూతన ఓటరు దరఖాస్తు చేసుకునే గడువు ఉన్నది. ప్రస్తుతం బిఎల్‌ఓలు (అంగన్వాడీలు) సమ్మెలో ఉండటం వల్ల దరఖాస్తులు స్వీకరించడం లేదు. ఎన్నికల అధికారులు కూడా కొత్త దరఖాస్తులు తీసుకోవడం లేదు. పలుకుబడిగల వారు ఒత్తిడి చేస్తే దరఖాస్తు తీసుకుంటున్నారు తప్ప వాటిని ఆన్‌లైన్ చేయడం లేదు. 20 సంవత్సరాలు పైబడిన వారు ఓటు కోసం ఫామ్ నెంబరు 8 ద్వారా దరఖాస్తు చేసినప్పటికీ పరిగణలోకి తీసుకోవడం లేదు. గతంలో ఎక్కడ ఉన్నారో అక్కడి ఎన్నికల అధికారి నుంచి అక్కడ ఓటు తొలగిస్తున్నట్టు ధృవీకరణ పత్రం తీసుకొస్తే తప్ప ఇక్కడ నమోదు చేసుకో బోమని తేల్చి చెప్తున్నారు. చాలామంది వీటిని భరించలేక దరఖాస్తు చేయ డమే మానేస్తు న్నారని సమాచారం.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు

	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మిర్యాలగూడ	1,08,047	110629	20	2,18,696
సాగర్	1,10,571	112839	21	2,23,43
దేవరకొండ	1,17,363	116037	5	2,31,215
నల్గొండ	1,12,994	117097	53	230144
నకిరేకల్	1,18,990	118819	04	237813
భువనగిరి	1,03,741	103092	0	206833
ఆలేరు.	111,336	109294	08	220638
హుజుర్నగర్	1,16,598	120720	07	237325
కోదాడ.	1,13,333	117062	11	230406
సూర్యాపేట	1,11,667	114910	04	226571
తుంగతుర్తి	1,21,058	119039	07	240104

ఆధార్ లింకు మరిచిన అధికారులు

దొంగ ఓట్లను తొలగించాలని ఎన్నికల కమిషన్ ఓటుకు ఆధార్ లింకు చేయాలని నిబంధన పెట్టింది. బిఎల్వోలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల ఆధార్ నెంబర్‌ను సేకరించి లింకు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 90 శాతం ఓట్లను ఆధార్ లింక్ చేసినట్టు సమాచారం. మిర్యాలగూడ నియోజవర్గంలో 95శాతం ఓటుకు ఆధార్ లింక్ చేశారు. మిగిలిన శాతం పూర్తి చేసి 100శాతం లక్ష్యం సాధించాలని ఉన్నత అధికారులు పదేపదే సూచిస్తున్నప్పటికీ కింది స్థాయి అధికారులు అమలు చేయడం లేదు. ఆధార్ లింకు లేనివి.. మిగిలిన ఓట్లు అన్ని దొంగ ఓట్లుగా ఉన్నాయని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి.

అందుకే ఆధార్ లింక్ చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ శివారు ప్రాంతాల్లో గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు పెద్ద ఎత్తున దొంగ ఓట్లు నమోదు చేయించారని ఆరోపణలు ఉన్నాయి. ఆ ఓట్లకే ఇప్పుడు ఆధార్ లింక్ చేయడం లేదని ప్రతిపక్ష పార్టీలు బలంగా విమర్శిస్తున్నాయి. అంతేకాకుండా అధికార పార్టీ క్యాంపు కార్యాలయంలో అధికారుల సహకారంతో దొంగ ఓట్లను నమోదు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 27, 46,402 మంది ఓటర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 27 లక్షల 46,402 మంది ఓటర్లు ప్రస్తుతం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈనెల 19వ తేదీ వరకు ఓటుకు నమోదుకు గడువు ఉండటం వల్ల కొత్త ఓటర్ల సంఖ్య స్వల్పంగా పెరగనుంది. ఈ సంవత్సరం జనవరి నుంచి ఇప్పటివరకు 58,584 కొత్త ఓట్లు నమోదయ్యాయి. గతంలో పురుషులు 13 లక్షల 38,169 మంది ఉండగా ప్రస్తుతం 13 లక్షల 67,735 మందికి పెరిగారు. మహిళలు గతంలో 13 లక్షల 49,568 మంది ఉండగా 13 లక్షల 78,452 మందికి పెరిగారు. థర్డ్ జెండర్ గతంలో 81 ఉండగా 155కు పెరిగారు.

మిర్యాలగూడలో 16,012 దరఖాస్తులు

మిర్యాలగూడ నియోజవర్గంలో జులై నుంచి ఇప్పటివరకు 16,012 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నూతన ఓట్లు నమోదు చనిపోయిన వారి ఓట్ల తొలగింపు, ఓట్ల సవరణ దరఖాస్తులున్నాయి. 3,550 దరఖాస్తులు ఆఫ్‌లైన్ ద్వారా, 12,455 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా వచ్చాయి. ఇందులో 6851 దరఖాస్తులను అప్రూవల్ చేశారు. మిగిలిన దరఖాస్తులను ప్రస్తుతం విచారిస్తున్నారు. దరఖాస్తుల నమోదుకు ఈనెల 19 వరకు గడువు ఉంది. అక్టోబర్ 4న తుది ఓటర్ జాబితా విడుదల కానుంది.

పారదర్శకంగా నిర్వహిస్తున్నాం
ఆర్డీఓ చెన్నయ్య

ఓటు నమోదు, సవరణ, తొలగింపు పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. వచ్చిన దరఖాస్తులను వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన జరుపుతున్నాం. కొత్త ఓట్లు వెంటనే ఆన్‌లైన్ చేసి అప్రూవల్ చేస్తున్నాం. ఓట్ల సవరణ కూడా వెంటనే చేపడుతున్నాం.

చనిపోయిన వారి, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను పరిశీలించి తొలగిస్తున్నాం. ఈనెల 19 వరకు కొత్త ఓట్ల కోసం నమోదు చేసుకోవచ్చు. అక్టోబర్ 4న తుది ఓట జాబితా విడుదల చేస్తాం.

సోనియా సభకు అడ్డంకులు

- ప్రధాని మోడీ, సీఎం కేసీఆర్‌పై రేవంత్ ధ్వజం
- కేయూలో విద్యార్థుల దీక్షకు సంఘీభావం



నవ తెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

సోనియా సభకు ప్రధాని మోడీ, సీఎం కేసీఆర్ అడ్డంకులు సృష్టిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షులు ఎ. రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం వరంగల్ జిల్లాలో పర్యటించిన రేవంత్‌రెడ్డి.. తొలుత కాకతీయ విశ్వవిద్యాలయం క్రాస్‌రోడ్డులో దీక్ష చేస్తున్న విద్యార్థులను పరామర్శించి వారి పోరాటానికి సంఘీభావం తెలిపారు. వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీఎచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవలను ప్రశ్నించిన విద్యార్థులకు వైస్ చాన్స్‌లర్ సమగ్రంగా స్పందించి ఉంటే ఈ రోజు ఈ నిరసన ఉండేది కదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ విద్యార్థుల పోరాటాన్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. యూనివర్సిటీ విద్యార్థుల తెలంగాణ ఉద్యమంలో చేసిన త్యాగాల ఫలితంగానే ఈ రోజు మీకు పదవులు వచ్చిన సంగతి గుర్తించాలని హెచ్చరించారు. విద్యార్థులకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం హన్మకొండ విష్ణుప్రియ గార్డెన్‌లో హన్మకొండ డీసీసీ అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 17వ తేదీన హైదరాబాద్ తుక్కుగూడలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగసభకు లక్షలాది మంది కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాగా, ఈనెల 17న వరంగల్‌లో బీజేపీ సభ నిర్వహిస్తామని, ఇందులో హెూంమంత్రి అమిత్‌షా పాల్గొంటారని ప్రకటించిన మంత్రి కిషన్‌రెడ్డి.. అదేరోజు సోనియాగాంధీ హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిసి సభను వరంగల్ నుంచి హైదరాబాద్‌కు మార్చుకున్నారని ఆరోపించారు. సోనియా సభకు పరేడ్ గ్రౌండ్‌తోపాటు ఏ మైదానం దొరకకుండా చేశారన్నారు. చివరకు తుక్కుగూడలోని రైతులే స్వచ్ఛందంగా బహిరంగసభ నిర్వహించడానికి భూములను ఇచ్చారన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియా మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్.. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. రెండు కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామని కేంద్రంలో బీజేపీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించి.. తీవ్రస్థాయిలో నిరుద్యోగం పెంచిందని ఆరోపించారు. తెలంగాణలో అభివృద్ధి అంతా కేసీఆర్ కుటుంబానికే పరిమితమైందన్నారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో పేద ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. ఆంధ్రా చిన్నజీయర్ స్వామి కాళ్ల వద్ద తెలంగాణ ఆత్మగౌరవాన్ని సీఎం కేసీఆర్ తాకట్టుపెట్టారన్నారు. త్వరలోనే కేవీపీ, కేసీఆర్ కలిసి చర్చలు జరిపిన ఫోటోలను బహిర్గతం చేస్తానని తెలిపారు. తెలంగాణపై చిత్తశుద్ధి ఉంటే అమరవీరుల స్తూపం వద్ద చర్చకు సిద్ధమా అని సీఎంకు రేవంత్ సవాల్ విసిరారు.

మోదీతో అంటకాగుతున్న కేసీఆర్

తొలి ఉద్యమంలో 369 మంది, మలి ఉద్యమంలో 1200 మంది తెలంగాణ ఉద్యమంలో ఆత్మబలిదానాలు చేసుకోవడాన్ని గుర్తించి సోనియాగాంధీ తెలంగాణ ఇస్తే, ఆమెను సాదరంగా ఆహ్వానించాల్సిన సీఎం కేసీఆర్ ప్రధాని మోదీతో అంటకాగుతున్నారని ఆరోపించారు. సోనియా సభకు కుట్రతో, కుతంత్రాలతో అడ్డంకులు కల్పిస్తున్నారన్నారు. వీరి కుట్రలను భగ్నం చేసి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఘనవిజయం చేకూర్చాలని పిలుపునిచ్చారు.

ఈ సభలో ఏఐసీసీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రదీప్ ఉత్తమ్ రావు దాళ్వి, టీపీసీసీ పరిశీలకులు మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, శోభ, మాజీ మంత్రులు పోరిక బలరాంనాయక్, కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు వేం నరేందర్‌రెడ్డి, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, గండ్ర సత్యనారాయణరావు, దొమ్మటి సాంబయ్య, డీసీసీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా ఆస్పత్రిని పునర్ నిర్మించాలి

- డాక్టర్ల డిమాండ్లను నెరవేర్చాలి : మహాధర్నాలో ప్రభుత్వ వైద్యుల సంఘం నేతలు
- త్వరలో వైద్యగర్జన నిర్వహిస్తామని హెచ్చరిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిని పునర్ నిర్మించాలని ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన మహాధర్నాలో సంఘం నాయకులు డాక్టర్ పల్లం ప్రవీణ్, డాక్టర్ బొంగు రమేశ్, డాక్టర్ లాలు ప్రసాద్ రాథోడ్ తదితరులు మాట్లాడారు. ఉస్మానియా ఆస్పత్రిని ట్విన్ టవర్స్‌గా నిర్మిస్తామని సీఎం కేసీఆర్ గతంలో మాటిచ్చారని గుర్తుచేశారు. అయితే కోర్టు కేసులున్నాయనే సాకుతో కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయాన్ని నిర్మించి, నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల పనుల్ని ప్రారంభించిన ప్రభుత్వానికి ఉస్మానియా నిర్మాణం ఎందుకు సాధ్యం కాదని వారు ప్రశ్నించారు. గతంలో ఎంఐఎం పార్టీ అడ్డుపడుతుందనీ సాకులు చెప్పారనీ, అయితే ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ స్వయంగా ఉస్మానియా ఆస్పత్రిని సందర్శించి పునర్ నిర్మాణానికి అభ్యంతరం లేదని ప్రకటించిన విషయాన్ని నాయకులు గుర్తుచేశారు. డీఎంఈ పరిధిలో పని చేసే వైద్యులకు పీఆర్సీ ఎరియర్స్ బకాయిలు విడుదల చేయాలనీ, జీవో నెంబర్ 142 రద్దు చేస్తూ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పోస్టులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో చేసినట్టుగా టీవీవీపీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు అభ్యంతరమేంటని ప్రశ్నించారు. డిమాండ్లను నెరవేర్చకుంటే అన్ని రాజకీయ పార్టీలతో కలిసి త్వరలో వైద్యగర్జన నిర్వహిస్తామనీ, ఉధృత సమ్మెకూ వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరహరి తదితరులు పాల్గొన్నారు.

ఛలో డీహెచ్ కార్యాలయం

మరోవైపు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం హలో డాక్టర్ ...ఛలో డీహెచ్ పేరుతో బుధవారం మధ్యాహ్నం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. కోఠిలోని డీహెచ్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ లాలు ప్రసాద్ రాథోడ్, డాక్టర్ బొంగు రమేశ్, డాక్టర్ పల్లం ప్రవీణ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. జీవో నెంబర్ 142ను రద్దు చేయాలని కోరారు. ఆ జీవో ద్వారా ఏడీపీహెచ్‌ఓలకు దొడ్డి దారినకేటాయించిన 10 జిల్లాల వైద్యారోగ్యశాఖ అధికారి పోస్టుల ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారికి జనరల్ లైన్ సీనియార్టీ ప్రకారం జిల్లాల్లో ప్రోగ్రాం ఆఫీసర్లుగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఎమర్జెన్సీ అలవెన్స్‌ను రూ.20 వేలకు పెంచాలనీ, ప్రోటోకాల్, ఇతర అలవెన్సుల జీవోలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మూడు షిప్టులకు అనుగుణంగా వైద్యుల సంఖ్యను పెంచాలనీ, వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ గడల శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని సమర్పించారు.

పటాన్‌చెరు బీఆర్ఎస్ టికెట్ ముదిరాజ్ లకివ్వాలి

- లేకపోతే పార్టీకి దూరమవుతాం : ఉమ్మడి మెదక్ జిల్లా ముదిరాజ్‌లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పటాన్‌చెరు శాసనసభా నియోజకవర్గం టికెట్‌ను ముదిరాజ్‌లకు కేటాయించాలనీ, లేకపోతే బీఆర్ఎస్ పార్టీకి దూరమవుతామని ఉమ్మడి మెదక్ జిల్లా ముదిరాజ్‌లు హెచ్చరించారు. ఈ మేరకు పటాన్‌చెరు బీఆర్ఎస్ టికెట్‌పై పునరాలోచించాలని కోరుతూ ఉమ్మడి మెదక్ జిల్లా ముదిరాజులు బుధవారం శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాశ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో ఆరు లక్షల జనాభా కలిగిన ముదిరాజ్‌లకు ఒక్క సీటు ఇవ్వకపోవడం పట్ల వారు ఆవేదన వ్యక్తంచేశారు. బీసీలు, ముదిరాజ్‌లు అత్యధికంగా ఉన్న పటాన్ చెరు ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్‌ను నీలం మధు ముదిరాజ్‌కు కేటాయించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంగారెడ్డి జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ సుంకరబోయిన మహేష్, జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు నారబోయిన శ్రీనివాస్, నల్లవల్లి సురేష్, పోతారం రాములు, వావిలాల రమేష్, మంగంపెట్ గణేష్, ఉట్ల బోగురు బిక్షపతి, నల్లవాల్లి రాగుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సాయుధ పోరాటానికి

కమ్యూనిస్టులే నిజమైన వారసులు

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరి విముక్తి కోసం.. నాడు సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే నిజమైన వారసులని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య స్పష్టంచేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా వరంగల్ జిల్లా రంగశాయిపేట ఆ పార్టీ స్థానిక కమిటీ ఆధ్వర్యంలో ఏరియా కమిటీ కార్యదర్శి మాలోతు సాగర్ అధ్యక్షతన ఆర్టీఏ జంక్షన్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా పాల్గొన్న నాగయ్య మాట్లాడుతూ.. ఆనాడు.. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టులు.. బ్రిటీషర్లు, నిజాం, దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చేశారని, దాని ఫలితంగానే హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయ్యిందని తెలిపారు. కులమతాలతో సంబంధం లేకుండా భూమి కోసం, విముక్తి కోసం జరిగిన చారిత్రక పోరాట చరిత్రను కూడా ముస్లిం రాజుపై హిందువులు చేసిన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం బీజేపీ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.అనంతరం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య మాట్లాడుతూ.. బీజేపీ దాని అనుబంధ సంఘాలు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి, విభజన రాజకీయాలు చేస్తున్నారన్నారు.

ఢిల్లీలో జరుగుతున్న జీ 20 అంతర్జాతీయ సదస్సులో 'విద్వేషాలు వద్దు' అనే తీర్మానాన్ని ప్రధాని మోడీ ప్రవేశపెట్టి, ఆమోదించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ధర్మారపు సాంబమూర్తి, ఏరియా కమిటీ సభ్యులు గణేపాక ఓదెలు, మాలోతు ప్రత్యూష, మన్నూరు జ్యోతి, రత్నం, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షకార్యదర్శులు అనీల్, దుర్గయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చుక్క ప్రశాంత్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రామ సందీప్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కూన రాధిక, కేవీపీఎస్ ఏరియా కార్యదర్శి ఉసిల్ల కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ గజ్జ చందు, శాఖ కార్యదర్శులు, పార్టీ నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలి

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి : ఢిల్లీ జేఎఫ్ఎంఈ ధర్నాలో నేతల డిమాండ్




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పేదలకు విద్యను దూరం చేయడంతోపాటు దేశ సమగ్రతకు నష్టాన్ని చేకూర్చే జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)ని వెంటనే రద్దు చేయాలని పలువురు రాజకీయ నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సామాజిక భద్రతకు సంబంధించిన పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జాయింట్ ఫోరమ్ ఫర్ మూవ్‌మెంట్ ఆన్ ఎడ్యుకేషన్ (జేఎఫ్ఎంఈ) ఆధ్వర్యంలో ధర్నాను నిర్వహించారు. దేశం నలుమూలల నుంచి విశ్వవిద్యాలయాలు, కాలేజీల నుంచి అధ్యాపకులు, పాఠశాలల ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు నీలోత్పల్‌బసు, సీఐటీయూ కార్యదర్శి తైవాన్ సైన్ హాజరై మద్దతు ప్రకటించారు. విద్యను వ్యాపారమయం చేసి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ఎన్ఈపీ వల్ల తీవ్ర నష్టమని వారు విమర్శించారు. దేశ సమైక్యతకు భంగం కలిగిస్తూ లౌకిక విలువలను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తున్నదని అన్నారు. విద్యార్థుల మెదళ్లలో మత భావనలను నింపడానికే అది ఉపయోగపడుతుందన్నారు. ఎన్ఈపీని రద్దు చేసే వరకు పోరాడతామని అధ్యాపక, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ముక్తకంఠంతో చెప్పారు. ఉద్యోగుల హక్కుగా ఉన్న పాత పెన్షన్‌ని బిక్షగా మార్చి చందాతో కూడిన జాతీయ పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చి, ఉద్యోగుల సామాజిక భద్రతను ఆందోళనకరంగా మార్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాల్సిందేనని డిమాండ్ చేశారు. సీపీఎస్‌కు ప్రత్యామ్నాయం జీపీఎస్ అంటూ మసిపూసి మారేడు కాయ చేసినా అంగీకారం కాదన్నారు. పాత పెన్షన్ పునరుద్ధరణ మినహా ప్రత్యామ్నాయం ఏదీ లేదని స్పష్టం చేశారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రకరకాల పేరు పెట్టినా, పాత పెన్షన్ విధానానికి సాటి రావనీ, వెంటనే ఆ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గత ఆరేండ్లుగా ఈ ప్రభుత్వాలు పర్మినెంట్ ఉద్యోగాలను భర్తీ చేయలేదని చెప్పారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ మొత్తాన్ని వెంటనే పర్మినెంట్ చేయాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఉమ్మడి పరీక్షల విధానం పేరుతో రాష్ట్రాల హక్కులను హరిస్తున్నటువంటి కేంద్ర ప్రభుత్వం వైఖరిని తప్పుపట్టారు.

రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్న రాజ్యాంగబద్ధ స్వేచ్ఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. నీట్ లాంటి పరీక్షలు రద్దు చేయాలన్నారు. విద్యను, విశ్వవిద్యాలయాలను ప్రయివేటీకరణ నుంచి రక్షించాలని కోరారు. పాఠశాల నుంచి కళాశాల వరకు విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సీఎన్ భారతి, ఉపాధ్యక్షులు చావ రవి, మహావీర్‌తోపాటు జేఎఫ్ఎంఈ భాగస్వామ్య సంఘాల జాతీయ నాయకులు ఇంద్రశేఖర్, అజిత్ నారాయణ మిశ్రా, అరుణకుమార్, మహంతి మిశ్రా, గుప్త, ఎంబీ సత్యం, కె నరసింహారెడ్డి తదితరులతోపాటు తెలంగాణ నుంచి టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, నాయకులు అరుణకుమారి, నక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గణేశ్ నవరాత్రులకు భారీ బందోబస్తు

- హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీసుల అప్రమత్తం
- జీహెచ్ఎంసీ, రెవెన్యూ, విద్యుత్, జలమండలి అధికారులతో సమావేశాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

గణేశ్ నవరాత్రుల నేపథ్యంలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈనెల 18 నుంచి నవరాత్రులు ప్రారంభం కానుండటంతో అందుకు కావాల్సిన ఏర్పాట్లు, భద్రతతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ అధికారులు దృష్టి సారించారు. గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించినప్పటి నుంచి నగరంలో సందడి వాతావరణం ఏర్పడనుంది. మూడు కమిషనరేట్ల పరిధిలో దాదాపు 60వేలకుపైగా విగ్రహాలను ప్రతిష్ఠించే అవకాశముందని అధికారుల అంచనా. గణేశ్ పండుగ ప్రారంభం నుంచి నిమజ్జనం ప్రక్రియ పూర్తయ్యేవరకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పండుగను పూర్తి చేసేవిధంగా చర్యలు చేపడుతున్నారు. మూడు కమిషనరేట్ల పరిధిల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పాత నేరస్థులు, రౌడీ షీటర్ల కదలికలపై ఆరా తీస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ఎప్పటికప్పుడూ సమాచారం సేకరిస్తున్నారు. దేవాలయాల నిర్వాహకులు, మండపాలను ఏర్పాటు చేయనున్న వారికి పోలీస్ అధికారులు ఏర్పాట్లపై ఆదేశాలు జారీ చేయనున్నారు. భద్రతలో భాగంగా నగరంలో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. మహిళల భద్రత, ఆకతాయిల ఆటకట్టించేందుకు షీ బృందాలను రంగంలోకి దించుతున్నారు. ట్రాఫిక్, సివిల్, టాస్క్‌ఫోర్సు, ఎస్‌వోటీ, ర్యాపిడ్ యాక్షన్ పోలీసులతోపాటు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించనున్నారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, విద్యుత్, రెవెన్యూతోపాటు తదితర శాఖల అధికారులతో హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర కో-ఆర్డినేషన్ సమావేశాలు నిర్వహించారు.

క్షేత్రస్థాయిలో అప్రమత్తం

గణేశ్ విగ్రహ నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టాలని క్షేత్రస్థాయిలో పోలీస్ సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మూడు కమిషనరేట్ల పరిధిలో విగ్రహాలను నిమజ్జనం చేయనున్న చెరువులు, కుంటలు, సరస్సులను ముందుగానే పరిశీలించాలని, కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఇతర శాఖల అధికారులు, నగరవాసులు, నిర్వాహకులతో సమన్వయంతో పనిచేయాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. చెరువులు, ఇతర నిమజ్జన నీటి కుంటల వద్ద వీధి దీపాలు, ఫ్లడ్ లైట్లు, క్రేన్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు.

బలవంతపు వసూళ్లపై ప్రత్యేక దృష్టి

గణేశ్ పండుగను పురష్కరించుకుని ఎవరైనా బలవంతపు వసూళ్లకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ముగ్గురు పోలీసు కమిషనర్లు హెచ్చరించారు. కొందరు సిబ్బందిని మఫ్టీలో ఉంచి సమాచారం సేకరిస్తున్నారు. ఇప్పటికే కొందరు బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నట్టు పోలీస్ అధికారుల దృష్టికి రావడంతో వారిని హెచ్చరించినట్టు సమాచారం. గణేశ్ విగ్రహాల ఏర్పాటు కోసం అనుమతులు తీసుకోవాలన్నారు.



కంట్రోల్ చేయాలనుకుంటే..?

గతం కంటే సోషల్ మీడియా వాడకం బాగా పెరిగిపోయింది. ముఖ్యంగా యువతపై దీని ప్రభావం ఎక్కువగా ఉంది. సోషల్ మీడియా వాడకాన్ని కంట్రోల్ చేసుకుందామనుకున్నా, ఆచరణలో సాధ్యం కాదు. నిజంగా కంట్రోల్ చేసుకోవాలని భావించే వారికి నిపుణులు కొన్ని చిట్కాలు చెబుతున్నారు.. అవేంటో చూద్దాం...

❍ సోషల్ మీడియా యాప్స్‌ని డిలీట్ చేసే యండి. ముందు పన్నెండు గంటల పాటూ మీ ఫోన్‌లో సోషల్ మీడియాని ఆఫ్ చేసి ప్రయోగం చేసి చూడండి.

❍ సోషల్ మీడియాకి దూరంగా ఉందామన్న ఒక ఫ్రెండ్‌తో కలిపి ఈ డీటాక్స్ ప్రోగ్రాంని మొదలు పెట్టండి. అప్పుడు ఇద్దరూ కలిసి కొన్ని గోల్స్ పెట్టుకుని వాటిని రీచ్ అయ్యేలా ప్లాన్ చేసుకోవచ్చు. ఇలా మరొకరితో కలిసి ప్లాన్ చేసుకున్నప్పుడు ఏ పనైనా చేయడం తేలిక అవుతుంది.

❍ మీరు ఏ సోషల్ మీడియా యాప్స్‌ని ఎక్కువ చూస్తున్నారో ఒక అంచనాకి రండి. ఎంత సమయం వెచ్చిస్తున్నారో లెక్క వేసుకుని, ఆ సమయంలో ఇంకే దైనా క్రియేటివిటీగా చేయవచ్చేమో ఆలోచించండి.

❍ ఫ్యామిలీతో, ఫ్రెండ్స్‌తో మాట్లాడండి. మీ గురించి మీ దగ్గర వారికీ, మిమ్మల్ని ప్రేమించే వారికీ ఎక్కువ తెలుస్తుంది. ఫోన్‌తో మీ రిలేషన్‌షిప్ గురించి వారు ఏమనుకుంటున్నారో ఒకసారి అడగండి. వారితో మీరుండే సమయంలో మీ ఫోన్ వాడకం ఏ విధంగా ఉందో చెప్పగలుగుతారు. దాన్ని బట్టి మీరెలా ఉంటున్నారో తెలుస్తుంది.

❍ ఫోన్‌కి కూడా నిద్ర కావాలి. రాత్రి తొమ్మిది, పది తర్వాత ఫోన్ పక్కన పెట్టండి. చేతికి అందుబాటులో వద్దు. చేతికి అందుబాటులో ఉంటే నిద్ర లేవగానే లేదా నడిరాత్రిలో మెలకువ వచ్చినపుడో ఫోన్‌నే పట్టుకుంటాం. అలా వద్దు. కాస్త దూరంగా పెడితే, మళ్ళీ మర్నాడు పొద్దున్నే ఫోన్ పట్టుకునేది.

❍ ఫోన్‌లో అలారం పెట్టుకోవడం మానే యండి. అందుకు క్లాక్ ఉపయోగించండి. ఫోన్‌లోనే అలారం ఉంటే లేస్తూలేస్తూనే, దాని వాడకంలో పడిపోతాం.

❍ హోం స్క్రీన్ మీద సోషల్ మీడియా యాప్స్ ఉండటం కంటే, ఒక ఫోల్డర్‌లో పెట్టుకుంటే యాక్సెస్ కొంత తగ్గుతుంది.

❍ ప్రశాంతంగా ఉండటం వల్ల ఒత్తిడి తగ్గడం, నిద్ర పట్టడం వంటి వాటితో పాటూ మనసు కూడా ఉత్సాహంగా ఉంటుంది. దానితో పాటు ఏం చేస్తున్నాం, ఎందుకు చేస్తున్నాం అనే అవగాహన కూడా ఉంటుంది. ఈ అవగాహన సోషల్ మీడియా వాడకాన్ని నియంత్రించుకోవడానికి కూడా బాగా ఉపయోగపడుతుంది.

వినాయక చవితి రానుంది... చాలా మంది ఇండ్లలో వినాయకుని ప్రతిష్టించుకుని పూజలు నిర్వహించుకుంటారు. వినాయకునికి ఇష్టమైన ఎన్నో వంటలు సిద్ధం చేస్తుంటారు. అందులో ఉండ్రాళ్లు, కుడుములు, లడ్డూలు, పులిహోర, బూరెలు... ఇలా ఎన్నో వెరైటీలుంటాయి. అయితే ఎప్పటిలా కాకుండా వీటినే కాస్త భిన్నంగా చేసి చూద్దాం...!

వినాయకుని విందు...



పాల వడలు

కావాల్సిన పదార్థాలు : మినప్పప్పు - రెండు కప్పులు, చిక్కటి పాలు - లీటరు, చక్కెర - రుచికి సరిపడా, యాలకులపొడి- చిటికెడు, వేయించిన బాదం పలుకులు - కొన్ని, కిస్మిస్ - ఆరు, నూనె - వేయించడానికి సరిపడా.

తయారు చేసే విధానం : మినప్పప్పును ఆరు నుంచి ఎనిమిది గంటల ముందు నానబెట్టుకోవాలి. తర్వాత గారెల పిండిలా మెత్తగా, గట్టిగా రుబ్బుకుని పక్కన పెట్టుకోవాలి. కడాయిలో సరిపడా నూనె వేసి వేడయ్యాక పిండిని గారెల్లా వేసి వేయించుకుని తీసుకోవాలి. ఇప్పుడు పాలను ఓ గిన్నెలో తీసుకుని పొయ్యి మీద పెట్టాలి. అవి అరలీటరు అయ్యే వరకూ మరిగించి అందులో సరిపడా చక్కెర, యాలకులపొడి వేయాలి. పాలు ఇంకాస్త చిక్కగా అయ్యాక దింపేయాలి. వడల్ని ఓ వెడల్పాటి గిన్నెలోకి తీసుకుని వాటిపై ఈ పాలను పోయాలి. బాదం పలుకులూ, కిస్మిస్‌తో అలంకరించాలి. అంతే పాలవడలు సిద్ధం.




పూర్ణం కుడుములు

కావాల్సిన పదార్థాలు : శెనగపప్పు - ఒకటిన్నర కప్పులు, బెల్లం - రెండు కప్పులు, తాజా కొబ్బరి తురుము - ఐదు చెంచాలు, యాలకుల పొడి - అర చెంచా,

పైపూత కోసం : బియ్యప్పిండి - మూడు కప్పులు, మంచినీళ్లు - తగినన్ని, నెయ్యి - రెండు చెంచాలు, ఉప్పు - చిటికెడు

తయారు చేసే విధానం : ప్రెషర్ కుక్కర్లో శెనగపప్పు వేసి, తగినన్ని నీళ్లు పోసి ఉడికించాలి. తర్వాత నీళ్లు వంపేసి గ్రైండర్‌లో మెత్తగా చేసి పక్కన ఉంచాలి. నాన్‌స్టిక్ పాన్‌లో బెల్లం తురుము వేసి తగినన్ని నీళ్లు పోసి కరిగించి, మరిగించాలి. తర్వాత మెత్తగా మెదిపిన శెనగపప్పు, కొబ్బరి తురుము, యాలకుల పొడి వేసి కలుపుతూ దగ్గరగా అయ్యే వరకూ ఉడికించాలి. ఇప్పుడు ముద్దని గుండ్రని ఉండల్లా చేసి పక్కన ఉంచాలి. బాణలిలో ఉప్పు, సుమారు మూడు కప్పుల నీళ్లు, నెయ్యి వేసి మరిగించి స్టవ్ ఆఫ్ చేయాలి. తర్వాత ఓ గిన్నెలో బియ్యప్పిండి వేసి మరిగించిన నీళ్లను కొంచెం కొంచెంగా పోస్తూ కలపాలి. చల్లారాక పిండి ముద్దను చిన్న ఉండల్లా చేయాలి. ఒక్కో ఉండనీ చిన్నపాటి పూరీలా అరచేతిలో వత్తి, అందులో పూర్ణం ఉండని పెట్టి, మూసేసి నెయ్యి రాసుకుంటూ నున్నని ఉండలా చుట్టాలి. ఇలాగే అన్నీ చేసుకుని నెయ్యి రాసిన ఇడ్లీ ప్లేటుల్లో పెట్టి సుమారు పన్నెండు నిమిషాలు ఉడికించాలి. చల్లారాక తీస్తే పూర్ణం కుడుములు రెడీ.



నిమ్మకాయ, పొడి పులిహోర

కావాల్సిన పదార్థాలు : బాస్మతి బియ్యంతో వండిన అన్నం - కప్పు, క్యారెట్ ముక్కలు- పావు కప్పు, పచ్చి బఠాణీలు - పావు కప్పు, కాబూలీ శెనగలు - పావు కప్పు, కొమ్ము సెనగలు- పావు కప్పు, రాజ్మా - పావు కప్పు, పల్లీలు- పావుకప్పు, పచ్చిమిర్చి- రెండు, నిమ్మకాయ - ఒకటి లేదా మరో అరచెక్క, కరివేపాకు రెబ్బ - ఒకటి, నెయ్యి - చెంచా, నూనె - రెండు చెంచాలు, ఇంగువ - చిటికెడు, పసుపు - పావు చెంచా, ఉప్పు - రుచికి సరిపడా, ఆవాలు - చెంచా.

పొడి కోసం : పల్లీలు - రెండు చెంచాలు, శెనగపప్పు - చెంచా, నువ్వులు - చెంచా, దనియాలు- పావుకప్పు, మెంతులు- పావుచెంచా, ఎండుమిర్చి - మూడు.

తయారు చేసే విధానం : ముందు పొడి కోసం తీసుకున్న పదార్థాలను నూనె లేకుండా వేయించుకోవాలి. వేడి చల్లారాక పొడిలా చేసుకుని పెట్టుకోవాలి. క్యారెట్ ముక్కలూ, బఠాణీలను మరీ మెత్తగా కాకుండా ఉడికించుకోవాలి. ముందు రోజు రాత్రి నానబెట్టుకున్న పల్లీలూ, శెనగలూ, రాజ్మాని కూడా ఉప్పు వేసుకుని ఉడికించుకుని పక్కకు పెట్టుకోవాలి. ఇప్పుడు కడాయిలో నూనె, నెయ్యి వేసి వేడయ్యాక ఆవాలు వేయించాలి. అందులో పచ్చిమిర్చి, శెనగలు, పల్లీలు, రాజ్మా కూడా వేసి వేయించుకోవాలి. రెండు మూడు నిమిషాల తర్వాత పసుపు, ఇంగువా, కరివేపాకు వేసి వేయించి స్టవ్ ఆఫ్ చేయాలి. ఇందులో ముందుగా చేసుకున్న పొడి, తగినంత ఉప్పు వేసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్నీ, నిమ్మరసాన్నీ అన్నంలో వేసుకుని కలుపుకుంటే సరి.



మోదక్

కావాల్సిన పదార్థాలు : బియ్యప్పిండి - కప్పు (బియ్యాన్ని గంట ముందు నాన బెట్టి తర్వాత ఆరబెట్టి పొడిలా చేసుకోవాలి), బెల్లం తురుము - కప్పు, తాజా కొబ్బరి తురుము - కప్పు, వేయించిన గసగసాలు - మూడు చెంచాలు, నెయ్యి - రెండు చెంచాలు, ఉప్పు - చిటికెడు, యాలకుల పొడి - అరచెంచా

తయారు చేసే విధానం : అడుగు మందంగా ఉన్న కడాయిలో కప్పు నీళ్లు తీసుకుని పొయ్యి మీద పెట్టాలి. నిమిషం తర్వాత ఉప్పు వేయాలి. నీళ్ల మరుగుతున్నప్పుడు మంట తగ్గించి బియ్యప్పిండి వేసేయాలి. ఉండలు కట్టకుండా కలుపుతూ ఉంటే రెండు నిమిషాలకు అది దగ్గరకు అవుతుంది. అప్పుడు దింపేసి మూత పెట్టేయాలి. ఇప్పుడు మరో గిన్నెలో పావుకప్పు నీళ్ళు బెల్లం తీసుకుని స్టవ్ మీద పెట్టాలి. అది కరిగి పాకంలా అవుతున్నప్పుడు కొబ్బరి తురుము, వేయించిన గసగసాలు, యాలకుల పొడి వేసి కలపాలి. మూడు నిమిషాల తర్వాత మిశ్రమం దగ్గరికొస్తుంది. అప్పుడు దింపేయాలి. చేతికి కొద్దిగా నెయ్యి రాసుకుని బియ్యప్పిండిని తీసుకుని చిన్న చపాతీల్లా చేత్తోనే వత్తుకోవాలి. అందులో కొద్దిగా బెల్లం, కొబ్బరి మిశ్రమాన్ని ఉంచి, మోదక్‌ల షేప్‌లో వచ్చేలా చేసుకోవాలి. మొత్తం పిండిని ఇలా చేసుకున్నాక, అన్నిటినీ ఒక గిన్నెలోకి తీసుకుని, పది నిమిషాలు ఆవిరి మీద ఉడికించాలి. అంతే మోదక్‌లు రెడీ.



రవ్వ బూరె

కావాల్సిన పదార్థాలు : బొంబాయి రవ్వ - కప్పు, కొబ్బరి తురుము - కప్పు, చక్కెర లేదా బెల్లం తురుము - అరకప్పు, యాలకులు - నాలుగు, ఉప్పు - చిటికెడు, నూనె - వేయించడానికి సరిపడా, నెయ్యి - కొద్దిగా

తయారు చేసే విధానం : నాన్‌స్టిక్ పాన్‌లో కొబ్బరి తురుము, చక్కెర లేదా బెల్లం తురుము, యాలకుల పొడి వేసి కలిపి తిప్పుతూ పది, పదిహేను నిమిషాలు వేయించాలి. ప్రెషర్ పాన్‌లో మంచినీళ్ల పోసి చిటికెడు ఉప్పు, చెంచా చక్కెర వేసి మరిగించాలి. మరుగుతుండగా రవ్వ వేసి తిప్పుతూ ఉండలు కట్టకుండా రెండు నిమిషాలు ఉడికించి, దించి పక్కన ఉంచాలి. చల్లారాక చేతులకు నెయ్యి రాసుకుని రవ్వ మిశ్రమాన్ని గుండ్రని ఉండలుగా చేయాలి. ఒక్కో ఉండనీ చిన్న పూరీలా వత్తి, అందులో కొబ్బరి మిశ్రమం పెట్టి, చేత్తోనే మళ్లీ బూరెల్లా వత్తాలి. కడాయిలో నూనె వేసి వేడయ్యాక ఈ బూరెలను వేసి, సిమ్‌లో వేయించి తీయాలి.



సగ్గుబియ్యం లడ్డు

కావాల్సిన పదార్థాలు : సగ్గుబియ్యం - కప్పు, ఎండుకొబ్బరి తురుము - ముప్పావు కప్పు, పంచదార - ముప్పావు కప్పు, నెయ్యి - ఆరు చెంచాలు, జీడిపప్పు : పది, యాలకులు -ఐదు, జాజికాయ పొడి - పావు చెంచా

తయారు చేసే విధానం : కడాయిలో సగ్గుబియ్యం వేసి సిమ్‌లో వేయించాలి. అవి కాస్త ఉబ్బి, లేత గోధుమ రంగులోకి మారి, కరకరలాడేలా వరకు అరగంట సమయం పడుతుంది. చల్లారాక వీటిని మిక్సీలో వేసి మెత్తని పొడిలా చేయాలి. మరో కడాయిలో కొబ్బరి తురుము కూడా వేసి రెండు మూడు నిమిషాలు వేయించాలి. అందులోనే సగ్గుబియ్యం పొడి, చక్కెర వేసి కలిపి ఓ నిమిషం పక్కన ఉంచాలి. తర్వాత నెయ్యి కరిగించి పోసి, వేయించిన జీడిపప్పు ముక్కలు, యాలకుల పొడి, జాజికాయ పొడి కూడా వేసి కలుపుకోవాలి. మిశ్రమం గోరువెచ్చగా ఉండగానే లడ్డూల్లా చుట్టాలి.

అది ఎర్రజెండా వారసత్వం

(మొదటిపేజి తరువాయి)

వ్యతిరేకంగా పాలన సాగిస్తోందన్నారు. ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులను రెచ్చగొట్టడానికే సెప్టెంబర్17 పేరుతో కార్యక్రమాలు చేస్తున్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా మత కల్లోలాలు సృష్టించి మళ్ళీ అధికారంలోకి రావడానికి బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. తెలంగాణలో విష బీజాలు నాటడానికి బీజేపీ కుట్రలు చేస్తోందని, ఈ కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్రం రాష్ట్రాలకు హక్కులు లేకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడానికి బీజేపీ ప్రయత్నం చేస్తుంటే అడ్డుకోవడానికే దేశంలో ప్రతిపక్షాలు ఏకమయ్యాయని చెప్పారు. సమస్యలపై జీ-20లో అసలు చర్చ జరగలేదని, అది కేవలం మోడీ ఆర్భాటం అన్నారు. జీ-20కి రూ.4000 కోట్ల ఖర్చు అవసరమా అని ప్రశ్నించారు. సనాతన ధర్మం అంటే కుల వ్యవస్థ అన్నారు. దేశంలో కుల వ్యవస్థ లేదంటే ఎవరూ నమ్మరన్నారు. ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఎందుకు సీక్రెట్‌గా జరపాలని ప్రశ్నించారు. దేశం పేరు మార్చాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ఇండియా పేరుతో ప్రతిపక్షాలు ఏకం కావడంతో.. బీజేపీ నేతలకు ఓడిపోతామనే భయం పట్టుకుని దేశం పేరు మార్చడానికి యత్నిస్తున్నారని విమర్శించారు. 2024 ఎన్నికలకు ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. జమిలి ఎన్నికలు అత్యంత ప్రమాదకరం అన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో సంబంధం లేని వారు చరిత్రను వక్రీకరిస్తున్నారన్నారు. ఈ రైతాంగ పోరాటంలో పాల్గొనని కాంగ్రెస్, బీజేపీ విలీనం, విమోచన పేరుతో సెప్టెంబర్17న సభలు నిర్వహిస్తున్నాయని విమర్శించారు. ఈ సాయుధ పోరాటం కమ్యూనిస్టులవన్నీ ఆ వారసత్వాన్ని కొనసాగించాలని అన్నారు. దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చడానికి గతంలో వాజ్‌పేయి ప్రయత్నం చేసినట్టు గుర్తు చేశారు. అయితే పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్టాలు అప్పట్లో వ్యతిరేకించినట్టు చెప్పారు. అప్పట్లో బీజేపీని అస్థిత్వం లేకుండా చేయాలని నితీశ్ కుమార్ ప్రయత్నం చేశారన్నారు. దేశాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడానికి బీజేపీ ప్రయత్నం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, పీఎస్ఎన్ మూర్తి, వివిధ కంపెనీల కార్మికులు, ఈసీఐఎల్, ఎన్ఎఫ్‌సీ రిటైర్డ్ ఎంప్లాయీస్, ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశత్వం ప్రబలుతుంది

(మొదటిపేజి తరువాయి)

జమిలి ఎన్నికలు నిర్వహించాలని వారు ప్రతిపాదిస్తున్నారు. అయితే వీరు కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పవలసి ఉంటుంది.

చట్టసభను ముందుగానే రద్దు చేస్తే ?

జమిలి ఎన్నికలు నిర్వహించినప్పటికీ ఏదైనా కారణంతో లోక్‌సభనో, రాష్ట్రాల శాసనసభలనో ముందుగానే రద్దు చేస్తే అప్పుడు పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఐదు సంవత్సరాల కాలపరిమితి ముగియకుండానే సభను మధ్యలోనే రద్దు చేసి, మిగిలిన కాలం కోసం మళ్లీ ఎన్నికలు జరిపితే దానికయ్యే వ్యయం మాటేమిటి? ఖర్చును తగ్గించవచ్చునన్న వాదనలో పస ఏముంటుంది? కాలపరిమితి ముగియని ప్రభుత్వాను జమిలి కోసం రద్దుచేయటం సాధ్యమవుతంది? చాలీచాలని మెజారిటీతో ఏర్పడిన ప్రభుత్వాలు చట్టసభల విశ్వాసం కోల్పోయినా సుస్థిరత, జమిలి పేరుతో అలాగేకొనసాగిస్తారా? అలా చేస్తే అది ప్రజాతీర్పుకు విఘాతం కాదా? దీనికి మన రాజ్యాంగ నియమాలు అనుమతిస్తాయా? అన్నవి కేవలం ప్రశ్నలే కాదు, ప్రజాస్వామ్యానికి సవాళ్ళు.

అవినీతికి బాట

జమిలి ఎన్నికలు నిర్వహిస్తున్న నార్వేలో అనేక సందర్భాలలో మైనారిటీ ప్రభుత్వాలు ఏర్పడడం, దేశంలో అస్థిర రాజకీయాలు కొనసాగడం, ఫలితంగా అభివృద్ధి కుంటుపడడం, అవినీతి వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మైనారిటీ ప్రభుత్వాల పాలనలో పార్టీ ఫిరాయింపులకు, అవినీతికి ఎక్కువ ఆస్కారం ఉంటుందన్నది మనకు అనుభవమే. దేశాన్ని పాలించే పార్టీకి చాలినంత మెజారిటీ లేకపోయినా సభను రద్దు చేయకుండా 'సుస్థిరత' పేరుతో అలాగే కొనసాగిస్తే అది అవినీతికి బాట వేయడమే అవుతుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

ఫెడరల్ వ్యవస్థ పైనా ప్రభావం

జమిలి ఎన్నికలు ఫెడరల్ వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతాయి. లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరిగితే ప్రాంతీయ, జాతీయ అంశాలు కలగాపులగమై ఓటింగ్‌పై ప్రభావం పడుతుంది. రాష్ట్ర స్థాయి సమస్యలు మరుగునపడే ప్రమాదం ఉంది. కేంద్రంలో అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్న పార్టీకే రాష్ట్రాలలో కూడా 77% అవకాశాలు ఉంటాయని 2015లో జరిగిన ఓ సర్వే తేల్చింది.

తెలంగాణపై కాంగ్రెస్ హైకమాండ్ ఫోకస్

(మొదటిపేజీ తరువాయి)

నటరాజన్‌ను పార్టీ నియమించింది. ఎక్కడ ఏ సమస్య వచ్చినా స్థానిక నేతలతో సమన్వయం చేసుకుంటూ దాన్ని పరిష్కరిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

దూకుడు...దూకుడే

ఎన్నికలు ముంచుకొస్తున్న కొద్దీ కాంగ్రెస్ మరింత దూకుడు పెంచుతోంది. ప్రజల్లోకి మరింతగా చొచ్చుకుపోయేందుకు కార్యాచరణ రూపొందించింది. కర్నాటక ఎన్నికల తరహాలోనే టీపీసీసీకి మార్గనిర్దేశం చేసేందుకు అధిష్టానం ఇక్కడే తిష్ట వేసింది. ప్రతి సమావేశంలోనూ పాల్గొని అగ్రనేతలు దిశా నిర్దేశం చేస్తున్నారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణలోనూ కీలకంగా వ్యవహరిస్తున్నారు. పరిస్థితులను చక్కదిద్దుతున్నారు. అభిప్రాయ భేదాలు బహిర్గతం కాకుండా కట్టుదిట్టం చేస్తున్నారు. పార్టీకి నష్టం కలిగించే చర్యలపై అధిష్టానం నిఘా పెట్టారు. పార్టీలో కోవర్టులను సైతం తోవకు తెచ్చినట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. పార్టీని అంతర్గతంగా బలోపేతం చేస్తూనే...క్రియాశీలక నాయకులను గుర్తించి వారిని అనేక కమిటీల్లో నియమిన్నారు. అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఎవరికైతే టికెట్ రాదో వారిని బుజ్జగిస్తున్నారు. ఈ విధంగా నాయకుల భవిష్యత్తుకు భరోసా ఇస్తూ...ఎక్కడికక్కడే సర్దుబాటు చేస్తున్నారు.

17న ఎన్నికల శంఖారావం

మరోవైపు సీడబ్ల్యూసీ సమావేశాలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్ర కాంగ్రెస్...దాన్ని ఎన్నికల ప్రచారాస్త్రంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ఈనెల 17న నిర్వహించబోయే విజయభేరి సభను విజయవంతం చేసేందుకు క్షేత్రస్థాయి నుంచి సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీకి ఊపు తెచ్చేలా ప్రయత్నిస్తున్నారు. సభకు భారీ జనసమీకరణ చేపట్టడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి ఇక తిరుగులేదనే సంకేతాలు ఇచ్చేందుకు నాయకత్వం ప్రయత్నిస్తున్నది. మరోవైపు మ్యానిఫెస్టో కమిటీ, కమ్యూనికేషన్ కమిటీ, శిక్షణ తరగతుల కమిటీ, బీసీ డిక్లరేషన్ కమిటీ...ఇలా రకరకాల కమిటీ సమావేశాలతో గాంధీభవన్ బిజీబిజీగా మారింది. మ్యానిఫెస్టో కమిటీ కీలకంగా మారబోతున్నది. విజయభేరి సభలో సోనియాగాంధీ ఇచ్చే ఐదు హామీలపై సుదీర్ఘ మంతనాలు జరుపుతున్నారు. అందులో మహిళా, రైతు, యువత, సంక్షేమం (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ), అసైన్డ్ భూములపై కీలక హామీలు ఉండనున్నాయి. కర్నాటక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇప్పటికే అమలు చేస్తున్న కాంగ్రెస్...ఇక్కడ కూడా అదే మాదిరిగా హామీలిచ్చి అమలయ్యేలా రాహుల్‌గాంధీ భరోసా కల్పించనున్నారు.

వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ, అభ్యర్థుల ఎంపికలోనూ ఆచీతూచీ వ్యవహరిస్తున్నట్టు తెలిసింది. కర్నాటకలో ఓ నియోజకవర్గం నుంచి సిద్దారామయ్య గెలిచే అవకాశం లేదంటూ అధిష్టానం ఆయన్ను వేరే నియోజకవర్గానికి మార్చింది. అదే తరహాలో ఇప్పుడు మన రాష్ట్రంలో కూడా అధిష్టానం చేపట్టిన సర్వేల ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేసే సూచనలు కనిపిస్తున్నాయి. సర్వేల్లో ఫలానా నేత అక్కడ ఓడిపోతారనే సంకేతాలు ఉంటే, ఆయన స్థానంలో మరో అభ్యర్థిని ఖరారు చేసేలా అధిష్టానం ప్లాన్ బీ రెడీ చేసింది.

భోపాల్‌లో భారీ ర్యాలీ

(మొదటిపేజి తరువాయి)

నేతలందరతో కలిసి కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ సీట్ల పంపకానికి సంబంధించిన ప్రక్రియను ప్రారంభించాలని సమన్వయ కమిటీ నిర్ణయించిందన్నారు. పార్టీలతో చర్చలు జరిపి వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్టు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉమ్మడి బహిరంగ సభలు నిర్వహించాలని కమిటీ నిర్ణయించిందన్నారు.

కూటమి పార్టీలు ఏవీ తమ ప్రతినిధులను మీడియా చర్చలకు పంపకూడదని, ఎవరి షోలలో ఎవరి పాల్గోవాలో ప్రతినిధుల పేర్లను నిర్ణయించే అధికారం మీడియా కో-ఆర్డినేషన్ కమిటీ సబ్ గ్రూప్‌కు ఇచ్చినట్టు తెలిపారు. కుల గణన అంశాన్ని చేపట్టేందుకు సమావేశానికి హాజరైన పార్టీలు అంగీకరించాయని అన్నారు. కుల గణనపై తృణమూల్ కాంగ్రెస్ వైఖరికి సంబంధించి మీడియా అడిగిన ప్రశ్నకు స్పందించిన కెసి వేణుగోపాల్, టీఎంసీ ప్రతినిధి ఇప్పుడు లేరని, ఇక్కడ ఉన్న పార్టీలన్నీ మద్దతు ఇచ్చాయని అన్నారు.

18 తరువాతే కస్టడీ పిటిషన్‌పై విచారణ

(మొదటిపేజీ తరువాయి)

జస్టిస్ కె శ్రీనివాస్‌రెడ్డి విచారణ జరిపారు. విచారణ ప్రారంభంలోనే తాను గతంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా చేశానని, అప్పుడు చంద్రబాబుకు వ్యతిరేకంగా దాఖలైన కేసుల్లో వాదనలు వినిపించానని, ఇప్పుడు ఈ కేసు విచారణపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే (నాట్ బిఫోర్ మీ) చెప్పాలని న్యాయమూర్తి కోరారు. పిటిషన్‌పై విచారణ చేపట్టేందుకు తమకు అభ్యంతరం లేదని పిటిషనరు తరపున న్యాయవాది, ప్రభుత్వ న్యాయవాది చెప్పడంతో విచారణ చేపట్టారు. తొలుత సీఐడీ తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కల్పించుకుని కౌంటర్ పిటిషన్ దాఖలు చేసేందుకు వారం రోజులపాటు గడువు కావాలని కోరడంతో అందుకు న్యాయమూర్తి అనుమతించారు. వెంటనే చంద్రబాబు తరపు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా కల్పించుకుని, చంద్రబాబును ఏసీబీ కోర్టు ఈ నెల 10న రిమాండ్ ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ నేపథ్యంలో చంద్రబాబును విచారించేందుకు ఐదు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఏసీబీ కోర్టులో సీఐడీ పిటిషన్ దాఖలు చేసిందని గుర్తు చేశారు. కింది కోర్టులో విచారణ కొనసాగితే పిటిషనర్‌కు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏసిబి కోర్టులోని కస్టడీ పిటిషన్‌పై విచారణను నిలిపేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఇందుకు అనుమతిస్తూ న్యాయమూర్తి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసి తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు.

రాజకీయ కక్షతో కేసులో ఇరికించారు : లూథ్రా

అంతకుముందు చంద్రబాబు తరపు న్యాయవాది సిద్దార్థ లూథ్రా వాదిస్తూ రాజకీయ కక్షతో తప్పుడు కేసు పెట్టినట్టు చెప్పారు. 'పబ్లిక్ సర్వెంట్‌పై కేసు నమోదు/విచారణ చేయాలంటే అవినీతి నిరోధక చట్టం (సవరణ)లోని సెక్షన్ 17ఏ ప్రకారం గవర్నర్ (కాంపిటెంట్ అథారిటీ) అనుమతిని విధిగా తీసుకోవాలన్న నిబంధనను సీఐడీ ఉల్లంఘించింది. 17ఏ సెక్షన్ 2018 జులై 26న అమల్లోకి వచ్చింది. ఆ తర్వాత 2021లో సుప్రీంకోర్టు కాంపిటెంట్ అథారిటీ నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తీర్పు చెప్పింది. ఈ కేసులో చంద్రబాబు విషయంలో సీఐడీ.. గవర్నర్ అనుమతి తీసుకోలేదు. ఒక్కసారిగా చంద్రబాబును నిందితుడిగా చేర్చి అరెస్టు చేయడం చట్ట వ్యతిరేకం. ఏసిబి కోర్టు రిమాండ్‌కు పంపడం కూడా చెల్లదు. కేసు నమోదు, సిఐడి దర్యాప్తు, ఏసిబి కోర్టు ఉత్తర్వులను రద్దు చేయాలి. రిమాండ్ ఉత్తర్వులు చట్ట వ్యతిరేకం. వాస్తవానికి ఈ కేసు ఎంపి, ఎమ్మెల్యేలపై కేసులను విచారించే ప్రత్యేక కోర్టు పరిధిలోకి వస్తుంది. 2021 డిసెంబరు 9న నమోదు చేసిన ఈ కేసులో 22 నెలలు గడిచాక తీరుబడిగా కావాలనే చంద్రబాబును అందులో చేర్చుతున్నారు. తదుపరి చర్యలను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలి' అని అంతకుముందు లూథ్రా వాదించారు.

మరో కేసులో నోటీసులు

అమరావతి మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ డిజైన్ల మార్పు పేరుతో జరిగిన భూదందాపై సీఐడీ 2022లో నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 19కి వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

17న అఖిలపక్షం

(మొదటిపేజీ తరువాయి)

విచిత్రంగా ప్రత్యేక సమావేశాల ఎజెండా ఏమిటో ఏ ఒక్కరికీ తెలియదని చెప్పారు. ఇదే విషయమై ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కాంగ్రెస్ నేత సోనియా గాంధీ లేఖ రాశారు. ప్రహ్లాద్ జోషి ఇందుకు ప్రతిగా ఆమెకు లేఖ రాస్తూ, నిర్దిష్ట నియమ నిబంధనలకు అనుగుణంగానే ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కాగా, ఈ సమావేశాల్లో ప్రధాన ఎన్నికల కమిషనర్లు, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకాలు, సర్వీసు పరిస్థితుల బిల్లును, దీంతోపాటు.. పోస్టాఫీసు బిల్లును రాజ్యసభలో ఆమోదం కోసం పెట్టనున్నారు. అలాగే రాజ్యసభలో ఆమోదం పొంది, లోక్‌సభలో పెండింగ్‌లో ఉన్న అడ్వకేట్స్ సవరణ బిల్లు, ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పిరియాడికల్స్ బిల్లులను జాబితా చేశారు. ఈ మేరకు లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ బులెటిన్ విడుదల చేశారు.

నాలుక కోస్తా... కండ్లు పీకేస్తా...

(మొదటిపేజీ తరువాయి)

పీకేయాలి' అని ఆయన చెప్పుకొచ్చారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడే వారికి దేశాన్ని పాలించే అర్హత లేదని కూడా అన్నారు. అల్లాఉద్దీన్ ఖిల్జీ, ఔరంగజేబు వంటి పాలకులు సనాతన ధర్మాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నించారని, అయితే మన పూర్వీకులు ఆ ప్రయత్నాలను అడ్డుకొని భారతీయ సంస్కృతిని పరిరక్షించారని షెకావత్ చెప్పారు. సనాతన ధర్మంపై దాడి చేసిన వారిని సహించబోమని, వారిని తరిమేస్తామని మహారాజా సూరజ్‌మాల్, వీర దుర్గాదాస్, మహారాణా ప్రతాప్ వంటి వారిపై ప్రతినబూని చాటిచెప్పాలని కోరారు.

రేపే టెట్

(మొదటిపేజీ తరువాయి)

2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పేపర్-2 రాతపరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లోనూ నిర్వహిస్తామని వివరించారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం 2,052 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 2,052 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 22,572 మంది ఇన్విజిలేటర్లు, 10,260 మంది హాల్ సూపరింటెండెంట్లను నియమించామని తెలిపారు. జిల్లాల కలెక్టర్లు, డీఈవోలు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఫర్నీచర్, చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీ కెమెరాల ఏర్పాటు, అసౌకర్యం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా వంటి చర్యలు తీసుకున్నారని వివరించారు. వైద్యారోగ్య శాఖ పరీక్షా కేంద్రాల వద్ద ఏఎన్ఎంలను మెడికల్ కిట్లతో అందుబాటులో ఉంచిందని తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాలున్న ప్రాంతాలకు అభ్యర్థులు సకాలంలో వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు ఉంటుందని వివరించారు. పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయి పరిశీలకులను నియమించామని తెలిపారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. రెండు బ్లాక్ బాల్‌పాయింట్ పెన్నులు, హాల్‌టికెట్ వెంటతెచ్చుకోవాలని కోరారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, బ్యాగులను అనుమతించబోమని స్పష్టం చేశారు.

ఆ విద్యాసంస్థలకు నేడు, రేపు సెలవు

టెట్ పరీక్షా కేంద్రాలున్న పాఠశాలలు, కాలేజీలకు గురు, శుక్రవారం రెండురోజులపాటు రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. టెట్ నిర్వహించే విద్యాసంస్థలకు రెండురోజులు సెలవులిస్తున్నట్టు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. అయితే గురువారం మధ్యాహ్నం, శుక్రవారం రెండు పూటలా సెలవులుంటాయని స్పష్టం చేశారు. టెట్ నిర్వహించే జూనియర్ కాలేజీలకు గురు, శుక్రవారాల్లో సెలవులుంటాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ ఒక ప్రకటనలో తెలిపారు. అయితే గురువారం మధ్యాహ్నం, శుక్రవారం రెండుపూటలా సెలవులుంటాయని పేర్కొన్నారు.

టెట్ పరీక్ష వివరాలు

టెట్ నిర్వహణ తేదీ		దరఖాస్తులు	పరీక్షా కేంద్రాలు
2023, సెప్టెంబర్ 15	పేపర్-1	2,69,557	1,139
	పేపర్-2	2,08,498	913
మొత్తం		4,78,055	2,052



భారత్‌తో ఫైనల్లో తలపడేదెవరో..?

పాకిస్తాన్, శ్రీలంక జట్లకు కీలకం

గెలిచిన జట్టుకు ఫైనల్ బెర్త్





కొలంబో: ఆసియాకప్ క్రికెట్ పోటీలు చివరి దశకు చేరుకున్నాయి. మరో రెండు సూపర్-4 మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉండగా.. పాకిస్తాన్-శ్రీలంక జట్ల మధ్య గురువారం జరిగే మ్యాచ్‌పై అందరి దృష్టి నెలకొంది. ఫైనల్లో భారత్‌తో తలపడే జట్టేదో పాకిస్తాన్, శ్రీలంక జట్ల మధ్య జరిగే మ్యాచ్‌తో తేలిపోనుంది. ఈ రెండు జట్లు సూపర్-4లో బంగ్లాదేశ్‌పై నెగ్గి, భారత్ చేతిలో ఓటమిపాలయ్యాయి. పాకిస్తాన్ జట్టు ఏకంగా 228పరుగుల తేడాతో ఓటమిపాలైతే.. శ్రీలంక జట్టు 41పరుగుల తేడాతో ఓడింది. ఇక బంగ్లాదేశ్‌పై శ్రీలంక జట్టు 21పరుగుల తేడాతో నెగ్గితే.. పాకిస్తాన్ జట్టు బంగ్లా నిర్దేశించిన 192పరుగుల లక్ష్యాన్ని 3వికెట్లు కోల్పోయి ఛేదించింది.

సూపర్-4 దశలో ఒక్కో జట్టు.. మిగతా వాటితో మూడేసి మ్యాచ్‌లు ఆడతాయి. ఇందులో టాప్-2లో నిలిచిన జట్లు ఫైనల్ చేరుకుంటాయి. సూపర్-4లో రెండేసి మ్యాచ్‌లు ముగిసిన తర్వాత భారతజట్టు 4పాయింట్ల(+2.69 నెట్‌రన్‌రేట్)తో అగ్రస్థానంలో నిలిచి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ఫైనల్‌కు చేరుకుంది. ఇక శ్రీలంక, పాకిస్తాన్ జట్లు రెండేసి మ్యాచ్‌లు ఆడగా.. ఒక్కో మ్యాచ్‌లో ఓడి.. పాయింట్ల పట్టికలో రెండు, మూడు స్థానాల్లో కొనసాగుతున్నాయి. పాకిస్తాన్.. భారత్‌పై 228పరుగుల భారీ తేడాతో ఓడిపోవడంతో నెట్‌రన్‌రెట్‌పై ప్రభావం పడి.. మూడో స్థానంలో ఉంది. పాకిస్తాన్-శ్రీలంక జట్ల మధ్య జరిగే మ్యాచ్ విజేత సమీకరణాలతో నిమిత్తం లేకుండా నేరుగా భారత్‌తో ఫైనల్‌లో తలపడనుంది. ఇక బంగ్లాదేశ్ ఇప్పటికే రెండింటిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. సెప్టెంబర్ 15న భారత్, బంగ్లా మధ్య జరిగే మ్యాచ్ నామమాత్రమే.

వర్షంతో మ్యాచ్ రద్దయితే..

పాక్-శ్రీలంక జట్ల మధ్య కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో జరిగే మ్యాచ్ వర్షంతో రద్దయితే ఇరుజట్లకు ఒక్కో పాయింట్ దక్కనున్నాయి. దీంతో పాకిస్తాన్ కంటే మెరుగైన రన్‌రేట్ కలిగి ఉన్న శ్రీలంక జట్టు ఫైనల్‌కు చేరనుంది. ఎందుకంటే మ్యాచ్ రద్దయితే ఇరుజట్లకు చెరో పాయింట్ లభిస్తే.. 3 పాయింట్లతో ఇరుజట్లు సమానంగా ఉన్నా శ్రీలంక(-0.20), పాకిస్తాన్(-1.89) నెట్ రన్‌రేట్‌తో 2, 3 స్థానాల్లో ఉన్నాయి. అప్పుడు మెరుగైన రన్‌రేట్ కలిగిన శ్రీలంక రెండో స్థానంలో నిలిచి ఫైనల్ చేరుకుంటుంది. మ్యాచ్ జరిగి తప్పక విజయం సాధిస్తేనే పాకిస్తాన్ ఫైనల్‌కు చేరుతుంది. వర్షంతో మ్యాచ్ నిలిస్తే మాత్రం పాక్ ఫైనల్ ఆశలకు ఎదురు దెబ్బ తగిలినట్లే. ఈ క్రమంలో భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌కు రిజర్వ్‌డేను ప్రకటించిన ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసిసి).. ఈ మ్యాచ్‌కు కూడా రిజర్వు డేను ప్రకటించాలని మాజీ క్రికెటర్లు వాదిస్తున్నారు.



నవీనుల్ హక్‌కు చోటు

వన్డే ప్రపంచ కప్‌కు ఆఫ్ఘన్ జట్టు ఇదే!

కాబూల్: భారత్ వేదికగా జరగనున్న ఐసిసి వన్డే ప్రపంచకప్‌కు ఆఫ్ఘనిస్తాన్ జట్టును ఆ దేశ క్రికెట్‌బోర్డు ప్రకటించింది. హష్మతుల్లా షాహిదీ కెప్టెన్‌గా ఎంపికవ్వగా.. పేసర్ నవీనుల్ హక్‌కు రెండేళ్ల తర్వాత ఆఫ్ఘన్ జట్టులో చోటు దక్కింది. ఇక ఆసియా కప్‌లో రాణించిన గుల్బాదిన్ నైబ్‌కు ప్రపంచ కప్ జట్టులో చోటు దక్కలేదు. మాజీ కెప్టెన్ కరీం జనత్, షరాఫుద్దీన్ అష్రఫ్, సులిమాన్ సఫీలకు కూడా నిరాశే ఎదురైంది. ప్రపంచకప్‌లో ఆఫ్ఘనిస్తాన్ జట్టు తన తొలి మ్యాచ్ అక్టోబర్ 7న బంగ్లాదేశ్‌తో ఆడనుంది.

జట్టు: హష్మతుల్లా(కెప్టెన్), గుర్బాజ్, జద్రాన్, రియాజ్ హసన్, రహ్మత్ షా, నజీబుల్లా జద్రాన్, మహ్మద్ నబీ, ఇక్రమ్ అలీఖిల్, అజ్మతుల్లా ఒమర్జాయ్, రషీద్ ఖాన్, ముజిబుర్, నూర్ అహ్మద్, ఫజల్ హక్వీన్, ఫజల్ ఫారూఖీ.

రెండోరౌండ్‌కు తానీషా, పొన్నప్ప

• హాంకాంగ్ ఓపెన్



కౌలూన్(హాంకాంగ్): హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్‌లో తానీషా క్రాస్టో, అశ్విని పొన్నప్ప జోడీ రెండోరౌండ్‌కు దూసుకెళ్లగా మిగిలిన షట్లర్లందరూ పరాజయాన్ని చవిచూశారు. బుధవారం జరిగిన మహిళల డబుల్స్ తొలిరౌండ్ పోటీలో భారత జంట 21-19, 21-19తో చైనీస్ తైపీకి చెందిన లీ-టెంగ్‌లను చిత్తుచేశారు. ఇక పురుషుల డబుల్స్‌లో కృష్ణప్రసాద్ గరగ-విష్ణువర్ధన్ జోడీ 15-21, 15-21తో కో-సంగ్, షిన్ బెక్(కొరియా) చేతిలో వరుససెట్లలో ఓడారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో బి.సుమిత్-అశ్విని పొన్నప్ప జంట 16-21, 21-16, 18-21తో అమెరికాకు చెందిన ఛెన్-టంగ్, టో-ఇ-వుయ్ చేతిలో పోరాడి ఓడగా.. మహిళల సింగిల్స్‌లో మాళ్విక బన్సోద్ 14-21, 12-21తో జంగ్-యి-మన్(చైనా) చేతిలో ఓటమిపాలైంది. ఇక పురుషుల సింగిల్స్‌లో ప్రియాంశురాజ్‌వత్ 13-21, 14-21తో జపాన్‌కు చెందిన సునేయమా చేతిలో, మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్ 18-21, 10-21తో వున్నే-లీ(జర్మనీ) చేతిలో, మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్-సిక్కిరెడ్డి జోడీ 19-21, 10-21తో సింగపూర్ జంట చేతిలో పరాజయాన్ని చవిచూశారు. ఇక పురుషుల సింగిల్స్‌లో స్టార్ షట్లర్ లక్ష్యసేన్ గాయం కారణంగా టోర్నీ నుంచి వైదొలిగాడు.

అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

- కేంద్రాల తాళాలు పగలగొట్టిన అధికారులపై చర్యలకు డిమాండ్
- రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సమ్మె
- ఐసీడీఎస్ కార్యాలయాల ముట్టడి



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ- విలేకరులు

అంగన్వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ (టీచర్స్) అండ్ హెల్పర్స్ (సీఐటీయూ) యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మె బుధవారం కొనసాగింది. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగవ్వాడీల సమ్మె శిబిరాన్ని చెరుపల్లి సీతారాములు సందర్శించి మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగనవాడీ ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. ఎన్నో ఏండ్లుగా పనిచేస్తున్నా వారికి చట్టబద్ధ సౌకర్యాలు లేవన్నారు. తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని తెలిపారు. ఇటీవల మంత్రి సత్యవతి రాథోడ్ అంగన్వాడీల సమస్యలు పరిష్కారిస్తామని హామీలు ఇచ్చి ఒక్కటీ అమలు చేయడం లేదన్నారు. అందువల్లే అంగన్‌వాడీలు సమ్మెలోకి వెళ్లారని చెప్పారు. ఇప్పటికైనా వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చర్చలు జరిపి అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్, ఈఎస్ఐ బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. పని భారం తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని కోరారు. సమ్మె చేస్తున్న సందర్భంలో అంగన్‌వాడీల సెంటర్ల తాళాలు పగలగొట్టిన అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలో సమ్మెకు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్ల దేవేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు శంకర్ నాయక్, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు నాగమణి, కాంగ్రెస్ కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. ఖమ్మం జిల్లా కల్లూరులో అంగన్‌వాడీల దీక్ష శిబిరాన్ని సీపీఐ(ఎం), ఏఐటీయూసీ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం నుంచి సీడీపీవో కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి ధర్నా చేశారు. అనంతరం సీడీపీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ పాల్గొన్నారు. దుమ్ముగూడెం, చర్లలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం అధికారికి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని గోల్కొండ క్రాస్ రోడ్ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్ వరకు అంగన్వాడీ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ.. అంగన్వాడీ ఉద్యోగులు న్యాయమైన డిమాండ్‌ల కోసం పోరాడుతుంటే అధికారులు వేధింపులకు పాల్పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మేడిపల్లి మండల తహసీల్దారు కార్యాలయం వద్ద సమ్మెకు సీపీఐ మేడిపల్లి మండల కార్యదర్శి ఆర్.కిషన్ మద్దతు ప్రకటించారు. ఘట్కేసర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సమ్మెకు సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు.

శుభ్‌మన్ @ 2

ఐసిసి వన్డే ర్యాంకింగ్స్ విడుదల



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) ప్రకటించిన తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు ముగ్గురు టాప్-10లో చోటు దక్కించుకున్నారు. టీమిండియా ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌తోపాటు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టాప్-10లో నిలిచారు. శుభ్‌మన్ గిల్ 759 రేటింగ్ పాయింట్లతో కెరీర్ బెస్ట్ రెండో స్థానంలో నిలువగా.. ఆసియా కప్‌లో పాకిస్తాన్‌పై అజేయ సెంచరీతో రాణించిన విరాట్ కోహ్లీ 715 రేటింగ్ పాయింట్లతో రెండు స్థానాలు మెరుగుపరుచుకొని ఎనిమిదో స్థానంలో నిలిచాడు. ఆసియాకప్‌లో మూడు అర్ధ సెంచరీలు చేసిన టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ 707 పాయింట్లతో రెండు స్థానాలు ఎగబాకి తొమ్మిదో స్థానం నిలిచాడు. 2019లో తొలిసారి భారత ఆటగాళ్లు ముగ్గురు టాప్-10లో చోటు దక్కించుకోగా.. మళ్లీ ఇన్నాళ్లకు మరోసారి ముగ్గురు టాప్-10లో నిలవడం విశేషం. 2019లో శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టాప్-10లో నిలిచారు. ఇక పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ అజామ్ 863 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. ఇమామ్ ఉల్ హక్(735పాయింట్లు) ఒక స్థానం పడిపోయి ఐదో స్థానంలో, ఫకార్ జమాన్(705పాయింట్లు) మూడు స్థానాలు కోల్పోయి పదో స్థానానికి పడిపోయారు.

అనిల్ కుంబ్లే రికార్డు బద్ధలు కొట్టిన కుల్‌దీప్

ఆసియా కప్‌లో భాగంగా మంగళవారం శ్రీలంకతో జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో టీమిండియా లెగ్‌స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ నాలుగు వికెట్లు పడగొట్టి వన్డేల్లో 150 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. అంతేకాదు భారత్ తరఫున వేగంగా 150 వికెట్లు పడగొట్టిన తొలి స్పిన్నర్‌గా రికార్డు నెలకొల్పాడు. కుల్దీప్ యాదవ్ 88 మ్యాచ్‌ల్లో ఈ రికార్డు అందుకున్నాడు. దీంతో అనిల్ కుంబ్లే పేర (106 మ్యాచుల్లో 150వికెట్లు) ఉన్న రికార్డు బద్ధలైంది.

నవచిత్రం



భయపెడుతూనే నవ్వించే చంద్రముఖి 2

రాఘవ లారెన్స్ హీరోగా, కంగనా రనౌత్ టైటిల్ పాత్రలో నటించిన భారీ బడ్జెట్ మూవీ 'చంద్రముఖి 2'. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తోన్న ఈ చిత్రాన్ని డైరెక్టర్ పి.వాసు తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా మూవీగా ఈనెల 28న విడుదలవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని రాధాకృష్ణ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వెంకట్ ఉప్పుటూరి, వెంకట రత్నం శాఖమూరి రిలీజ్ చేస్తున్నారు. తాజాగా చిత్రం నుంచి 'తొరి బొరి..' అంటూ సాగే పాటను రిలీజ్ చేశారు. ఈ పాటను భువనచంద్ర రాయగా, అరుణ్ కౌండిన్య, అమల చెంబోలు ఆలపించారు. కీరవాణి వినసొంపైన బాణీ అందరినీ మెప్పిస్తోంది. ఈ పాటలో రాఘవ లారెన్స్, వడివేలు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు.

అష్టదిగ్బంధనం అయితే..?



విషిక, సూర్య

ఎం.కె.ఎ.కె.ఎ ఫిలిం ప్రొడక్షన్ సమర్పణలో బాబా పి.ఆర్. దర్శకత్వంలో మనోజ్‌కుమార్ అగర్వాల్ నిర్మించిన చిత్రం 'అష్టదిగ్బంధనం'. సూర్య, విషిక జంటగా నటించిన ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్ ఈవెంట్ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి 'బేబి' దర్శకుడు సాయి రాజేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్‌ను లాంచ్ చేసి, ఈ సినిమా ఈనెల 22న విడుదల కానుందని ప్రకటించారు.

ఈ సందర్భంగా నిర్మాత మనోజ్‌కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, 'దర్శకుడు బాబా పి.ఆర్ ఈ కథ చెప్పగానే నాకు ఆసక్తికరంగా అనిపించింది. మంచి యాక్షన్, క్రైమ్ థ్రిల్లర్. బాబా కథ చెప్పిన దానికన్నా అద్భుతంగా తీశారు' అని తెలిపారు. 'దర్శకుడిగా నా మొదటి సినిమా 'సైదులు'. ఇది నా రెండో చిత్రం. ప్రేక్షకుణ్ణి ప్రతి సీన్ థ్రిల్‌కు గురి చేస్తుంది. స్క్రీన్‌ప్లే బేస్డ్ సినిమా. ఇందులోని క్యారెక్టర్‌లు సెల్ఫిష్‌నెస్‌తో ఒకరినొకరు అష్టదిగ్బంధనం చేసుకోవాలని చూస్తుంటాయి' అని దర్శకుడు బాబా పి.ఆర్. అన్నారు.

అదృష్టంగా భావిస్తున్నా..



గోల్డీ నిస్సీ

రవితేజ ప్రొడక్షన్ బ్యానర్ ఆర్‌టి టీమ్‌వర్క్స్‌లో రాబోతున్న కాన్సెప్ట్ బేస్డ్ చిత్రం 'ఛాంగురే బంగారురాజా'. సతీష్ వర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఫ్రేమ్ బై ఫ్రేమ్ పిక్చర్స్‌తో కలిసి రవితేజ నిర్మించారు. కార్తీక్ రత్నం, గోల్డీ నిస్సీ జంటగా నటించారు. వినాయక చవితి సందర్భంగా ఈనెల 15న ఈ సినిమా రిలీజ్ అవుతున్న నేపథ్యంలో హీరోయిన్ గోల్డీ నిస్సీ మీడియాతో ముచ్చటించింది. 'నేను తెలుగమ్మాయిని. కొన్ని షార్ట్ ఫిలిమ్స్ చేశాను. ఇది నా ఫస్ట్ బిగ్ సినిమా. ఇందులో నా పాత్ర పేరు మంగరత్నం. కానిస్టేబుల్. కొంచెం గ్రే షేడ్ ఉంటుంది. నన్ను బంగారాజు ఇష్టపడతాడు. మా లవ్ ట్రాక్ చాలా ఆసక్తికరంగా ఉంటుంది.రవితేజ నిర్మాణంలో నా తొలి సినిమా చేయడం అదృష్టం. దర్శకుడు సతీష్ రాసిన స్క్రిప్ట్ చాలా బాగుంది' అని గోల్డీ నిస్సీ చెప్పింది.

భిన్న పాయింట్‌తో అతిథి



వేణు తొట్టెంపూడి, అవంతిక మిశ్రా లీడ్ రోల్స్‌లో నటించిన వెబ్ సిరీస్ 'అతిథి'. దీన్ని రాండమ్ ఫ్రేమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై దర్శకుడు భరత్ వైజీ రూపొందించారు. దర్శకుడు ప్రవీణ్ సత్తారు షో రన్నర్‌గా వ్యవహరించారు. డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో ఈ నెల 19 నుంచి ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా దర్శకుడు వైజీ భరత్ మాట్లాడుతూ, 'నేను ఈ కథ చెప్పింది ఫస్ట్ వేణుగారికే. ఆయన ఒక కొత్త యాక్టర్‌లా ఈ వెబ్ సిరీస్ చేశారు. ఇందులో హర్రర్, థ్రిల్లర్ అంశాలుంటాయి. ప్రతి ఎపిసోడ్ ట్విస్టులతో సాగుతుంది. ఫ్యామిలీ అంతా చూసే వెబ్ సిరీస్ ఇది' అని చెప్పారు. 'ఈ వెబ్ సిరీస్ ఇంత బాగా వచ్చిందంటే ఆ క్రెడిట్ డైరెక్టర్ భరత్‌కు ఇస్తాను. భూమ్మీద మనమంతా అతిథులమే. కొద్ది కాలం ఉండి వెళ్లిపోతాం. మీ ఇంట్లోకి ఈ నెల 19న అతిథులుగా రాబోతున్నాం. ప్రవీణ్ సత్తారుకి థ్యాంక్స్. డైరెక్టర్ భరత్ ఈ సిరీస్‌ను చాలా గ్రిప్పింగ్‌గా తీశారు.ఒక్క ఎపిసోడ్ మిస్సయినా ట్విస్ట్ మిస్సవుతారు' అని హీరో వేణు తొట్టెంపూడి అన్నారు.

మెప్పించే న్యూ ఏజ్ లవ్‌స్టోరీ



రాజా విక్రమ్

రాజా విక్రమ్ ప్రధాన పాత్రలో భరత్ నరేన్ దర్శకత్వంలో శ్రీ అక్కియన్ ఆర్ట్స్ బ్యానర్ పై శ్రీధర్ మరిసా నిర్మించిన చిత్రం 'దిల్ సే'. న్యూ ఏజ్ లవ్ స్టోరీగా రూపొందిన ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది.

డైరెక్టర్ బాబీ కొల్లి ఈ చిత్ర ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ట్రైలర్ చాలా బావుంది. అందరికీ థ్రిల్ సర్‌ప్రైజ్ ఇవ్వాలనే కన్విక్షన్‌తో ఈ ట్రైలర్‌లో ఉన్న అమ్మాయి ఎవరో చెప్పలేదు. అదే ఈ సినిమాకి ప్రత్యేకతని తీసుకొచ్చింది' అని తెలిపారు. 'ఇది నా మొదటి ప్రాజెక్ట్. నా పాత్రను దర్శకుడు చాలా అద్భుతంగా రాశారు. ఈనెల 16న ఈటీలో ఇది స్ట్రీమింగ్ అవుతుంది' అని రాజా విక్రమ్ అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ,'ఇందులో మాస్క్ వేసుకున్న అమ్మాయి ఎవరనేది ఏదో ఒక రోజు అందరికీ తెలుస్తుంది. మా సొంత బ్రదర్ ఈ సినిమాని నిర్మించారు' అని చెప్పారు.

నా కెరీర్‌లో గర్వంగా చెప్పుకునే సినిమా



ఛోటా.కె.నాయుడు

విరాట్ కర్ణ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రూపొందుతున్న న్యూ ఏజ్ పొలిటికల్ థ్రిల్లర్ 'పెదకాపు-1'. ద్వారకా క్రియేషన్స్‌పై మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈనెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈ నేపథ్యంలో దీనికి డివోపీగా చేసిన ఛోటా కె. నాయుడు విలేకరులతో మాట్లాడుతూ, 'తన సినిమాల్లానే దర్శకుడు శ్రీకాంత్ చాలా కూల్‌గా ఉంటారు. అయితే నారప్పతో ఆయనలో ఒక కొత్త ట్రాన్స్‌ఫర్మేషన్ వచ్చింది. ఈ కథ చెప్పినప్పుడు కూడా ఇప్పుడు ట్రైలర్‌లో ఏది చూశామో అంత ఇంటెన్స్‌గా చెప్పారు. ఈ సినిమాతో తను నటన కూడా మొదలుపెట్టారు. ఈ కథ కొత్త ప్యాట్రన్, కొత్త కలర్స్, మేకింగ్‌ని డిమాండ్ చేసింది. ఇది నాకు సవాల్‌గా అనిపించింది. ట్రైలర్ విజువల్‌గా చాలా ఇంపాక్ట్‌గా ఉండటానికి కారణం దర్శకుడే. దర్శకుడి హెల్ప్‌తోనే ఇలాంటి అవుట్‌పుట్ వస్తుంది. హీరో ఎలా ఉండాలో కెమెరామెన్‌గా నాకొక విజన్ ఉంటుంది. విరాట్ కొత్తవాడు అనే ఫీలింగ్ రాలేదు. ఈ కథని 1983లో ఎన్టీఆర్ పార్టీ పెట్టినపుడు మొదలైన ఇన్సిడెంట్‌తో రాసుకున్నాడు. మిక్కీ ఇచ్చిన నేపథ్యంలో సంగీతం నన్ను సర్‌ప్రైజ్ చేసింది. అలాగే హీరోయిన్ ప్రగతి కూడా టెర్రిఫిక్‌గా పెర్ఫార్మ్ చేసింది. నా కెరీర్‌లోనే గర్వంగా చెప్పుకునే సినిమా ఇది' అని అన్నారు.

థ్రిల్ చేసే తంతిరం



హర్రర్ అంశాలతో కూడిన కుటుంబ కథ చిత్రంగా, భార్య భర్తల మధ్య ఒక ఆత్మ ప్రవేశిస్తే వారి దాంపత్య జీవితం ఎలా అనేది ఒక అందమైన ప్రేమకథతో తెరకెక్కిన సైకలాజికల్ థ్రిల్లర్ 'తంతిరం'.

థ్రిల్లింగ్ కాన్సెప్టుతో నవతరం నటీనటులతో తీసిన ఈ సినిమాని సినిమా బండి బ్యానర్ పె శ్రీకాంత్ కంద్రగుల నిర్మించారు. తాజాగా విడుదలైన ఈ చిత్ర ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది.

ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ,'థియేటర్లలో ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే సినిమా ఇది' అని చెప్పారు. 'నా లైఫ్‌లో ఇది చాలా పెద్ద మూవీ అవుతుంది. మిమ్మల్ని ఈ సినిమా కచ్చితంగా భయపెడుతుంది' అని నాయిక ప్రియాంక శర్మ అన్నారు. హీరో శ్రీకాంత్ గుర్రం మాట్లాడుతూ,' ఈ సినిమా ప్రతి ఒక్కరికీ గుర్తుండిపోతుంది' అని తెలిపారు. నిర్మాత శ్రీకాంత్ కంద్రగుల మాట్లాడుతూ,'సినిమా కోసం ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. హీరో శ్రీకాంత్ పేరు అందరికి వినిపించే పేరు అవుతుంది. నేను చాలా సినిమాలను ఓవర్సీస్ రిలీజ్ చేశాను. ఈ మూవీ పాన్ ఇండియా మూవీ. ఈ నెల 22న ఈ సినిమాని విడుదల చేస్తున్నాం' అని తెలిపారు.

ఏమా అందం..

విక్రాంత్, మెహరీన్ పిర్జాదా, రుక్సార్ థిల్లాన్ హీరో, హీరోయిన్స్‌గా భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న మూవీ 'స్పార్క్'. ఇందులో హీరోగా నటించడంతో పాటు విక్రాంత్ కథ, స్క్రీన్ ప్లే అందించారు. డైరెక్షన్ కూడా చేశారు. డెఫ్ ఫ్రాగ్ ప్రొడక్షన్స్ బ్యానర్ హై బడ్జెట్, టెక్నికల్ వాల్యూస్‌తో ప్రొడ్యూస్ చేసింది. సైకలాజికల్ థ్రిల్లర్ సినిమాగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి హేషం అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్నారు. బుధవారం ఈ సినిమాలోని మొదటి పాట 'ఏమా అందం'ను విశాఖలోని ఓ కాలేజీలో విడుదల చేశారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.